ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

ఖమ్మం : fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-6-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 143 పేజీలు: 8+16 వెల: 6.50


ఖతార్‌లో భారీ అగ్ని ప్రమాదం: 12 మంది భారతీయులు మృతి

నీట్‌లో నకి'లీల'లు.. బీహార్‌లో 24 మంది అరెస్టు

5

లక్నోలో భారీ అగ్నిప్రమాదం
18 మంది మృతి
మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రధాని

## భగ్గుమన్న కోచింగ్ సెంటర్

2



## బ్రిటన్ ప్రధాని కీర్ రాజీనామా

7



లేబర్ పార్టీ నాయకత్వాన్నీ వీడుతున్నట్లు ప్రకటన
దేశ ప్రయోజనాల కోసమే నిర్ణయం: స్టార్మర్
తదుపరి ప్రధాని రేసులో బర్న్‌హామ్, వెస్ స్ట్రీటింగ్
జులై 9 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

## 'భవ్య' ఫేజ్-1లో ప్రాధాన్యమివ్వండి

ఏరో - డిఫెన్స్ కారిడార్, రెండు మెగా లెదర్ పార్కులను మంజూరు చేయండి

హైదరాబాద్‌లో నేషనల్ డిజైన్ సెంటర్ ఏర్పాటుకు చొరవ చూపండి

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో మంత్రి శ్రీధర్ బాబు భేటీ



న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి పియూష్‌తో మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్22:** రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి, తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్య సాధనకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా.. వికసిత్ భారత్-2047 లక్ష్యసాధనలో కీలకపాత్ర పోషించేలా తెలంగాణ ఇండస్ట్రియల్ ఎకో సిస్టంను అభివృద్ధి చేస్తున్నామని, అందుకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా... రాష్ట్ర పారిశ్రామిక రంగానికి సంబంధించిన పలు అంశాలపై పీయూష్ గోయల్‌కు వినతి పత్రం అందజేశారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలో రూ. 8,500 కోట్ల పెట్టుబడితో గ్లోబల్ ఇన్నోవేషన్, ఆర్ అండ్ డీ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు హ్యుందాయ్ గ్రూప్ ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో అక్కడ లాజిస్టిక్ హబ్ అభివృద్ధికి కేంద్రం చొరవ చూపాలి అని మంత్రి శ్రీధర్ బాబు కోరారు. 'భవ్య పథకం పేజ్ 1లో భాగంగా రాష్ట్రంలో 15 నుంచి 20 ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ పార్కుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే డీపీఆర్‌లను >>2



సోమవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయిన ముఖ్యమంత్రి రేవంత్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

## 'మెట్రో'కు కేంద్రం సానుకూలం

రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో చర్చలు సంతృప్తికరం: సిఎం రేవంత్

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి భేటీ అయిన ముఖ్యమంత్రి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్22:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనకొనసాగుతోంది. తన పర్యటనలో భాగంగా కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సోమవారం సాయంత్రం సిఎం భేటీ అయ్యారు. కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డితో కలిసి ఆయన అశ్విని వైష్ణవ్‌తో రైల్ భవన్‌లో సమావేశమయ్యారు. సుమారు 2గంటల పాటు సమావేశం జరిగింది. మెట్రో ఫేజ్2 అనుమతి, ఐఆర్‌ఎఫ్‌సి రుణాలు తదితర అంశాలపై చర్చించారు. ఇటీవల కిషన్‌రెడ్డికి రేవంత్ బహిరంగ లేఖ రాశారు. రైల్వే మంత్రితో భేటీ ఏర్పాటు చేయించాలని కోరారు. ఈ క్రమంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. కాగా, సమావేశం అనంతరం సిఎం రేవంత్‌రెడ్డి తనను కలిసిన మీడియా ప్రతినిదులతో మాట్లాడుతూ సానుకూల చర్చలు జరిగాయని వెల్లడించారు. మంగళవారం కేంద్ర పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో తాను,కిషన్‌రెడ్డి భేటీ అవుతామని సిఎం తెలిపారు.ఖట్టర్‌తో సమావేశం అనంతరం ఒక క్లారిటీ వస్తుందని చెప్పారు. కాగా, ఇటీవల తరచూ తీవ్ర విమర్శలు చేసుకున్న సిఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సోమవారం సాయంత్రం >>2

## దేవరకద్రకు 'డిఆర్‌డిఒ' ఇవ్వండి

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేయండి

రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌ను కోరిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్22:** భారత వాయు సేన (ఐఎఎఫ్) ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అన్ని వసతులతో అభివృద్ధి చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని రక్షణ శాఖ కార్యాలయం కర్తవ్య భవన్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. >>2



సోమవారం న్యూఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌తో సిఎం రేవంత్



హైదరాబాద్‌లో బసవతారకం ఆసుపత్రి రజతోత్సవ వేడుకల్లో కేంద్ర మంత్రులు పెమ్మసాని, అనుప్రియ, ఎపి సిఎం చంద్రబాబు, మంత్రి దామోదర, బాలకృష్ణ

## లాభాపేక్షలేని ఆసుపత్రులు కావాలి

ఎన్టీఆర్ విజన్‌తోనే బసవతారకం ఆసుపత్రి: ఎపి సిఎం చంద్రబాబు

అమరావతిలో కేన్సర్ ఆసుపత్రి: రజతోత్సవ వేడుకల్లో బాలకృష్ణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్22:** ఇండో అమెరికన్ బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి, పరిశోధనా సంస్థ తన సేవామార్గంలో 25 సంవత్సరాల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా రజతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం సాయంత్రం హైటెక్స్‌లో నిర్వహించిన ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి అనుప్రియ పటేల్, పెమ్మసాని చంద్రశేఖర్, మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు, తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఏపీమంత్రి సత్యకుమార్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి,విశాఖ ఎంపీ భరత్, ఆసుపత్రి ట్రస్ట్ >>2



## కాంగ్రెస్ ఫస్టాఫ్ అట్టర్ ఫ్లాప్

ప్రతి కార్యకర్తకు డిజిటల్ కార్డు: కెటిఆర్

**పరకాల, జూన్22, ప్రభాతవార్త:** రేవంత్ రెడ్డి పాలన ఫస్టాఫ్ అట్టర్ ఫ్లాప్ అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సోమవారం దామెర మండల కేంద్రంలోని ఏఎన్‌ఆర్ గార్డెన్‌లో పరకాల నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పార్టీకి చెందిన ముఖ్యనేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎస్ఐఆర్,పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి.. హిట్లర్‌నాకు ఆదర్శం అనడంచాలా సిగ్గు చేటని మాట్లాడారు. రేవంత్ ఫస్టాఫ్ పాలన అట్టర్ ఫ్లాప్ అని కేటీఆర్ పేర్కొన్నారు. హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకున్న రేవంత్ వల్ల ప్రజలకు న్యాయం >>2

## వడివడిగా ఆర్డీఎస్

తుంగభద్ర జలాల్లో తెలంగాణ వాక్కులు కాపాడుకొంటాం

త్వరితగతిన తుమ్మిళ్ల ఎత్తిపోతలు: మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ ఆధునీకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆర్‌డిఎస్ వ్యవస్థను బలోపేతం చేయడం, తుంగభద్ర జలాలపై తెలంగాణ హక్కులను పరిరక్షించడం, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం రెండో దశ పనులను వేగంగా అమలు చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆర్‌డిఎస్,తుంగభద్ర జలాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతు ప్రతినిధులు ఆర్‌డిఎస్ హెడ్‌వర్క్స్ దుస్థితి,పొరుగు రాష్ట్రాల అక్రమ నీటి మళ్లింపులు, తుంగభద్ర జలాశయంలో పూడిక సమస్యను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్‌డిఎస్ కాలువ గట్టులను పటిష్టం చేయాలని, నీటి నష్టాలను తగ్గిస్తూ కాలువల సామర్థ్యాన్ని పెంచే చర్యలు చేపట్టాలని సూచించారు.తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం రెండో దశలో భాగంగా మల్లమ్మకుంట, జూలకల్, వల్లూరు జలాశయాల నిర్మాణానికి అవసరమైన భూసేకరణను ప్రాధాన్యతతో చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈ జలాశయాల ద్వారా సుమారు 2.12 టిఎంసిల స్థూల నీటి నిల్వ సామర్థ్యం ఏర్పడుతుందని తెలిపారు.భూసేకరణ వల్ల ప్రభావితమయ్యే రైతులకు న్యాయమైన, తగిన పరిహారం అందేలా చూడాలని రెవెన్యూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మల్లమ్మకుంట జలాశయం వల్ల 567 ఎకరాలు, జూలకల్ వల్ల 382 ఎకరాలు, వల్లూరు జలాశయం వల్ల 2,216 ఎకరాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని అధికారులు వివరించారు.ఆర్‌డిఎస్ కాలువ వ్యవస్థ ద్వారా తెలంగాణకు హామీ మేరకు నీటి విడుదలలు కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఆర్‌డిఎస్ నిర్వహణ, కెసి కెనాల్ నీటి విడుదలలు, అంతర్రాష్ట్ర సమన్వయం, ట్రిబ్యునల్ తీర్పుల అమలు వంటి అంశాలపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. సాంకేతిక అంశాలు, రైతుల ఆందోళనలు, న్యాయపరమైన అంశాలు, విధానపరమైన ప్రత్యామ్నాయాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి సిఎం ఎఆర్‌రెడ్డి కి సమర్పించాలని ఉత్తమ్ ఆదేశించారు.ఆర్‌డిఎస్ ఆధునీకరణ, తుంగభద్ర ఆనకట్ట భద్రత, తుంగభద్ర బోర్డు పాత్ర వంటి అంశాలపై త్వరలోనే ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా చర్చిస్తామని మంత్రి తెలిపారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూనే తెలంగాణ నీటి హక్కులను కాపాడుకొనడానికి దృఢంగా వ్యవహరిస్తామని తెలిపారు. తుంగభద్ర జలాలను తెలంగాణకు న్యాయంగా అందేలా అన్ని స్థాయిల్లో చర్యలు కొనసాగిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఇ. శ్రీధర్,సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఇంజినీర్ ఇన్‌చీఫ్ జనరల్ రమేష్ బాబు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## బొగ్గు లారీ ఢీకొని డిటిఒ వెంకన్న దుర్మరణం

పోలీసుల అదుపులో లారీ డ్రైవర్

భూపాలపల్లిలో ఘోర ప్రమాదం

ఫోన్ మాట్లాడుతూ డ్రైవర్ లారీ నడపడమే కారణం?

**జయశంకర్ భూపాలపల్లి, జూన్ 22, ప్రభాతవార్త:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం రవాణా శాఖలో తీవ్ర విషాదాన్ని నింపింది. విధి నిర్వహణలో ఉన్న జిల్లా రవాణా శాఖ అధికారి (డిటిఒ) మాల్లోజు వెంకన్న, అజాగ్రత్తగా వాహనం >>2

## జిల్లాకు ఒక మండలంలో ఇంటెగ్రేటెడ్ భూభారతి

వేగంగా సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం

యేడాదిలో 3.65 లక్షల పాస్‌బుక్‌ల జారీ: మంత్రి పొంగులేటి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్22:** రైతు భూమికి చట్టబద్ధమైన రక్షణ, స్పష్టమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ, హౌసింగ్, సమాచార మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందన్నారు. సోమవారం నాడు రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన 2025 ఏప్రిల్ 14 నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 3.65 లక్షల పాస్‌బుక్‌లు జారీ చేసినట్లు వెల్లడించారు. గతంలో పాస్‌బుక్ కోసం రైతులు నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితులకు ముగింపు పలుకుతూ రైతు దరఖాస్తు చేసిన వెంటనే పాస్‌బుక్ అందే విధంగా వ్యవస్థను పారదర్శకంగా, వేగవంతంగా రూపొందించామని చెప్పారు. రైతు ఒక్కసారి దరఖాస్తు చేస్తే తిరిగి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూముల క్రయవిక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ జత చేసే నిబంధనను ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఐదు మండలాల్లో పరిస్థితులను మంత్రి సమీక్షించారు. ఈ విధానం విజయవంతంగా కొనసాగుతోందని అధికారులు వివరించగా, అక్కడి అనుభవాలు, సమస్యలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే రెండో దశలో ప్రతి జిల్లాకు ఒక మండలంలో అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. >>2

## ఎరువు బరువు




అన్నదాతలపై మరింత భారం..

రూ.300 నుండి రూ.550 దాకా పెంపు

కాంప్లెక్స్, పొటాష్, ఫాస్పేట్ ధరలకు రెక్కలు

ఖరీఫ్ ఆరంభంలోనే రైతులు విలవిల

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న అన్నదాతలకు ఖరీఫ్ ఆరంభంలోనే పెరిగిన ఎరువుల ధరలు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే వ్యవసాయంలో పెట్టుబడుల భారం రోజురోజుకు పెరుగుతుండడంతో ఇబ్బందులు పడుతున్న రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు తోడు తాజాగా ఎరువుల ధరలు కూడా భారీ పెరిగడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రధానంగా కాంప్లెక్స్, డిఎపి, సూపర్ ఫాస్పేట్, పొటాష్ వంటి ఎరువుల ధరలకు అమాంతం రెక్కలొచ్చాయి. దీంతో అన్నదాతకు పెరిగిన ఎరువుల ధరలు మరింత కుంగదీస్తున్నాయి. ఈ సీజన్‌లో సాగు చేసే వరి, పత్తి తదితర పంటలకు కాంప్లెక్స్ ఎరువులు తప్పనిసరి. ఈ తరుణంలోనే కాంప్లెక్స్ >>2



సోమవారం కోల్‌కతాలో బడ్జెట్ ప్రతులతో బెంగాల్ సిఎం సువెందు అధికారి, ఆర్థిక మంత్రి స్వప్నదాస్‌గుప్తా

# డిటిఓ వెంకన్న దుర్మరణం

>> నడిపిన లారీ డ్రైవర్ కారణంగా ప్రాణాలు కోల్పోయారు. ఫోన్‌లో మాట్లాడుతూ లారీని వేగంగా నడపడం వల్లే ఈ దుర్ఘటన చోటు చేసుకుందని తెలుస్తోంది.ప్రమాదం జరిగిన తీరు సోమవారం నాడు జరిగిన ఈ దుర్ఘటన స్థానికంగా కలకలం రేపింది. తాడిచెర్ల ఓపెన్‌కాస్ట్ నుంచి చెల్పూర్ జెన్కోకు బొగ్గు లోడ్‌తో వెళ్తున్న లారీ (టీఎస్ 22 టీ 2687), చెల్పూర్ ఆర్టీఓ కార్యాలయం ముందు బీభత్సం సృష్టించింది. ఆ సమయంలో డిటిఓ వెంకన్న కార్యాలయం ముందు ఒక హార్వెస్టర్‌ను సీజ్ చేసి, దానిని కార్యాలయం లోపలికి పంపిస్తున్నారు. ఇదే సమయంలో లారీ డ్రైవర్ ఫోన్‌లో మాట్లాడుతూ..వాహనంపై నియంత్రణ కోల్పోయి పక్కనే ఉన్న వెంకన్నపై నుంచి వెళ్ళినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకన్న అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ కు తరలించారు. నిందితుడైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వెంకన్న మృతితో ఆయన స్వస్థలమైన మహబూబాబాద్ జిల్లా మరిపెడలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు మరియు ఒక కుమారుడు ఉన్నారు. రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ డిటిఓ వెంకన్న ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## డిటిఓ వెంకన్న మృతిపై రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి.. విచారణకు ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్22:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విధి నిర్వహణలో ఉండగా బొగ్గు టిప్పర్ లారీ ఢీకొని జిల్లా రవాణా శాఖ అధికారి ఎం. వెంకన్న ఘోర మరణం చెందిన ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డీటీఓ వెంకన్న మృతిపై సమగ్ర విచారణ జరపాలని రవాణాశాఖ జాయింట్ కమిషనర్‌ను సీఎం ఆదేశించారు. ఈ ఘటనపై వీలైనంత త్వరగా పూర్తి స్థాయి నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. వెంకన్న మృతి పట్ల సంతాపం ప్రకటించిన సీఎం.. ఆయన కుటుంబానికి ప్రభుత్వం తరఫున భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన డీటీఓ వెంకన్న కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా ఆ కుటుంబానికి అందాల్సిన అన్ని ప్రయోజనాలు త్వరగా అందేలా చూస్తామన్నారు.

**జేటీసీ చంద్రశేఖర్ గౌడ్ విచారణాధికారిగా నియామకం**

భూపాలపల్లి జిల్లాలోని చెల్పూర్ ఆర్‌టీవో కార్యాలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆర్‌టీవో వెంకన్న మృతిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ మేరకు జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(జేటీసీ) ఎం చంద్రశేఖర్ గౌడ్‌ను విచారణాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం జీవో ఆర్‌టీ నంబర్ 346ను జారీ చేసింది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా రవాణా శాఖ కమిషనర్ ద్వారా ప్రభుత్వానికి అందజేయాలని ఉత్తర్వుల్లో రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఆదేశించారు.

# ఇంటెగ్రేటెడ్ భూభారతి

>> అలాగే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని మంత్రి ఆదేశించారు. మొత్తం 9.25 లక్షల సాదాబైనామా దరఖాస్తులలో, ఇప్పటివరకు ఆరు లక్షల దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలియజేశారు. మిగిలిన దరఖాస్తులకు వచ్చే 15 రోజుల్లో నోటీసులు జారీ పూర్తి చేయాలని, ఆ తర్వాత 30 రోజుల గడువు ముగిసిన వెంటనే అర్హులైన దరఖాస్తులను పరిష్కరించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం సాదాబైనామా అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. దరఖాస్తులు స్వీకరించినప్పటికీ వాటి పరిష్కారానికి 2020 ఆర్వోఆర్ చట్టంలో సరైన నిబంధనలు లేకపోవడం వల్ల వేలాది మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తమ ప్రభుత్వం నిబంధనలను సవరించి దరఖాస్తుదారులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టిందని తెలిపారు.

# ఎరువు బరువు

>> ఎరువుల ధరలను ప్రభుత్వం భారీగా పెంచి రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది. మరోవైపు ఎరువుల వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలు పెంచి రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. పత్తి, మొక్కజొన్న వంటి పం టలకు ఎకరాకు ఒకటి నుంచి రెండు బస్తాల వరకు కాంప్లెక్స్ ఎరువులను వాడాల్సిందే. గ్రోమోర్, యూరియా యథాతథంగా ఉన్నా కాంప్లెక్స్ ఎరువులపై రూ.300 రూ. 550 వరకు పెంచారు. యూరియా, డీఏపీ ధరలు స్థిరంగానే ఉన్నప్పటికీ మిశ్రమ ఎరువుల ధరలు ఆకాశాన్నంటడం మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా తయారైంది. రాష్ట్రంలోని జిల్లాల్లో అత్యధికంగా వినియోగించే 20:20:0:13 కాంప్లెక్స్ ఎరువు గత నెల రోజుల కిందట 50 కిలోల బస్తాకు గరిష్ట ధర రూ. 1,450 ఉండేది. ఒక్కసారిగా ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రూ.350 పెరిగింది. అంటే బస్తా ధర రూ.1,800 లకు కొనుగోలు చేశారు. ఇప్పుడు రైతులు ఇంకా సేద్యం మొదలు పెట్టక ముందే మరో రూ.350 పెంచారు. ఫలితంగా దుకాణాల్లోకి కొత్తగా వచ్చే కాంప్లెక్స్ ఎరువులు ఇప్పుడు బస్తా ధర రూ.2,150 కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడింది. అంటే నెలన్నర రోజుల వ్యవధిలోని రూ.600 పెరగడం కర్షకునికి కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. రాష్ట్రం మొత్తం మీద అత్యధికంగా వినియోగించే ఎరువులకు పెరగడం విశేషం. ముఖ్యంగా 12:32:16 ఎరువులు బస్తా రూ.1,900 ఉండగా, రూ.550 పెరిగిన రూ.2,450కి చేరింది.

అలాగే బస్తా రూ.1,950 ఉన్న 10:26:26 ఎరువులకు రూ.500 పెరిగి ఇప్పుడది రూ.2,450కి, రూ.615 ఉన్న సింగిల్ సూపర్ ఫాస్పేట్ (ఎస్ఎస్‌పి)కు రూ.385 పెరిగి రూ.1,000కి, రూ.1,800 ఉండే 20:20:0:13 ఎరువులకు రూ.350 పెరిగి రూ.2,150కి, రూ?1,650 ఉండే 15:15:15 ఎరువులకు రూ.300 పెరిగి రూ.1,950కు, రూ.1,850 ఉండే మ్యూరో ఆఫ్ పొటాష్ (ఎంఒపి) ఎరువు బస్తాకు రూ.125 పెరిగి ఇప్పుడు రూ.1,975కు చేరుకుంది. ఈ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా అత్యధికంగా వినియోగించే ఎరువులు ధరలు పెరిగి రైతాంగం నడ్డి విరుస్తున్నాయి.

# భగ్గుమన్న కోచింగ్‌సెంటర్

## లక్నోలో భారీ అగ్నిప్రమాదం

## 18 మంది మృతి

### మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రధాని

**లక్నో, జూన్ 22:** ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం లక్నో నగరం అలీగంజ్‌లోని పురానియా ప్రాంతంలో ఉన్న మూడు అంతస్తుల వాణిజ్య భవనంలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 18 మంది మృతి చెందారని పోలీసులు తెలిపారు. మృతులు 20 నుంచి 24 ఏళ్ల మధ్య వయస్సు వారని చెబుతున్నారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. భవనంలోని ఒక కోచింగ్ సెంటర్‌లో మధ్యాహ్నం మంటలు చెలరేగడంతో, ప్రాంగణమంతా వేగంగా దట్టమైన పొగతో నిండిపోయి, అక్కడున్న విద్యార్థులు, ఇతరులు భయాందోళనలతో ప్రాణాలతో బయటపడాలనే తీవ్ర ప్రయత్నంలో, కొందరు పై అంతస్తుల నుండి, టెర్రస్ నుండి దూకి తీవ్రంగా గాయపడ్డారు. మధ్యాహ్నం భవనం నుండి మొదటగా దట్టమైన పొగ రావడం కనిపించిందని, ఆ తర్వాత మంటలు వేగంగా వ్యాపించి భవనం మొత్తాన్ని చుట్టుముట్టాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మంటలు, పొగతో బయటకు వెళ్లే మార్గాలు మూసుకుపోవడంతో, భయాందోళనలకు గురైన విద్యార్థులు కిటికీలు, పైకప్పు వైపు పరుగులు తీశారు. కొందరు తమ ప్రాణాలను కాపాడుకోవడానికి నేలపైకి దూకినట్లు సమాచారం. అగ్నిమాపక దళం, పోలీసులు, జిల్లా యంత్రాంగం నుండి పలు బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. జిల్లా మేజిస్ట్రేట్, పోలీస్ కమిషనర్‌తో సహా ఉన్నతాధికారులు ఘటనా స్థలంలో ఉండి, సహాయక, పునరావాస చర్యలను పర్యవేక్షించారు. భవనం గోడకు రంధ్రం చేసి లోపల చిక్కుకున్న వారిని సహాయక బృందాలు రక్షించాయి. ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలియజేశారు. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించగా, క్షతగాత్రులకు కేంద్రం రూ.50 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.50 వేలు ఆర్థిక సాయం ప్రకటించారు. అలీగఢ్ పర్యటనలో ఉన్న సిఎం ఆదిత్యనాథ్ హుటాహుటిన లక్నోకు తిరిగి వచ్చి ఆసుపత్రిలో బాధితులను పరామర్శించారు.

## వారం - వర్జ్యం

23-06-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, ఆరుద్ర కార్తె
నవమి సా.4.43,
హస్త ఉ.11.56
వర్జ్యం : రా.8.38-రా.10.22
దు.ఉ.8.13-ఉ.9.05,
(2)రా.11.58-రా.12.50
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** చెప్పుకోదగిన మార్పు ఆలోచనా ధోరణిలో ఏర్పడుతుంది. జీవిత భాగస్వామితో రాజీధోరణి. అవలంభించడం మేలు.

**వృషభం:** రాజకీయ, కళారంగాలలో వారికి విదేశీ పర్యటనలు. స్థలాలు కొనుగోలు చేస్తారు. నూతన విద్యావకాశాలు కలవు.

**మిథునం:** నిదానమే ప్రధానమన్న నానుడిని గుర్తుపెట్టుకుని ఒకటి రెండు మార్లు ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటారు.

**కర్కాటకం :** నూతన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. మిత్రుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**సింహం:** ఇంటర్వ్యూలు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఊహించని అవకాశాలు అప్రయత్నంగా లాభిస్తాయి.

**కన్య :** కష్టపడి పైకి రావాలన్న మీ ధ్యేయం నెరవేరుతుంది. లోన్లు మంజూరు అవుతాయి. బంధువుల కలయిక.

**తుల :** గతంలో మీకు సానుకూలపడని వ్యవహారాలు అనూహ్యంగా సానుకూల పడతాయి. వివాహ యత్నాలు ఫలిస్తాయి.

**వృశ్చికం:** కుటుంబ బాధ్యతలు పెరుగుతాయి. కళాకారులు సన్మాన, సత్కారాలు పొందుతారు. వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**ధనుస్సు:** మొండికేసిన స్థిరాస్తి రిజిస్ట్రేషన్ కాకుండానే స్వాధీనములోని వచ్చుట జరుగుతుంది. ప్రముఖుల కలయిక.

**మకరం:** ముఖ్యమైన ప్రయాణాలు తత్సంబంధిత యత్నాలు కొంత ఆలస్యముగా సానుకూలపడతాయి.

**కుంభం:** తనఖాలో ఉంచిన డాక్యుమెంట్స్‌ను విడుదల చేసుకుంటారు. ఇతరులకు సహాయం అందిస్తారు.

**మీనం :** వీసా, పాస్‌పోర్ట్ అంశాల కలిసి వస్తాయి. వాక్చాతుర్యంతో ఎదుటివారిని ఆకట్టుకొని ముందుకు సాగుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# లాభాపేక్షలేని ఆసుపత్రులు కావాలి

>> చైర్మన్ బాలకృష్ణ,నారా బ్రాహ్మణి,నటి గౌతమి తదితరులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజోత్సవ కార్యక్రమాన్ని సిఎం చంద్రబాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'బసవ తారకం కాన్సర్ ఆస్పత్రి ప్రస్థానం వెనుక ఓ కథ ఉంది. మా అత్తగారు బసవతారకం స్ఫూర్తితో ఇది నిర్మితమైంది.ఆమెకు సోకిన క్యాన్సర్ వ్యాధి చికిత్స కోసం ఆ సమయంలో ఎక్కడా ఆస్పత్రి లేని పరిస్థితి. ముంబై, చెన్నై లాంటి ప్రాంతాల్లోనే క్యాన్సర్ ఆస్పత్రులు ఉండేవి, ఆగస్టు సంక్షోభం సమయంలోనే ఆమె క్యాన్సర్ కారణంగా మృతి చెందారు. క్యాన్సర్ వ్యాధికి చికిత్స అందక ఇక ఎవరూ చనిపోకూడదనే ఆలోచనతో ఈ ఆస్పత్రిని నిర్మించారు' అని చెప్పారు. ఎన్టీఆర్ విజన్‌తో పాటు పేదలకు వైద్య చికిత్స అందించాలన్న సంకల్పంతో ఆస్పత్రి నిర్మాణం చేశాం, మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ మేనేజింగ్ ట్రస్టీగా, డాక్టర్ నోరి దత్తాత్రేయుడు లాంటి ప్రముఖ వైద్యులతో ఈ ఆస్పత్రి ప్రారంభమైంది అని పేర్కొన్నారు.తొలుత 100 పడకల ఆస్పత్రిగా ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిని ప్రారంభించాం.మొక్కగా నాటిన ఈ ఆస్పత్రి ఇప్పుడు మహా వృక్షంగా ఎదిగింది. 25 ఏళ్ల ప్రస్థానంలో ఎందరో త్యాగాలు ఉన్నాయి, వివిధ సవాళ్లను అధిగమించి ఈ ఇనిస్టిట్యూట్ చైర్మన్‌గా బాలకృష్ణ నియమితులు అయ్యారు అని చెప్పారు. అన్‌స్టాపబుల్‌గా బాలకృష్ణ ఈ ఆస్పత్రి కోసం పనిచేస్తున్నారు. ఎవర్ గ్రీన్ హీరోగా, హిందూపూర్ ఎమ్మెల్యేగా ఆయన సేవలు అందిస్తున్నారు ఎంత బిజీగా ఉన్నా బసవతారకం ఆస్పత్రికి వెళ్లి రోగులను పరామర్శిస్తూ వారికి స్వాంతన కలిగిస్తున్నారు అని పేర్కొన్నారు. లాభాపేక్ష లేని సంస్థగా బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిని నడుపుతున్నారు. 650 పడకల ఆస్పత్రిగా ప్రస్తుతం ఇక్కడ సేవలందుతున్నాయి. తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుంచి రోగులు ఈ ఆస్పత్రికి వస్తున్నారు ఏడాదికి 3 లక్షల పైచిలుకు మంది రోగులకు ఈ ఆస్పత్రి సేవలు అందిస్తోందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వీలుగా ఏపీలో ప్రివెంటివ్ , క్యూరెటివ్, ప్రిడిక్టివ్ విధానాన్ని అనుసరిస్తున్నాం పబ్లిక్ హెల్త్ రంగంలో ప్రభుత్వం ఒక్కటే ప్రజారోగ్యాన్ని కాపాడలేదు. లాభాపేక్ష లేని ఆస్పత్రులు కూడా వస్తే పేదలకు వైద్య సేవలు మెరుగ్గా అందుతాయన్నారు. బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రుల లాంటి లాభాపేక్ష లేని ఆస్పత్రులు మరిన్ని రావాల్సి ఉందన్నారు.ప్రతి ఒక్కరూ భారతీయ సనాతన ధర్మం బోధించిన ఆరోగ్యకరమైన జీవన శైలికి మళ్లాల్సిన అవసరం ఉందని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. వైద్య రంగంలో "ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దేన్ క్యూర్" అన్నది అత్యంత ముఖ్యమైన సూత్రమని, వ్యాధి వచ్చాక బాధపడటం కంటే రాకుండా చూసుకోవడం ఉత్తమమని స్పష్టం చేశారు. మంచి పోషకాహారం తీసుకోవడం ద్వారానే క్యాన్సర్, ఇతర మొండి రోగాలను అరికట్టగలమని చెప్పారు.తృణధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకోవడం ద్వారా మన రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చన్నారు. పర్యావరణాన్ని కాపాడుకుంటూ, ప్రశాంతమైన, ఒత్తిడి లేని జీవనాన్ని గడపడం ద్వారా ఎన్నో వ్యాధులను ముందే అరికట్టవచ్చన్నారు. క్యాన్సర్ పట్ల సమాజంలో భయాన్ని పోగొట్టి, అవగాహన పెంచడం,ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ఎంతో ముఖ్యమన్నారు.ఒక తల్లి పడిన వేదనకు, బసవతారకం స్మృతికి నివాళిగా, భవిష్యత్తులో ఏ ఒక్కరూ వైద్యం అందక ప్రాణాలు కోల్పోకూడదనే ఉదాత్తమైన ఆశయంతో, లాభాపేక్ష లేని ఒక స్వచ్ఛంద ట్రస్టుగా పని ప్రారంభించిన ఈ సంస్థ పాతికేళ్ల కాలంలో ఎంతో మంది రోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడమే కాకుండా, వేలాది మందికి ఉచితంగా లేదా సబ్సిడీ ధరలపై చికిత్సలు అందించిందని అభినందించారు. కేవలం చికిత్సకే పరిమితం కాకుండా, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సుల ద్వారా పల్లె పల్లెకూ వెళ్లి ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాలను నిర్వహిస్తూ, వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడంలో బసవతారకం ఆసుపత్రి చేస్తున్న కృషి అమోఘమైనదన్నారు.ఈ సందర్భంగా మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ క్యాన్సర్ కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయని అన్నారు. బసవతారకం ఆస్పత్రిలో నాణ్యమైన సేవలు అందుతున్నాయని కొనియాడారు. లక్షలమంది రోగులకు బసవతారకం ఆస్పత్రి అండగా నిలిచిందని ప్రశంసించారు. అంతర్జాతీయస్థాయి వైద్య సేవలు తక్కువ ధరకే అందిస్తున్నారని వెల్లడించారు. క్యాన్సర్ రాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో కాన్సర్ రిజిస్ట్రీ మెయింటెన్ చేస్తున్నామన్నారు. కాన్సర్‌ను నోటిఫైడ్ వ్యాధిగా గుర్తించామని వెల్లడించారు. బాలకృష్ణ మాట్లాడుతూ మా అమ్మ బసవతారకం క్యాన్సర్‌తో చనిపోయారని పేర్కొన్నారు. క్యాన్సర్‌తో బాధపడేవారికి అండగా ఉండాలనే ఈ ఆస్పత్రి నిర్మించామన్నారు. దేశంలోనే ప్రముఖ క్యాన్సర్ ఆస్పత్రిగా పేరు తెచ్చుకున్నామని వెల్లడించారు. క్యాన్సర్‌తో అనేక కుటుంబాలు ఆర్థికంగా నలిగిపోతున్నాయని పేర్కొన్నారు. ఖర్చులు భరించలేక అనేక కుటుంబాలు సమస్యలు ఎదుర్కొంటున్నాయన్నారు. బసవతారకం ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సేవలు చూసి గర్వపడుతున్నామన్నారు. అమరావతిలో క్యాన్సర్ ఆస్పత్రి నిర్మిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని బసవతారకం ఆస్పత్రిని మరింత విస్తరిస్తామని వెల్లడించారు.

నటుడిగా, ఎమ్మెల్యేగా కాదు ఒక కుమారుడిగా మీ ముందు నిల్చున్నానన్నారు. మా అమ్మకు క్యాన్సర్ సోకినప్పుడు ఎంతో బాధపడ్డామని చెప్పారు. మాకు డబ్బు ఉంది కనుక గట్టిగా పోరాడగలిగాం, మరి డబ్బు లేనివారు ఎలా పోరాడతారని మా అమ్మ మమ్మల్ని అడిగిందన్నారు. అప్పుడే ఈ ఆస్పత్రి ఏర్పాటు చేయాలన్న ఆలోచన వచ్చిందని చెప్పారు. పేదలకు అండగా ఉండాలనే లక్ష్యంతోనే ఆస్పత్రి ప్రారంభమైందని వెల్లడించారు. వేలమంది క్యాన్సర్ రోగులకు ఈ ఆస్పత్రి ఆశాకిరణంగా నిలిచిన్నారు. ఆస్పత్రిలో రోజుకు 35 నుంచి 40 శస్త్రచికిత్సలు చేస్తున్నామని వెల్లడించారు. క్యాన్సర్ అనేది చాలా ఘోరమైన జబ్బు అని నటి గౌతమి అన్నారు. కాన్సర్ బారిన పడిన వాళ్లకు తమ సేవలతో జీవితాన్ని ఇస్తున్న ఆసుపత్రికి సెల్యూట్ చేస్తున్నట్లు చెప్పారు. కాగా, గతంలో గౌతమి రొమ్ము కాన్సర్‌ను జయించారు.



బుధవారం కాంచీపురంలో పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఆశీర్వాదం తీసుకొంటున్న గవర్నర్ శుక్లా దంపతులు

# కాంగ్రెస్ ఫస్టాఫ్ అట్టర్ ఫ్లాప్

>> జరగదన్నారు.కేసీఆర్ పథకాలను కనుమరుగు చేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నా అది సాధ్యం కాదన్నారు. రెండున్నర ఏళ్లలో కాంగ్రెస్ చేసింది శూన్యమన్నారు. ట్రైలర్ రిలీజ్ కాగానే సినిమా హిట్ లేదా ఫ్లాప్ అని చెబుతున్నట్లే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటర్వెల్‌కే ఫ్లాప్ అయిందని సెటైర్లు వేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేస్తా అంటున్నాడని, కనీసం లక్షాధికారి కూడా చేయలేదని ఎద్దేవా చేశారు.అమలు కానీ హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని,100 రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ఎందుకు అమలు చేయలేదన్నారు. మొదటి సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, ఇప్పటి వరకు 4 వేల ఉద్యోగాలు కూడా ఇయ్యలేదన్నారు.

ఒక్కరికి లక్షా..25 వేలు కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ ఉందన్నారు. నిరుద్యోగుల 4 వేల నిరుద్యోగ భృతి ఇస్తా అని అది కూడా ఎగ్గొట్టాడన్నారు.రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా నిజాయితీగా ఎన్నికలు జరిగితే కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ 100 సీట్లు గెలిచి తీరుతుందని కేటీఆర్ స్పష్టంచేశారు. పార్టీ కోసం శ్రమించిన ప్రతి కార్యకర్తకు డిజిటల్ గుర్తింపు కార్డు ఇస్తామని, దీంతో అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ కార్యాలయాల్లో గౌరవం లభించే పరిస్థితి ఉంటుందని వివరించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఏజెంటే కథానాయకుడిగా వ్య వహరించాలని సూచించారు. రాష్ట్రంలో దండుపాళ్యం బ్యాచ్‌ను తరిమికొట్టే బాధ్యత పార్టీ కార్యకర్తలదేనని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, వినయ్ భాస్కర్, నాయకులు వాసుదేవ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్లు, పిఎసిఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, ఆయా మండలాల బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, మహిళలునాయకురాళ్లు పాల్గొన్నారు.

# 'మెట్రో'కు కేంద్రం సానుకూలం

>> ఢిల్లీలో ఒకే ఫ్రేమ్‌లో కనిపించారు. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ సందర్భంగా పలకరించుకున్నారు. దీంతో రాజకీయ విమర్శలు ఎలా ఉన్నా అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఇది మంచి సంప్రదాయమని కొందరు నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

# దేవరకద్రకు 'డిఆర్‌డిఓ' ఇవ్వండి

>> ఈ సందర్భంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు అంశాల్లో పూర్తిగా సహకరిస్తామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఆదిలాబాద్‌లో భారతీయ వాయు సేన ఆధ్వర్యంలో రానున్న ఎయిర్‌పోర్ట్ దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందున, దానిని భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహకరిస్తామని రక్షణశాఖ మంత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎంఆర్‌వో, హ్యాంగర్ సౌకర్యాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఇటీవల మధ్య ఆసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్ ను ఏర్పాటు చేసుకోవడానికి సరైన ప్రదేశాలను అన్వేషిస్తున్నాయని, హ్యాంగర్ ఏర్పాటుకు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అత్యంత అనుకూలమైనందున ఆ దిశగా అభివృద్ధి చేయాలని రక్షణ శాఖ మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. తమ కీలకమైన ప్రాజెక్టు ఏర్పాటుకు డీఆర్‌డీఓ/డీఆర్‌డీఎల్ మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీప ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నందున ఆ ప్రాజెక్టును త్వరగా మంజూరు చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీ వికాస్‌రాజ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కె.ఎస్.శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అజిత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.



సోమవారం ఉలాన్‌బాటర్‌లో మంగోలియా అధికారులతో భేటీ అయిన విదేశాంగ మంత్రి జైశంకర్ బృందం

# ప్రతి ఓటును కాపాడాలి బిఎల్‌ఎలు అప్రమత్తం

## ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో: మీనాక్షి, మహేష్ గౌడ్

**హన్మకొండ బ్యూరో, జూన్ 22, ప్రభాతవార్త:** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) అవగాహన సదస్సు, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం టీపీసీసీ అధ్యక్షుడు పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తర్వాత నిర్వహించిన బీఎల్ఏల శిక్షణా సదస్సులో పాల్గొని ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, పార్టీ కార్యకర్తల బాధ్యతలపై నేతలకు మార్గనిర్దేశం చేశారు.సదస్సులో మాట్లాడిన టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ వరంగల్ నగరంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లపై ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని అన్నారు. ఎస్ఐఆర్ పేరుతో అర్హత కలిగిన ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభావంతో ఎన్నికల సంఘం పనిచేస్తోందని ఆరోపించిన మహేష్ కుమార్ గౌడ్, ముస్లింలు, ఎస్సీలు, ఎస్టీలు, గిరిజన వర్గాలకు చెందిన ఓటర్ల పేర్లను లక్ష్యంగా చేసుకుని తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ఓటర్ల జాబితా సవరణల కారణంగా ప్రతిపక్ష పార్టీలకు నష్టం జరిగిన ఉదాహరణలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజల ఆగ్రహం ముందు ఎంతటి నాయకులైనా నిలబడలేరని, ప్రజాస్వామ్య విలువలను కాపాడే బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందని అన్నారు.ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కొనసాగుతున్న బీఎల్ఏ2 ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత అప్రమత్తంగా నిర్వహించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పేదలు, అట్టడుగు వర్గాల ప్రజలు ఈ ప్రక్రియలో నష్టపోయే అవకాశం ఉన్నందున వారికి పూర్తి అవగాహన కల్పించాలని కోరారు.

## 'భవ్య' ఫేజ్-1లో ప్రాధాన్యమివ్వండి

>> సిద్ధం చేస్తోంది. వీటికి జూన్ - జూలై 2026 దరఖాస్తు విండోలోనే అనుమతి ఇస్తే రాష్ట్రంలో తయారీ రంగం మరింత బలోపేతం అవుతుంది' అని ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్రానికి ఏరో - డిఫెన్స్ కారిడార్‌ను మంజూరు చేయాల్సిన అవసరాన్ని మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేకంగా వివరించారు. హైదరాబాద్‌లో నేషనల్ డిజైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకు కేంద్రం చొరవ చూపాలన్నారు. మెగా లెదర్, ఫుట్‌వేర్ అండ్ యాక్సెసరీస్ క్లస్టర్ డెవలప్‌మెంట్ (ఎంఎల్ఎఫ్ ఏసీడీ) పథకం కింద రెండు మెగా లెదర్ పార్కులను కేటాయించాలని కోరారు. మెదక్ జిల్లా మనోహరాబాద్‌లో రూ.2,050 కోట్లతో నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఎన్ హెచ్ఎల్ఎంఎల్) భాగస్వామ్యంతో చేపట్టిన మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా కోహెడలో ఏర్పాటు చేస్తున్న ఇర్రేడియేషన్ ఫెసిలిటీకి ట్రేడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫర్ ఎక్స్‌పోర్ట్స్ పథకం కింద నిధులను కేటాయించాలన్నారు. రామగుండం ఎరువుల కర్మాగారం (ఆర్ఎఫ్ సీఎల్)పై ప్రత్యేక దృష్టి సారించాలని, అక్కడ ఉత్పత్తి అయ్యే మొత్తం యూరియాను తెలంగాణకే కేటాయించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతేడాది ఎరువుల సరఫరాలో ఎదురైన అంతరాయాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు కోరారు.

# లారీలతో తొక్కించి ప్రాణాలు తీస్తారా?

## డిటిఓ వెంకన్న మృతిపై హరీశ్‌రావు అనుమానాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 22:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వాహనాల తనిఖీలు చేస్తుండగా బొగ్గు టిప్పర్ లారీ ఢీకొని జిల్లా రవాణా శాఖ అధికారి (డిటిఓ) వెంకన్న దుర్మరణం చెందిన ఘటన ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఈ ఘోర ప్రమాదంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీశ్‌రావు తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ రోడ్డు ప్రమాదంపై అనుమానాలు వ్యక్తం చేశారు. డిటిఓ వెంకన్న మరణం కేవలం ఒక యాక్సిడెంట్ మాత్రమే కాదనే సందేహాన్ని హరీశ్‌రావు లేవనెత్తారు. 'రాష్ట్రంలో అధికారులను బెదిరిస్తూ అక్రమదందాలు సాగిస్తున్న ఇసుక మాఫియా, బొగ్గు మాఫీ యాల ఆటలు మితిమీరిపోయాయి. నిజాయతీగా పనిచేసే అధికారులను వారి అక్రమాలకు అడ్డొస్తే... ఇలా లారీలతో తొక్కించి ప్రాణాలు తీస్తారా?' అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. భూపాలపల్లి ఏరియా లో సాగుతున్న అక్రమ ఇసుక, బొగ్గు రవాణా వెనుక ఉన్న అసలు శక్తులు ఎవరు? వారికి సహకరిస్తున్న లీడర్లు ఎవరు? అనే పూర్తి వివరాలను ప్రభుత్వం తక్షణమే బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

వెంకన్న ప్రమా దం వెనుక దాగిన నిజాన్ని పూర్తిగా వెలికితీయాల్సిన బాధ్యత ము మ్మాటికీ రాష్ట్ర సర్కార్ పైనే ఉందన్నారు. కేవలం డ్రైవర్‌ను అరెస్ట్ చేసి చేతులు దులుపుకుంటే కుదరదని, ఈ కేసుపై ఒక ఉన్నతస్థాయి సమగ్ర విచారణ జరిపించి, దీనివెనుక ఎవరి ప్రేరేపణ అయినా ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేయాలన్నారు. దోషులను గుర్తించి కఠినంగా శిక్షిం చడంతోపాటు, భవిష్యత్తులో విధుల్లో ఉండే అధికారులకు ఇలాంటి దారు ణాలు జరగకుండా పకడ్బందీ రక్షణచర్యలు తీసుకోవాలని కోరారు.

# బాల్క సుమన్ కస్టడీ కోరుతూ హైకోర్టులో పోలీసుల పిటిషన్

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** విద్వేషపూరిత ప్రసంగాలు చేసిన ఘటనలో అరెస్టయి చంచల్‌గూడ జైల్లో వున్న బీఆర్ఎస్ మాజీ ఎంఎల్ఏ బాల్క సుమన్‌ను కస్టడీ కోరుతూ హైదరాబాద్ పోలీసులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బాల్క సుమన్‌ను కస్టడీకి ఇచ్చేం దుకు నాంపల్లి కోర్టు నిరాకరించిందంతో నగర పోలీసులు హైకోర్టును ఆశ్రయించారు. ఆయ నను కనీసం నాలుగు రోజులపాటు కస్టడీకి ఇస్తే ఆయన ప్రసంగాల కేసులో మరిన్ని విషయాలు వెలుగుచూసే వీలుందని పోలీసులు హైకోర్టుకు తెలి పారు. అయితే బాల్క సుమన్ కస్టడీని డిఫెన్స్ న్యాయవాది వ్యతిరేకిం చారు. తన క్లయింటును ఇప్పటికే పూర్తిగా విచారించారని, ఈ కేసులో సాక్షు ల విచారణ కూడా పూర్తయ్యిందని ఆయన వాదించారు. ఇరుపక్షాల వాద నలు విన్న హైకోర్టు దీనిపై తీర్పును బుధవారానికి వాయిదా వేసింది.

# మరుగుదొడ్డిలో దాచిన మొబైల్‌తో నీట్ పరీక్షలో మాల్‌ప్రాక్టీస్.. విద్యార్థి అరెస్ట్

**హైదరాబాద్ (తుర్కయంజాల్), జూన్ 22, ప్రభాతవార్త:** నీట్ ప్రవేశపరీక్షలో అక్రమమార్గాలను అనుసరించి మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన ఓ విద్యార్థిని హైద రాబాద్ సిటీపోలీసులు అరెస్ట్ చేశారు. ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని రాగన్న గూడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అచ్చంపేటకు చెందిన జి.నరేందర్ (18)పరీక్షలో సమాధానాలు తెలుసుకునేందుకు ముందుగానే పథకం రచిం చాడు. ఉదయం పరీక్ష ప్రారంభానికి ముందే పరీక్ష కేంద్రానికి చేరుకుని మరుగుదొడ్డి వెంటిలేటర్ ద్వారా మొబైల్ ఫోన్‌ను లోపలికి చేర్చి ఫ్లష్ ట్యా ంక్‌లో దాచిపెట్టాడు. పరీక్ష ప్రారంభానికి ముందు పోలీసులు, పరీక్షా నిర్వ హణ సిబ్బంది కేంద్రాన్ని క్షుణ్ణంగా తనిఖీచేసి, పరీక్షార్థులందరినీ పరిశీలిం చినప్పటికీ ఫ్లష్ ట్యాంక్‌లో దాచిన ఫోన్ గుర్తించబడలేదు.

అనంతరం పరీక్ష జరుగుతున్న సమయంలో కడుపు నొప్పిగా ఉందని చెప్పి మరుగుదొడ్డికి వెళ్లిన నరేందర్, అక్కడ దాచిన మొబైల్ ఫోన్‌ను తీసుకుని గూగుల్ క్రోమ్‌లో ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు వెతకడం ప్రారంభించాడు. అయితే అతడు చాలాసేపు తిరిగి రాకపోవడంతో ఇన్విజిలేటర్‌కు అనుమానం వచ్చి సిబ్బందిని తనిఖీకి పంపించాడు. వారు వెళ్లి చూడగా విద్యార్థి మొబైల్‌ఫోన్ ఉపయోగిస్తూ ఉండటాన్ని గుర్తించి పట్టుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకు న్నారు. ఫోన్‌ను పరిశీలించగా పరీక్ష ప్రశ్నలకు సంబంధించిన సమాధానాల కోసం గూగుల్‌లో శోధించినట్లు నిర్ధారణ అయింది. విచారణలో విద్యార్థి తన తప్పును అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం నిందితుడు పోలీసు కస్టడీలో ఉన్నాడు.

# విచారణకు వర్చువల్‌గా హాజరైన అల్లు అర్జున్

## సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన

## విచారణ జూలై 6కు వాయిదా

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** నగరంలోని సంధ్య థియేటర్ వద్ద 2024 డిసెంబరు నాలుగవ తేదీన రాత్రివేళ పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా ప్రీమియర్ షోలో జరిగిన తొక్కిసలాట ఘటనపై సోమవారం నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో ఎ-11 నిందితుడుగా వున్న టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్ సోమవారం నాటి విచారణకు నేరుగా హాజరుకావాల్సి వున్నా షూటింగ్ నేపథ్యంలో ముంబయి నుంచి వర్చువల్‌గా హాజరయ్యారు. అల్లు అర్జున్ వర్చువల్ హాజరుకు నాంపల్లి కోర్టు అంగీకరిం చింది.

కాగా ఇదే కేసులో మిగతా 18 మంది నిందితులు కోర్టులో నేరుగా హాజరై సంతకాలు చేశారు. నాటి తొక్కిసలాట ఘటనలో ఒక మహిళ చని పోగా ఆమె మైనర్ కుమారుడు ఇప్పటికీ చావుబతుకుల మధ్య కొటు ్టమిట్టాడుతుండడం తెలిసిందే. ఈ బాలుడికి టాలీవుడ్ పెద్దలతోపాటు అల్లు అర్జున్ కుటుంబం వైద్యం అందిస్తుండడం విదితమే. ఈ కేసులో 23 మం దిపై చిక్కడపల్లి పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేయగా దీనిపై నాంపల్లి కోర్టులో ట్రయల్ విచారణ సాగుతోంది. సోమవారం నాటి విచారణ తరు వాత తదుపరి విచారణను కోర్టు జూలై ఆరవ తేదీకి వాయిదా వేసింది.

# ఓటరుకు సహేతుక అవకాశమిచ్చి మౌఖిక విచారణ తర్వాతే తొలగింపు

## ఇసిఐ నెట్ యాప్‌తో మీ చేతిలో ఎన్నికల సమాచారం

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** భారత పౌరుడు మాత్రమే ఎన్నికల్లో ఓటు వేయడానికి అర్హుడనీ ఓటుహక్కు పరిరక్షణకు సహేతుక అవకాశాలు ఇచ్చినా ఇఆర్‌వో నోటిసుకు అవసర మైన పత్రాలు అందించని వారితో మౌఖిక విచా రణ జరిపి వారిని జాబితా నుంచి తొలగిస్తామని ఎలక్టోరల్ ఆఫీసర్లు బోయపాటి చెన్నయ్య, చిరంజీవి తెలిపారు. సోమవారం మీడియా అకాడమి ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి అధ్యక్షత జరిగిన స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో వారు అనేక అంశలపై వివరణ ఇచ్చారు. ఎన్నికల అధి కారి చెన్నయ్య మాట్లాడుతూ ఇసిఐ నెట్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొంటే మీ అరచేతిలోనే మీకు భారత ఎన్నికల సంఘం సమాచారం అందు బాటులో ఉంటుందని అంతేకాదు మీ ఓటుహక్కు సమాచారం కూడా తెలుసుకోవచ్చని వివరించారు. ఎస్ఐఆర్ 2002 ఓటర్ల జాబితాలో మీ పేరులేక పోతే మీ తలితండ్రులు, నాయనమ్మ, తాతయ్యల ఓటరు వివారలను సేకరించి ఎన్యుమరేషన్ కాలమ్‌లో పూరించాలని దీని కోసం బిఎల్‌వో సహా యం తీసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో తప్పుడు అనర్హులు,మరణించిన వారి పేర్లను తొలగించడానికి ఎన్యూమరేషన్ ఫామ్ ఓటర్ల వివరాలను సరిచూసుకోంటూ పాత రికార్డులతో అనుసంధానించడానికి ఎన్నికల సంఘం రూపొందిస్తున్న కార్యక్రమాన్ని ప్రత్యేక సమగ్ర ఓటర్ల జ్రాబితా సవరణ కార్యక్రమని ఓటర్ల జాబితాలో లేని వారికి ఏలాంటి సంక్షేమ పథకాలు అందవని జరుగుతున్న ప్రచారంలో నిజంలేదనీ తెలిపారు. ఎన్యూమరేషన్ ప్రక్రియలో మీ ఇంటికి వచ్చే బిఎల్ఒకు సమాచారం అందించేందుకు గతంలో ఉన్న ఎలక్టోరల్ రోల్ వివరాలు సిద్ధంగా ఉంచుకోవడం మంచిదనీ సలహాఇచ్చారు. మీరు ఇచ్చిన వివరాలు డేటాబేస్‌తో సరికాకపోతే, అధికారులు నోటీసు జారీ చేస్తారు. బిఎల్‌ఓలు వచ్చిన సమయంలో పౌరసత్వాన్ని నిరూపించే పత్రాలు పాస్‌పోర్ట్, జనన ధృవీకరణ పత్రం, విద్యా ధృవీకరణ పత్రాలు మొదలైనవి సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. మీ ప్రాంతంలోని బి ఎల్‌ఓ మీకు ఫామ్ అందించకపోయినా, మీరు వారిని కలవలేకపోయినా పైన పేర్కొన్న విధంగా నేరుగా ఇసిఐ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫామ్ నింపవచ్చని చెప్పారు. వెబ్‌సైట్‌లో 'బుక్ ఏ కాల్ విత్ బిఎల్‌ఓ' అనే సదుపాయాన్ని ఇసిఐ అందు బాటులోకి తెచ్చిందని దానిని ఉపాయోగిం చుకోవాలని కోరారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే 'నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్ ద్వారా ఆన్ లైన్‌లో ఫిర్యాదు నమోదు చేయవచ్చని సూచించారు. ఓటర్ల జాబితాలో తప్పులను సరి దిద్దడానికి కేంద్ర ఎన్నికల సంఘం ప్రతి ష్టాత్మకంగా 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రి యను చేపట్టింది. 2002 తర్వాత మళ్లీ ఇంత భారీ స్థాయిలో ఓట్ల వెరిఫికేషన్ జరుగుతోంది. ఈ ప్రక్రియలో ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫామ్ నింపడం అత్యంత కీలకం. ఒకవేళ ఈ ఫామ్ సబ్మిట్ చేయకపోతే భవిష్యత్తులో మీ ఓటు గాల్లో పడే ప్రమాదం ఉందనీ వారు తెలిపారు. మీరు బూత్ లెవల్ ఆఫీసర్ కోసం ఎదురుచూడకుండా, మీ మొబైల్ లేదా కంప్యూటర్ ద్వారానే సులభంగా ఆన్‌లైన్‌లో ఫామ్ సమర్పించవచ్చని అన్నారు.

# మూసీ బఫర్‌జోన్‌లో వెలిసిన ఓ ప్రైవేటు స్కూలు కూల్చివేత

## రూ.80 కోట్ల ప్రభుత్వ స్థలాన్ని కాపాడిన రెవెన్యూ అధికారులు

## అధికారులు, కబ్జాదారుల మధ్య తీవ్రవాగ్వాదం



మంచిరేవుల వద్ద మూసీ బఫర్‌జోన్‌లో వెలిసిన భారీ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

**హైదరాబాద్ (నార్సింగి), జూన్ 22, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల గ్రామం వద్ద మూసీ బఫర్ జోన్‌లో వెలిసిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు నేల మట్టం చేశారు. సోమవారం ఉదయం నార్సింగి పోలీసుల బందోబస్తు మధ్య గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది అక్రమ నిర్మాణాలను జేసీబీలతో కూల్చి వేశారు. మంచిరేవుల గ్రామ సర్వే నెంబర్లు 326, 327, 328, 329లలో ఉన్న ఎకరం ప్రభుత్వ భూమిని అధికార పార్టీకి చెందిన బడా నేత, మరికొంత మంది కలిసి కబ్జా చేసి, నిర్మాణాలు చేపట్టి ఓ ప్రైవేటు పాఠశాలకు 10.సంవత్సరాలకు గాను లీజుకు ఇచ్చారు. నెలకు రూ.లక్ష అద్దె తీసుకుం టున్నారు. విషయం తెలుసుకున్న గండిపేట మండల తహసీల్దార్ బఫర్ జోన్‌లో నిర్మించిన కట్టడాలు చట్ట విరుద్ధమైనవని, వాటిని తొలగించాలని కబ్జాదారులకు సూచించారు. కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టిన వారిలో ఒకరు ప్రభుత్వంలో పలుకుబడి ఉన్న బడా నాయకుడు కావడంతో మీ నిర్మాణాలు కూల్చివేస్తున్నామని అధికారులు నోటీసులు ఇచ్చేందుకు వెళ్లారు. కబ్జాదారులు నోటీసులు తీసుకోలేదు. కబ్జాదారులు నిర్మాణాలు కూల్చవద్దని కోరుతూ కోర్టును ఆశ్ర యించారు. మొదట కోర్టు స్టేటస్‌కో ఇచ్చింది. దీంతో రెవెన్యూ అధికారులు కొంత కాలం మిన్నకుండి పోయారు. మళ్లీ కోర్టు నిబంధనలను అనుసరిం చే రెవెన్యూ అధికా రులు సోమవారం జేసీబీని ఉపయోగించి పాఠశాల కోసం వేసిన గదులు, నిర్మాణాలన్నీ నేలమట్టం చేశారు. ఈ కూల్చవేతల సమయంలో రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు మధ్య వాగ్వాదం జరి గింది. పాఠశాల నిర్వాహకులు తాము మోస పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సోమ వారం రెవెన్యూ అధికా రులు భారీ నిర్మాణాలు నేలమట్టం చేసి స్వాధీనం చేసుకున్న ఎకరం స్థలం విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.80.కోట్ల వరకు ఉంటుంది.

**కబ్జాదారులు ఎంతటి వారైనా ఉక్కుపాదం మోపుతాం : తహసీల్దార్**

ప్రభుత్వ భూములు, జలాశయాల బఫర్ జోన్లలో ఎవరు కబ్జాలు చేసినా, కబ్జాదారులు ఎంతటి వారైనా ఉక్కుపాదం మోపుతామని గండిపేట తహసీ ల్దార్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ముమ్మాటికి మూసీలోనే నిర్మాణాలు చేశారని, బిజడ్(బఫర్‌జోన్) అని ఇరిగేషన్ అధికారులు వేసిన దిమ్మెలు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు. కబ్జాదారులు మమ్మల్ని ఎవరూ ఏమి చేయలేరన్న ధీమాతో భారీ నిర్మాణాలు చేపట్టారని వివరించారు. చట్టం ప్రకారమే తాము వ్యవహారిం చామని, ప్రభుత్వ భూములను పరిరక్షించడమే మా విధి అని, ఇందులో ఎక్కడా రాజీ పడేది లేదని తహ సీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. గండిపేట మండలంలో నేను విధులు నిర్వ హిస్తున్నంత వరకు ఎవరు ప్రభుత్వ భూములను కబ్జా చేసినా దగ్గరుండి కూల్చి వేస్తానని తెలిపారు.

# ఉద్యోగులు అడుగుతున్నది ఉద్యోగ హక్కు మాత్రమే.. ప్రభుత్వాల ఉపకారం కాదు: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 22 ప్రభాతవార్త:** తెలంగాణలో పోలీస్ కొలువు సాధించా లనుకునే నిరుదోగ్యుల ఇబ్బందులు, వారి ఆవేదన, ప్రభుత్వ విధానాల లోపాలపై బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ యువతకు ఉద్యోగం ఒక హక్కు అని, కానీ ప్రభుతాల్వ నిర్లక్ష్యం, తప్పుడు విధానాల వల్ల వేలాది మంది అభ్యర్థులు నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిఓ 46 తీవ్ర అన్యాయం అని, సిడిసి-1, సిడిసి-2 పేరుతో తెచ్చిన కొత్త వ్యవస్థ వల్ల గ్రామీణ యువతకు భారీనష్టం జరిగిందని ఆయన విమర్శించారు. ఒకే పరీక్ష రాసిన అభ్యర్థులకు వేర్వేరు కటాఫ్‌లు ఉండటం అన్యాయమన్నారు. ఈ జిఓ వల్ల హైదరాబాద్ కమిషనరేట్లకు ఎక్కువ పోస్టులు వెళ్లాయని, దీనివల్ల కగ్రామీణ జిల్లాల అభ్యర్థులకు 120-130 మార్కులు వచ్చినా ఉద్యోగాలు రాలేదని ఆరోపించారు. అధికారంలోకి రాకముందు జిఓ 46ను రద్దు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పటికీ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించకుండా కాల యాపన చేస్తోందని మండిపడారు. వయోపరిమితి (జిఓ 87) వివాదంపై ఆయన మాట్లాడుతూ, ఏళ్ల తరబడి నోటిఫికేషను రాకపోవడం వల్ల వేలాది మంది యువత వయోపరిమితి దాటిపోయిందని, ఇతర ఉదోగ్యాలకు ఇచ్చిన వయోపరిమితి సడలింపులను పోలీస్ వంటి యూనిఫాం సరీస్వులకు పూర్తిస్థాయిలో వర్తింపజేయకపోవడం యువత భవిష్యత్తుతో ఆటలాడటమేనని అన్నారు. రాష్ట్ర అవసరాలకు కేవలం 5,000 కానిస్టేబుల్ పోస్టులు ఏమా త్రం సరిపోవని, నిరుదోగ్య యువత డిమాండ్ మేరకు ఖచ్చితంగా 20 వేల పోలీస్ పోస్టులతో కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తమకు ఉదోగ్యాలు కావాలని, న్యాయం చేయాలని శాంతియుతంగా అడిగినందుకు 9 మంది విదార్థులపై ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టడాన్ని మహేశ్వర్ రెడి తీవ్రంగా ఖండించారు. తక్షణమే ఆ విదార్థులపై పెట్టిన కేసులను ప్రభుత్వం బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# వరి సాగు తగ్గించండి.. పంట మార్పిడి అనివార్యం

## రాష్ట్రంలో యేటా 5 లక్షల ఎకరాల కోత

## దేశంలో 2.50 కోట్ల ఎకరాలకు తగ్గించే లక్ష్యం

## తెలంగాణకు కేంద్రం కీలక ఆదేశాలు

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** దేశవ్యా ప్తంగా వరి ధాన్యం నిల్వలు భారీగా పేరుకు పోతుండటం, ఇతర నిత్యావసర పంటల ఉత్పత్తి క్షీణిస్తుండ టంతో కేంద్ర ప్రభుత్వం ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది. దేశంలోనే అత్యధికంగా వరి పండిస్తున్న పంజాబ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలతో పాటు, తెలం గాణలో కూడా వరి సాగు విస్తీర్ణాన్ని క్రమంగా తగ్గించాలని స్పష్టమైన మార్గదర్శ కాలను జారీ చేసింది. దేశవ్యాప్తంగా రాబోయే ఐదేళ్ల కాలంలో మొత్తం 2.50 కోట్ల ఎకరాల్లో వరి సాగును తగ్గించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. అంటే ప్రతి ఏటా 50 లక్షల ఎకరాల వరి సాగును తగ్గించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో ఏటా 5 లక్షల ఎకరాల చొప్పున, ఐదేళ్లలో మొత్తం 25 లక్షల ఎకరాల మేర వరి విస్తీర్ణాన్ని తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం టార్గెట్ విధించింది. జాతీయ స్థాయిలో కేంద్రం నిర్దేశించిన మొత్తం లక్ష్యంలో ఒక్క తెలంగాణ వాటానే దాదాపు 10 శాతంగా ఉండటం గమనార్హం. దేశవ్యాప్తం గా, ముఖ్యంగా తెలంగాణలో గత కొన్ని ఏళ్లుగా వరి సాగు రికార్డు స్థాయిలో పెరుగుతోంది. తెలంగాణలో 2023-24లో 1.18 కోట్ల ఎకరాలుగా ఉన్న వరి సాగు, 2024-25 నాటికి 1.27 కోట్ల ఎకరాలకు చేరింది.

ప్రస్తుత సంవత్సరానికి ఇది 1.32 కోట్ల ఎకరాలు దాటే అవకాశం ఉందని అంచనా. ఈ భారీ ఉత్పత్తి కారణంగా ఎఫ్‌సీఐ గిడ్డంగుల్లో నిల్వలకు స్థలం దొరకడం లేదు. దేశంలో వరి పంట విపరీతంగా పెరుగుతు న్నప్పటికీ, పప్పుధాన్యాలు, నూనెగింజలు, పామాయిల్ సాగు విస్తీర్ణం ఘోరంగా పడిపోతోంది. ఫలితంగా ఏటా రూ. 1.50 లక్షల కోట్లకు పైగా నిధులను వెచ్చించి ఇతర దేశాల నుండి వీటిని దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ వ్యయాన్ని తగ్గించి దేశీయంగా స్వయంసమృద్ధి సాధించాలంటే పంట మార్పిడి అనివార్యమని కేంద్రం స్పష్టం చేసింది.

ఇతర రాష్ట్రాల్లో రెండో సీజన్ (యాసంగి/రబీ) లో వరి సాగు కేవలం 30 శాతం లోపే ఉంటుంది. కానీ తెలంగాణ, ఖంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రెండు సీజన్లలోనూ వరిని విస్తారంగా పండిస్తున్నారు. దీనివల్ల నిల్వలతో పాటు, నీటి లభ్యత సమస్యలు కూడా తలెత్తుతున్నాయని తెలిపింది.



# చిరంజీవితో బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు భేటీ

## ప్రధాని మోడీ 12 యేళ్ల పాలనా విశేషాలపై పుస్తకం అందజేత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 22:** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మెగాస్టార్, మాజీ కేంద్రమంత్రి చిరంజీవిని మర్యాద పూర్వ కంగా కలిశారు. ప్రధాని నరేంద్ర మోడీ 12 యేళ్ల పాలన పూర్తి సందర్భంగా చిరంజీవిని కలిశారు. మోడీ నాయకత్వంలో వికాస్, విశ్వాస్, జన కల్యాణ్ లక్ష్యాలతో 12 సంవత్సరాల పాలన పూర్తి సందర్భంగా నిర్వహిస్తున్న విశేష్ జన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాంచందర్‌రావు సోమ వారం హైదరాబాద్‌లో చిరంజీవిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలి శారు. 12 సంవత్సరాల్లో మోడీ ప్రభుత్వం సాధించిన ముఖ్య విజయాలు, మైలు రాళ్లు, దేశాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్లిన పలు కీలక కార్యక్రమాలను వివరించే పుస్తకాన్ని చిరంజీవికి అందజేశారు. ఈ సమావేశంలో సమాజం, సంస్కృతి, సినీరంగం, జాతి నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అలాగే అభివృద్ధి, సుపరిపాలన, ప్రజా సంక్షేమం పట్ల మోడీ ప్రభుత్వ నిబద్ధతను వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శులు భరత్‌ప్రసాద్, బండారు విజయలక్ష్మి కూడా పాల్గొన్నారు.

# హాట్ కామెంట్స్ వివాదం.. తేజస్విసూర్య పర్యటన రద్దు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 22:** బిజెపి ఎంపి తేజస్వి సూర్య తెలంగాణ పర్యటన రద్దయింది. మంగళవారం జరగాల్సిన జెన్‌జీ కాన్‌క్లేవ్‌కు హాజరవ్వాల్సి ఉంది. అయితే తేజస్విని అడ్డుకుంటామని ఇప్పటికే కాంగ్రెస్ హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే ఆయన టూర్ రద్దయినట్లు తెలు స్తోంది. ఇటీవల పార్లమెంట్‌లో తేజస్వి మాట్లాడుతూ ఏపీ-తెలంగాణ విభజ నను భారత్-పాక్ విభజనతో పోల్చడం వివాదాస్పదం అయింది.

# పిఎంజె జ్యుయెలరీ దోపిడీ కేసులో మరో ఇద్దరు నిందితుల అరెస్ట్

## పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలం

**కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త :** పీఎంజే జ్యువెలరీ షోరూంలో దోపిడీ కేసులో కరీంనగర్ పోలీసులు మరో కీలక పురోగతి సాధించారు. ఈ కేసుకు సంబంధించి మరో ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు, వారి నుంచి కీలకమైన ఆధారాలు, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు అరెస్ట్ అయిన నిందితుల సంఖ్య 8 కి చేరింది. ఈ నెల 17వ తేదీన కోర్టు అనుమతితో ఆరు రోజుల పోలీస్ కస్టడీలోకి తీసుకున్న ఐదుగురు ముఖ్య నిందితుల సుబోధ్ సింగ్, రఘునాథ్, రావిష్, అమర్ సింగ్, జైనుల్లాబ్దీన్ కస్టడీ రేపటితో ముగియ నుంది. కస్టడీ విచారణలో భాగంగా నిందితుడు రఘునాథ్ ఇచ్చిన సమా చారం మేరకు.. నేరానికి ఉపయోగించిన టీవీఎస్ అపాచీ బైక్‌ను మహా రాష్ట్రలోని బల్లార్షా రైల్వే స్టేషన్లో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. షోరూంలో కాల్పులు జరిపి దోపిడీకి పాల్పడిన ఐదుగురిలో ఇప్పటికే ఇద్దరు అరెస్ట్ కాగా, తాజాగా మూడో వ్యక్తి అయిన సూర్యమణి అలియాస్ సనోజ్ కుమార్ (21)ను కరీంనగర్ శివారులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి సమాచారం ఆధారంగా.. రామడుగు మండల శివారులోని ఎస్ఆర్ఎస్పి కెనాల్ వద్ద గల తాత్కాలిక నిర్మాణ షెడ్ల సమీపంలో నేరం జరి గిన రోజు నిందితులు ధరించిన 5 జతల దుస్తులు, 3 జతల బూట్లు. మూడు నకిలీ టూ వీలర్ ఆర్‌సి కార్డులు, రెడ్ మి మొబైల్ ఫోన్ , ఒక పిస్టల్ , మ్యాగజైన్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో కీలక నిందితుడు ఎం.డి. ఆదిల్ ఖాన్ ను బీహార్ రాష్ట్రం, పాట్నాలోని పుల్వారి షరీఫ్ వద్ద కరీంనగర్ ప్రత్యేక పోలీస్ బృందం అరెస్ట్ చేసింది. ఇతడిని తెలంగాణకు తరలించేందుకు స్థానిక కోర్టులో ట్రాన్సిట్ వారెంట్ దాఖలు చేసినట్లు సీపీ తెలిపారు. ఈ కేసును అత్యంత ప్రతిష్టా త్మకంగా తీసుకుని, నిందితులను చాకచక్యంగా పట్టుకున్న కరీంనగర్ అడిష నల్ డీసీపీ వెంకటటరమణ, టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్స్పెక్టర్లు సృజన్ రెడ్డి,బొల్లం రమేష్, బగ్గని శ్రీనివాస్, తిరుమల్, ప్రకాష్, ఎస్సై శేఖర్ ఇతర పోలీసు అధికారులను, సిబ్బందిని సీపీ అభినందించారు.

# క్రీడా ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా అనుమతులు

## పనులను వేగవంతం చేయాలి.. మత్తు వదలి మైదానాలు చేరండి

## జాతీయస్థాయిలో క్రీడాకారులు రాణించాలి : మంత్రి వాకిటి శ్రీహరి

**మహబూబ్ నగర్ బ్యూరో, జూన్ 22, ప్రభాతవార్త :** క్రీడలకు సంబంధించిన అన్ని ప్రాజెక్టులను గ్రీన్ ఛానల్ ద్వారా అనుమతులు తీసుకొని పనులను వేగవంతం చేస్తున్నామని పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. 'మత్తు వదలండి.. మైదానాలు చేరండి' అని పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి యువతకు పిలుపునిచ్చారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం గ్రౌండ్ మైదానంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రూ. 12.53 కోట్లతో (10.70 కోట్ల రూ.లతో అథ్లెటిక్ సింథటిక్ ట్రాక్, ఒక కోటి రూ.లతో నాలుగు ఓపెన్ జిమ్స్,51 లక్షల రూ.లతో ఇండోర్ జిమ్, మహిళల అథ్లెటిక్స్ హాస్టల్ మిగిలిన పనులకు 32 లక్షల రూ.లు) వ్యయంతో పలు ఆధునిక క్రీడా సదుపాయాల నిర్మాణానికి ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లా కు చెందిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ క్రీడా కారులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నారని తెలిపారు.

అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించనున్న 400 మీటర్ల 8 లైన్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ద్వారా జిల్లాలోని యువ క్రీడాకారులకు ఉన్నత స్థాయి శిక్షణ అందే అవకాశం కలుగుతుందని అన్నారు. క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాకుండా జీవన శైలిని మార్చే శక్తివంతమైన సాధనం అని ఆయన అన్నారు. ప్రతి యువకుడు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలి" అని అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో వివిధ నియోజకవర్గం లలో ఇప్పటికే సుమారు 80 కోట్ల రూపాయల నిధులు కేటాయించినట్లు తెలిపారు. క్రీడా రంగ అభివృద్ధి కోసం అవసరమైతే వంద కోట్ల రూపాయల వరకు ఖర్చు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. యువత టైమ్‌పాస్‌గా కాకుండా క్రీడలను సీరియస్‌గా తీసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని పిలుపునిచ్చారు. లక్షలాది యువతకు క్రీడల ద్వారా అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ఢిల్లీ అధికార ప్రతినిధి, రాష్ట్ర క్రీడా సలహాదారులు ఎపి జితేందర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో క్రీడారంగానికి ప్రాధాన్యం పెరిగిందన్నారు.

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం 2914 నుంచి 2024 వరకు పదేళ్ల కాలంలో క్రీడా రంగానికి కేటాయింపు 300 కోట్లు దాటలేదని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి బడ్జెట్‌లోనే రూ.360 కోట్లు, రెండో బడ్జెట్‌లో రూ.468 కోట్లు, మూడో బడ్జెట్‌లో రూ.640 కోట్లు క్రీడా శాఖకు కేటాయించిందని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని జిల్లాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ ఒక్కో జిల్లాకు రూ.15 నుంచి రూ.18 కోట్ల వరకు క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేటాయిస్తున్నామని వెల్లడించారు.

# సింధు హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన కార్యక్రమం

## ప్రభుత్వ ఆస్పత్రుల కోసం 1,000 యూనిట్ల రక్తం సేకరణ



**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో ఉన్న సింధు హాస్పిటల్స్ కేవలం ఒకే ఒక రోజులో 1000 యూనిట్ల రక్తాన్ని సేకరించే లక్ష్యంగా ఈ నెల 20న ఓ మెగా రక్తదాన డ్రైవ్ (కార్యక్రమాన్ని) విజయవంతంగా నిర్వహించింది. ప్రజల్లో అందునా మరీ ముఖ్యంగా యువతలో రక్తదానం పట్ల అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా ప్రాణాలు కాపాడే స్వచ్ఛంద రక్తదాన ప్రాధాన్యాన్ని వివరించేందుకు నిర్వహించిన ఈ మెగా రక్తదాన కార్యక్రమం ఓ కీలక భూమికను పోషించింది. ఈ రక్తదాన కార్యక్రమంలో సింధు హాస్పిటల్స్, హెటెరో గ్రూప్ సంస్థల ఉద్యోగులతో పాటు స్వచ్ఛంద సేవకులు, ప్రజలు చురుగ్గా పాల్గొన్నారు. నిత్యం సామాజిక సేవలనూ, ప్రజారోగ్య కార్యక్రమాలను ప్రోత్సహించే సింధు హాస్పిటల్స్ ఛైర్మన్, హెటెరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ బి. పార్థసారథి రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ రక్తదాన డ్రైవ్ కార్యక్రమాన్ని హెటెరో హెల్త్ కేర్ మేనేజింగ్ డైరెక్టర్ ఎమ్. శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగపడే వనరుల్లో రక్తం అత్యంత విలువైనది. ప్రాణాలు కాపాడటంలో ఇది అత్యంత కీలకం. తలసీమియా, సికిల్ సెల్ అనీమియా, లుకేమియా, రకరకాల క్యాన్సర్లతో బాధపడే పేషెంట్ల ప్రాణ రక్షణకు నిత్యం రక్తం ఎక్కించడం అవసరమవుతుంది. అలాగే రోడ్డు ప్రమాదాల్లోని క్షత గాత్రులకూ, అగ్నిప్రమాదాల్లో తీవ్రంగా కాలిన గాయా లతో బాధపడేవారికీ, మేజర్ శస్త్రచికిత్సలు చేయించుకునే పేషెంట్లతో పాటు అత్యవసర వైద్యసేవలు అవసరమైన బాధితులకు నిరంతరం రక్తం నిల్వలు అందుతూ ఉండటం చాలా అవసరం.

వీళ్లందరి ప్రాణ రక్షణకు రక్తం చాలా కీలకం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రక్తం నిల్వల కొర తను తగ్గించాలనే ఉద్దేశంతో ఈ రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేకరించిన రక్తాన్ని ఉస్మానియా జనరల్ హాస్పిటల్, గాంధీ హాస్పిటల్, నిమ్స్ ఆసుపత్రులకు అందజేశారు. ఫలితంగా అత్యవసర రక్త మార్పిడీ (బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్), క్రిటికల్ కేర్ సేవలు అవసరమైన అనేక మంది బాధితులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ మెగా రక్తదాన కార్యక్రమం ద్వారా ప్రజల్లో స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించడం, ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో సింధు హాస్పిటల్స్ తన వంతు భూమికను పోషించింది. రక్తం అవసరమైన ప్రతి రోగి ప్రాణాలను కాపాడేందుకు అంకితభావంతో వ్యవహించడంలో తన నిబద్ధతను మరోసారి చాటుకుంది.

అలాగే తన సేవలను చాటేందుకూ, సమాజాన్ని చైతన్యపరిచేందుకు ఈ రక్తదానం కార్యక్రమం ఓ వేదికగా పనిచేస్తుంది. ఒకే ఒక రక్తదానం వల్ల ఎన్నెన్నో ప్రాణాలను కాపాడవచ్చేనే స్ఫూర్తినిస్తూ... తమ ఆరోగ్య సేవలు నిరంతరం కొనసాగుతూ ఉంటాయనే సందేశాన్ని ఈ రక్తదాన కార్య క్రమం ద్వారా సింధు హాస్పిటల్స్ అందించింది.


వార్త

బలీయమైన విశ్వాసాలకు, నైతిక సూత్రాలకు కట్టుబడని వారు ఏ పార్టీలో ఉన్నా వారికి ఆ పార్టీకి కూడా క్షేమం కలగదు.

-ఆండర్సన్


# సర్దుకుందామా? సర్దుకుపోదామా!

దేశ రాజకీయ పార్టీల అధికారిక చట్టసభల సభ్యుల్లో ఒకింత చలనం వచ్చి సంచలనాలకు దారితీస్తోంది. నైతిక బలంతో ముందుకు సాగిపోవాల్సిన సభ్యులు అధికారం లేకుంటే ఏమీ చేయలేమనో గిట్టుబాటు కాదనో నెమ్మదిగా సొంత పార్టీల నుంచి జారుకుంటున్నారు. కొన్ని రాష్ట్రాల్లో తామున్న పార్టీలు ఇటీవల ఎన్నికలలో ఓటమి చెందగానో తమ నేతల ప్రవర్తన బాగోలేదనో, మరో ఐదేళ్ల చేసేదేమీ ఉండదనో పక్క చూపులు చూస్తున్నారు. అధికారం ఉన్నాన్నాళ్లూ అధినాయకుని, అధినేత్రి కనుసన్నుల్లో మెలిగిన వారు సైతం 'నాకేంటి' అన్న ధోరణిలో మెలగుతున్నారు. మరో ఐదేళ్ల అధికారంలో ఉంటానో ఉండనో దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవచ్చుననే రాజకీయ క్రీడా వినోదాలు ప్రేక్షకునికి, పాఠకునికి, విశ్లేషకులకు మంచి అవకాశాన్ని కలిగిస్తున్నాయి. తమిళనాడులో అధికారం మారగానే చిన్నచితకా పార్టీలు సైతం అతిపెద్ద పార్టీల కూటమి నుంచి బయటకొచ్చేస్తున్నారు. పరాయి పార్టీ అధికారంలోకి రాగానే అసలు సిసలు ఇన్నాళ్లూ అంటిపెట్టుకున్న పార్టీలకు గుడ్‌బై చెప్పడం చూస్తున్నాం. ద్రవిడ పార్టీలుగా దాదాపు అర్ధశతాబ్దం పాటు తమిళ రాజ్యాన్నేలిన పార్టీలు ఇప్పుడు కకావికలౌతున్నాయి. ఎన్నికలయ్యేవరకు ఒక సిద్ధాంతం, ఎన్నికలయ్యాక మరోసిద్ధాంతం, మరో జాతీయ పార్టీలతో స్నేహహస్తం కోసం ఇంకో సిద్ధాంతం తీరా పరిపాలనలోసొంత అజెండా ఇవన్నీ ఆయా పార్టీలకు అనుభవైక వైద్యమే. అధికారంలో ఉన్నప్పుడు ఆధిపత్య ధోరణిలో పాలనా పగ్గాలు చేపట్టి వారిలో అంటకాగి తాజాగా అధికారం కోల్పోయాక కాడి, మేడిని తన్నితగలేసి ఒక్కొక్కరూతమ దారి తాము చూసుకుంటున్నారు. ఒకనాడు వీరందరి ఆసరాతో 'మళ్లీ మేమే' అని మీసం తిప్పిన పెద్ద పార్టీలు ఇప్పుడు బోర్లాపడ్తున్నాయి. తమిళనాడులో దళపతి విజయ్ స్థాపించిన కొత్త పార్టీ టి.వి.కె (తమిళగ వెట్రి కజగం) అధికారంలోకి రాగానే తాము పాత దొరలతోటే అన్న వివిధ పార్టీల తంబిలు రొంబ విన్యాసాలు చేస్తున్నాయి. అన్నాడిఎంకె అధినేత నిర్ణయాలతో విబేధించి ఆ పార్టీ నుంచి చీలిక తేవాలని చూసిన వారు ప్రస్తుతానికి అక్కడే సర్దుకుపోయారు. కొందరైతే ప్రజాస్వామ్య పద్ధతిలో రాజీనామాలు చేసి మరో 'టివికె' పంచన చేరారు. ఒక విధంగా ఇదొక మంచి పద్ధతే. 'మా దయాదాక్షిణ్యాల మీదనే మళ్లీ ఎన్నికలు తక్షణమే రాకూడదనే టివికె'కి ఒక అవకాశమిచ్చాం' అని చెప్పుకునే ద్రవిడమున్నేట కజగంపార్టీకే ఇప్పుడు షాక్‌ల మీద షాకులు తగులుతున్నాయి. డిఎంకెతో దాదాపు మూడు దశాబ్దాలుగా కలిసి కట్టుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ, తొలినాడే తమ కూటమికి తిలోదకాలిచ్చేసింది. 'ఎప్పటికెయ్యది ప్రస్తుతమో అప్పటికయ్యది' అన్న ధోరణిలో డిఎంకె కూటమి పార్టీలు ఆలోచనలు వేగవంతం చేశాయి. రాష్ట్రంలో వచ్చిన కాలమాన రాజకీయ పరిస్థితులంటూ తాజాగా ఇండియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) డిఎంకె కూటమికి బైబై చెప్పేసింది. వారిది అయిదున్నర దశాబ్దాల స్నేహ ప్రమాణం. ఈ మధ్యకాలంలో దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నికలలో పొత్తు కుదుర్చుకునే సందర్భంలోనే 'మా పొత్తు ఎన్నికల వరకే... తర్వాత సంగతి తర్వాత తెలుస్తాం' అని ముందస్తు వ్యాఖ్యలలో 'లొల్లి' లేకుండా బయటపడే ప్రయత్నం చేసింది. పొత్తు మాటల్లో సామాజిక సమీకరణాలు తేలక, అంతర్గత విబేధాలు, అయినా భాగస్వామ్యంలో కొనసాగాల్సి వచ్చినప్పుడు ఇలాంటి మాటలు దొర్లడం సహజం. ఆ పిమ్మట కూటమి గెలిస్తే ఓ మాట, గెలవకపోతే ఓమాట అక్కరకొస్తుంది. కూటమి గెలిచినప్పుడు అధికార ప్రాతినిధ్యం దగ్గర ఎలాగూ పేచీలు తప్పవు. ఇచ్చేవాళ్లు, పుచ్చుకునే వాళ్లుగా విడిపోయి అంతర్గత పోరులో గత్యంతరంలేక సర్దుకుపోతారు. తాజా పరిస్థితులో తనకు ఇన్నాళ్లూ వెన్నంటిఉన్న మైనారిటీ భాగస్వామిని కోల్పోవడం డిఎంకెకు తీవ్ర నష్టమే. సిఎం విజయం నేతృత్వంలోని టివికెకు ఐయుఎంఎల్‌సంపూర్ణ మద్దతు ప్రకటించింది. అన్నాడిఎంకె కూటమిలో ఉన్న ఎండిఎంకె అధినేత ప్రేమలత విజయ్ గెలుపొందగానే ఆ కూటమి నుంచి బయటపడకపోయినా వేరే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటుచేసి తద్వారా జనం కోసం ఉద్యమిస్తానన్నారు. తానెపుడూ ప్రజాసేవకు అందు బాటులోనే ఉంటానని సంకేతాలు పంపారు. 108స్థానాలను కైవసం చేసుకున్న టి.వి.కె దళపతి విజయ్ పార్టీని ప్రకటించగానే ఎన్నో సమూహాలు అతని పక్కనచేరాయి. దాంతో తాజాగా 2కోట్ల సభ్యత్వం పెరిగింది. ఆ ఊపుతో తన పార్టీవిస్తరణ కార్యక్రమాన్ని 'మై టివికె' అనే మొబైల్ యాప్ ద్వారా సభ్యత్వం చేపట్టారు. దీనికివిశేష స్పందన లభించింది. రెండు కోట్లసభ్యత్వ నమోదు లక్ష్యంఇప్పుడు నెరవేరింది. కేవలం తమిళ తంబిలకు వారి కుటుంబాలకు మాత్రమే ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు వంటి ధృవీకరణ పత్రాలతో సభ్యత్వాన్ని కల్పిస్తున్నారు. తమిళ రాజకీయాల్లో వేగుచుక్క మాదిరి విజయ్ పాలనాపగ్గాలు చేపడితే మాజీ ఐపిఎస్ అధికారి, మాజీ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు అన్నామలై పాత్రనుకూడా విశేషంగా చెప్పుకోవాలి. ఇతని ఆత్మస్థైర్యాన్ని విశేషంగా చెప్పుకోవాలి. ఇద్దరూ దాదాపు తమిళనాడులో ద్రవిడపార్టీ ఆధిపత్యాన్ని సవాల్ చేస్తున్నవారే. అధికారం లేకపోయినా అన్నామలై పిలుపుకు వెంట వచ్చినవారూ తక్కువేం కాదు. 'వుయ్ దిలీడర్' ఇదొక స్వచ్ఛంద వేదిక. ప్రజాసమస్యల కేంద్ర బిందువుగా పనిచేయడానికి ఏర్పాటైన సంస్థ. ఇప్పుడా సంస్థలో చేరిన సభ్యుల సంఖ్య 18లక్షలమంది సభ్యత్వం తీసుకున్నారు. రాజకీయాల్లో చేరని వారు, చేరలేనివారు, ఆప్రసక్తి నచ్చనివారే ఈ వేదిక సభ్యులు కాగలగుతారు. అదే నిజమైతే ప్రజాసమస్యల్ని బయటపెట్టడంలో అన్నామలై, వాటి పరిష్కారంలో ముఖ్యమంత్రి విజయ్ తమిళులకు సమాంతర దిక్సూచిలుగా మారతారేమో చూడాల్సిందే.



మీరు చేయబోయే పని ఆధారంగా పేరు ప్రఖ్యాతులు పొందలేరు. చేసిన పని ద్వారా మాత్రమే.

హెన్రీఫోర్డ్



బలహీనులు అదృష్టాన్ని నమ్ముకుంటే, బలవంతులు కృషిని నమ్ముకుంటారు.

ఎమర్సన్

## ప్రజావాక్కు

### యోగాంధ్ర

అంతర్జాతీయ యోగాదినోత్సవం రోజు రాందేవ్ బాబాచే శిక్షణ ఇప్పించేందుకు ఆయన్ను ఆహ్వానించేందుకు ప్రభుత్వం కొంతమందిని వారి ద్వారా పంపి అక్కడనుండి రామ్‌దేవ్‌ను అమరావతి తీసుకొచ్చారు. కల్తీ సరుకులు , కల్తీమందులు అమ్మినందుకు సుప్రీం కోర్టు రాందేవ్‌కు అరెస్ట్ వారెంట్లు ఇచ్చింది. ఎన్నోసార్లు చీవాట్లు పెట్టింది. ఈవిషయం మీకు తెలియదా చంద్రబాబు గారూ. ఈయన సరుకులను, మందులను కొన్ని రాష్ట్రప్రభుత్వాలు నిషేధించాయి. చంద్రబాబును మంచి చేసుకొని విశాఖపట్నం దగ్గర గతంలో స్వరూపానందకు కాన్సిల్ చేసిన కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములను కొట్టేయడానికి రాందేవ్ పన్నాగం. ఎక్కడైనా పాలకులు, ప్రజలు, కార్యక్రమాలకు శాస్త్రవేత్తలను ఆహ్వానిస్తారు. కానీ మనదేశంలో పాలకులు సాధువులను, సన్యాసులును ఆహ్వానిస్తారు. వారికి సాష్టాంగ పడతారు. చాలా విచారకరం. ఈరోజు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు యోగా పిచ్చి బాగా పట్టింది. యోగా శాస్త్రీయం కాదు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### కామన్ ఎడ్యుకేషన్ బోర్డు అవసరం

లీక్ అనే పదానికి పెద్దపులే భయపడినట్టు ఒక స్టోరీ గత పదవ తరగతి సిలబస్‌లో ఉండేది. కానీ ఎర్రర్ ఫ్రీ క్వశ్చన్ పేపర్ ఇవ్వవలసిన బాధ్యత విద్యాశాఖ అందరి అధికారులపై ఉంటుంది. తీగలాగితే డొంకంతా కదులుతుంది. ఎవరు ముందుపడితే వారిని టార్గెట్‌చేస్తున్నారు. ఆంధ్ర యూనివర్సిటీ వారిని అయితే అంధేరా యూనివర్సిటీ అధికారులు అనవచ్చు. ఒకే క్వశ్చన్‌పేపర్ ఇచ్చి రెగ్యులర్ వాళ్ళకి గ్రేస్‌మార్కులు ఇస్తారు. బెటర్మెంట్ లేదా స్పెషల్ డ్రైవ్‌లో అదే క్వశ్చన్ పేపర్ వ్రాసిన వారికి ఎలాంటి గ్రేస్ మార్కులు ఇవ్వడం లేదు. భారతదేశం మొత్తం మీద కామన్ ఎడ్యుకేషన్ బోర్డు అత్యంత అవసరం.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తం

ఈ రోజుల్లో సైబర్ రకరకాల పద్ధతుల్లో సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేస్తున్నారు. అమాయకులైన రైతులు, వృద్ధులు, ప్రజలే వాళ్ల మొదటి టార్గెట్ చేసి ఫోన్లు చేసి సొమ్ము కాజేసుకుంటున్నారు. సైబర్‌నేరగాళ్ల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉందాం. పది మందికి అవగాహన కల్పిద్దాం. అందరూ జాగ్రత్తతో మెలగాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలి

ప్రపంచంలోనే అత్యంత ఆదరణ పొందిన ఫుట్‌బాల్ క్రీడ పట్ల ప్రదర్శిస్తున్న వివక్ష, క్రికెట్‌కు మాత్రమే లభిస్తున్న గుత్తాధిపత్యం, ప్రభుత్వనిధులు, ప్రసార మాధ్యమాల ప్రాధాన్యత మన క్రీడావ్యవస్థలోని తీవ్రలోపాన్ని సూచిస్తున్నాయి. దేశంలో అపారమైన స్థానిక ప్రతిభ ఉన్నప్పటికీ, దాదాపు తొంభై శాతానికి పైగా స్టేడియాలు ఆడేందుకుఅనువైన పచ్చటి మైదానాలుగా కాకుండా సాధారణ మట్టి నిలయాలుగానే మిగిలిపోవడం విచారకరం. ఫుట్‌బాల్ క్రీడకు ప్రభుత్వ క్రీడా బడ్జెట్ కేటాయింపులు చాలా తక్కువగా ఉన్నాయి. క్రికెట్ వ్యవస్థ వెలుపల ఉన్న ఏ ఇతర క్రీడను ప్రోత్సహించడానికి తగిన రాజకీయ సంకల్పం లేదని ఇది నిరూపిస్తోంది. ఈ నిస్తేజ పరిస్థితిని మార్చడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలి. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా ప్రతి జిల్లాలో కార్పొరేట్ నిధుల మద్దతుతో నడిచే లీగ్‌లను తప్పనిసరి చేయాలి. ప్రతి జిల్లా కేంద్రంలో కనీసం ఒక అత్యాధునిక టర్ఫ్ మైదానాన్ని నిర్మించడం అత్యవసరం.

- సి.హెచ్.ప్రతాప్ , శ్రీకాకుళం

### విద్యుత్ అంతరాయాన్ని తొలగించాలి

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలిచిన ఆక్వా రంగాన్ని ఆదుకోవడం అత్యవసరంగా మారింది. దేశ విదేశీ మార్పిడి ఆదాయంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ రంగంప్రస్తుతం తీవ్రసంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో రొయ్యలు, చేపల ధరలు పతనం కావడం, రవాణా ఖర్చులు విపరీతంగా పెరగడం వల్ల రైతులు కోట్లలో నష్టపోతున్నారు. ఆక్వాప్రాసెసింగ్ కంపెనీలు, మధ్యవర్తుల సిండికేట్ వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదు. వ్యాధుల విజృంభణ వల్ల పంట నష్టం జరిగి పెట్టుబడులు కూడా రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈరంగాన్నిరక్షి ంచడానికి ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలి. విద్యుత్ రాయితీలను పునరుద్ధరించి, అంత రాయం లేని విద్యుత్ అందించాలి.

- సి.సాయిరుత్విక్, నల్గొండ

### రాజకీయ బెదిరింపులు ఆపాలి

కొందరు రాజకీయ నాయకుల, ప్రజా ప్రతినిధుల, రాజకీయ అండతో, పలుకుబడితో భూమి కబ్జాలు, రోడ్లు ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇలాచేయడం వల్ల ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. వీరిపై పోలీస్‌శాఖ ద్వారా కౌన్సిలింగ్‌చేయాలి. వీరు చేపట్టే రాజకీయ బెదిరింపులను ఆపాలి.

-కదురు శ్రీనివాస్, వరంగల్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# పాదచారులకు భద్రత కల్పిస్తున్నామా?

**రోడ్డు ప్రమాదాలు సహజ విపత్తులు కావు. సరైన విధానాలు, మెరుగైన రూపకల్పన, రాజకీయ సంకల్పం ఉంటే వాటిని గణనీయంగా తగ్గించవచ్చని ప్రపంచ అనుభవం చెబుతోంది. అంతిమంగా, సుప్రీంకోర్టు తాజా తీర్పు ఫుట్‌పాత్‌ల గురించి మాట్లాడినట్లు కనిపించినా, వాస్తవానికి అది అభివృద్ధి గురించి మాట్లాడుతోంది. ఒక దేశం ఆధునికతను కొలిచేది దాని వాహనాల వేగం కాదు. రోడ్డు మీద నడిచే అత్యంత సాధారణ వ్యక్తి కూడా భయపడకుండా, గౌరవంగా తన గమ్యాన్ని చేరుకోగలుగుతున్నాడా లేదా అన్నదే అసలు ప్రమాణం. ఎందుకంటే రహదారులు కేవలం వాహనాల కోసం నిర్మించబడవు. అవి మనుషుల కోసం నిర్మించబడతాయి. ఒక సమాజం తన పాదచారులకు ఇచ్చే భద్రతే, చివరికి మానవ జీవితానికి అది ఇచ్చే విలువను ప్రతిబింబిస్తుంది.**

డి వి బి శ్రీహరిన్

భారతదేశం నేడు ప్రపంచంలోనే అత్యంత వేగంగా రహదారి మౌలిక సదుపాయాలను విస్తరిస్తున్న దేశాలలో ఒకటి. కొత్త ఎక్స్‌ప్రెస్‌వేలు, ఫ్లైఓవర్లు, రింగ్ రోడ్లు అభివృద్ధికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. కానీ ఈ అభివృద్ధి మధ్య ఒక విచిత్రమైన వైరుధ్యం కనిపిస్తోంది. వాహనాల వేగం పెరుగుతోంది. ప్రయాణ సమయం తగ్గుతోంది. అయితే రోడ్డు మీద నడిచే మనిషి భద్రత మాత్రం అదే స్థాయిలో పెరగడం లేదు. కోట్ల రూపాయలతో నిర్మించిన రహదారులపై కార్లు వేగంగా దూసుకుపోతున్నాయి. కానీ బస్‌స్టాప్ నుంచి ఇంటికి వెళ్లే ఒక సాధారణ పౌరుడికి, పాఠశాలకు వెళ్లే ఒక చిన్నారికి, ఆసుపత్రికి వెళ్లే ఒక వృద్ధుడికి సురక్షితంగా నడిచే స్థలం కూడా లభించని పరిస్థితి అనేక నగరాల్లో కనిపిస్తోంది. ఈ వైరుధ్యాన్ని గుర్తు చేస్తూ జూన్ 19న భారత సుప్రీంకోర్టు ఒక కీలక తీర్పు ఇచ్చింది. జస్టిస్ పి.ఎస్. నరసింహా, జస్టిస్ ఎ.ఎస్. చంద్రూర్కర్‌లతో కూడిన ధర్మాసనం గుర్తించిన ఫుట్‌పాత్‌లపై సురక్షితంగా నడిచే హక్కు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(డి), ఆర్టికల్ 21ల నుంచి ఉద్భవించిన ప్రాథమిక హక్కు అని స్పష్టం చేసింది. పాదచారులకు భద్రమైన మార్గాలను కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొంది. పైకి చూస్తే ఇది ఫుట్‌పాత్‌లకు సంబంధించిన తీర్పులా కనిపించవచ్చు. కానీ లోతుగా చూస్తే, ఇది దేశంలో అభివృద్ధి ఎవరిని కేంద్రంగా ఉంచుకొని సాగాలనే ప్రశ్నను ముందుకు తెచ్చిన తీర్పు. ఈ ప్రశ్నకు నేపథ్యం ఉంది. కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ గణాంకాలు చెబుతున్నది ఏమిటంటే, రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో గణనీయమైన భాగం ద్విచక్ర వాహనదారులు, పాదచారులే. ప్రతి ఏడాది వేలాది మంది నడుస్తూనే ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ మరణాలను సాధారణ ప్రమాదాలుగా చూసి మర్చిపోవడం సులభమే. కానీ అవి కేవలం వ్యక్తిగత విషాదాలు మాత్రమే కావు. కుటుంబాలు ఆధారాన్ని కోల్పోతాయి. పిల్లలు తల్లిదండ్రులను కోల్పోతారు. ఒక ప్రమాదం ప్రభావం అనేక జీవితాలపై పడుతుంది. అందుకే రోడ్డుభద్రత అనేది ట్రాఫిక్ శాఖ పరిధిలో ముగిసిపోయే అంశం కాదు, అది ప్రజారోగ్యం, ఆర్థిక వ్యవస్థ, సామాజిక సంక్షేమానికి సంబంధించిన అంశం. అయితే ఈ పరిస్థితికి కారణం కేవలం నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే డ్రైవర్లేనా? అలాగైతే సమస్యకు పరిష్కారం జరిమానాలను పెంచడం ద్వారా దొరికిపోయేది. కానీ అనుభవం వేరే విషయాన్ని చెబుతోంది. ఫుట్‌పాత్‌లు లేకపోవడం, ఉన్నచోట ఆక్రమణలకు గురికావడం, జీబ్రా క్రాసింగ్‌లు లేకపోవడం, వీధి దీపాల కొరత, అధిక వేగాన్ని నియంత్రించే ఏర్పాట్లు లేకపోవడం వంటి అంశాలు ప్రమాదాలను మరింత పెంచుతున్నాయి. అంటే సమస్య మనుషుల ప్రవర్తనలో మాత్రమే లేదు, రోడ్ల రూపకల్పనలో కూడా ఉంది. ఇక్కడే మరింత ప్రాథమికమైన ప్రశ్న తలెత్తుతోంది. మనం రహదారులను ఎవరిని దృష్టిలో పెట్టుకొని నిర్మిస్తున్నాం?



గత కొన్ని దశాబ్దాలుగా అభివృద్ధిని ప్రధానంగా వాహనాల వేగంతో కొలుస్తూ వచ్చాం. రహదారులు వెడల్పు కావడం, ఫ్లైఓవర్లు పెరగడం, ప్రయాణ సమయం తగ్గడం ఆధునికతకు సూచికలుగా మారాయి. కానీ నడిచే మనిషికి ఎంత స్థలం దక్కుతోంది అన్న ప్రశ్న వెనుకబడిపోయింది. ఫలితంగా రహదారులపై అత్యంత బలహీనమైన వర్గమే అత్యంత అసురక్షితమైన వర్గంగా మారింది. నిజానికి పాదచారుల సమస్య ట్రాఫిక్ సమస్య మాత్రమే కాదు, అది సామాజిక న్యాయ సమస్య కూడా. ఎందుకంటే నడకపై అత్యధికంగా ఆధారపడేవారు పిల్లలు, వృద్ధులు, వికలాంగులు, రోజువారీ కూలీలు, ప్రజారవాణాను ఉపయోగించే సాధారణ ప్రజలు. వ్యక్తిగత వాహనాలు కలిగినవారికి ప్రత్యామ్నాయాలు ఉండవచ్చు. కానీ పాదచారులకు రోడ్డు తప్ప మరో మార్గం ఉండదు. అందువల్ల పాదచారుల భద్రతను నిర్లక్ష్యం చేయడం అంటే సమాజంలోని అత్యంత బలహీన వర్గాల భద్రతను నిర్లక్ష్యం చేయడమే. ప్రపంచంలోని అనేక దేశాలు ఈ వాస్తవాన్ని చాలా ముందుగానే గుర్తించాయి. స్వీడన్‌లో అమలవుతున్న విజన్ జీరో విధానం ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో ఒక్క మరణం కూడా ఆమోదయోగ్యం కాదు. నెదర్లాండ్స్‌లో రహదారి రూపకల్పనలో పాదచారులు, సైక్లిస్టులకు ప్రాధాన్యం ఇస్తారు. జపాన్‌లో పాఠశాలల పరిసర ప్రాంతాల్లో వేగ నియంత్రణ అత్యంత కఠినంగా అమలవుతుంది. ఈ దేశాలు ఒక ముఖ్యమైన సూత్రాన్ని అంగీకరించాయి. మనుషులు తప్పులు చేయవచ్చు. కానీ ఆ తప్పులు ప్రాణాలను బలితీసుకోకుండా వ్యవస్థను రూపొందించడం ప్రభుత్వాల బాధ్యత. భారతదేశంలో పరిస్థితులు భిన్నంగా ఉండవచ్చు. కానీ ఆ సూత్రం మనకు కూడా వర్తిస్తుంది. అందుకే సుప్రీంకోర్టు తీర్పును కేవలం న్యాయపరమైన నిర్ణయంగా చూడలేం. ఇది ప్రభుత్వాలకు ఒక విధానపరమైన హెచ్చరిక. ప్రతి కొత్త రహదారిలో ఫుట్‌పాత్‌లను తప్పనిసరి చేయడం, ఇప్పటికే ఉన్న రహదారులను దశలవారీగా పాదచారులకు అనుకూలంగా మార్చడం, పాఠశాలలు, ఆసుపత్రులు, మార్కెట్ల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా మండలాలను ఏర్పాటు చేయడం, యూనివర్సల్ డిజైన్ ప్రమాణాలను అమలు చేయడం వంటి చర్యలు ఇకపై ఐచ్ఛికాలు కావు. నిజమే, ఈ మార్పు సులభం కాదు. ఆక్రమణలు, నిధుల కొరత, శాఖల మధ్య సమన్వయ లోపం, నిర్వహణలో నిర్లక్ష్యం వంటి సమస్యలు ఉన్నాయి. కానీ రోడ్డు ప్రమాదాలు సహజ విపత్తులు కావు. సరైన విధానాలు, మెరుగైన రూపకల్పన, రాజకీయ సంకల్పం ఉంటే వాటిని గణనీయంగా తగ్గించవచ్చని ప్రపంచ అనుభవం చెబుతోంది. అంతిమంగా, సుప్రీంకోర్టు తాజాతీర్పు ఫుట్‌పాత్‌ల గురించి మాట్లాడినట్లు కనిపించినా, వాస్తవానికి అది అభివృద్ధి గురించి మాట్లాడుతోంది. ఒక దేశం ఆధునికతను కొలిచేది దాని వాహనాల వేగం కాదు. రోడ్డు మీద నడిచే అత్యంత సాధారణ వ్యక్తి కూడా భయపడకుండా, గౌరవంగా తనగమ్యాన్ని చేరుకోగలుగుతున్నాడా లేదా అన్నదే అసలు ప్రమాణం. ఎందుకంటే రహదారులు కేవలం వాహనాల కోసం నిర్మించబడవు. అవి మనుషుల కోసం నిర్మించబడతాయి. ఒక సమాజం తన పాదచారులకు ఇచ్చే భద్రతే, చివరికి మానవ జీవితానికి అది ఇచ్చే విలువను ప్రతిబింబిస్తుంది. ●

# నైపుణ్యమే నేటి ఉద్యోగానికి పాస్‌పోర్ట్!

తిప్పర్తి శ్రీనివాస్

ప్రపంచీకరణ, డిజిటలీకరణ కృత్రిమ మేధస్సు ప్రభావంతో ఉపాధి రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకప్పుడు విద్య పూర్తయిన తరువాత ఉద్యోగం కోసం ఎదురు చూసే పరిస్థితి ఉండేది. నేడు పరిస్థితి పూర్తిగా మారింది. ఉద్యోగ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకున్న వారికే అవకాశాలు లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు లేదా ఆధునిక శిక్షణా కేంద్రాలు యువతకు అవసరమైన సాంకేతిక, వృత్తిపర, వ్యక్తిత్వ నైపుణ్యాలను అందిస్తూ కీలక పాత్ర పోషిస్తున్నాయి. ముఖ్యంగా డాట్‌కామ్, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత కాలంలో ఏటీసీల ద్వారా నైపుణ్యాభివృద్ధి ఉపాధి అవకాశాలకు బలమైన వేదికగా నిలుస్తోంది. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశం. ఈ జనాభాను సక్రమంగా వినియోగించుకోవాలంటే విద్యతోపాటు నైపుణ్యాభివృద్ధి అత్యవసరం. సాధారణ డిగ్రీలు లేదా సంప్రదాయ విద్య మాత్రమే నేటి ఉద్యోగ అవసరాలను తీర్చలేకపోతున్నాయి. కంపెనీలు సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యం, డిజిటల్ పరిజ్ఞానం, జట్టు నాయకత్వ లక్షణాలను కోరుతున్నాయి. ఈ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఏటీసీలు విద్యార్థులు, ఉద్యోగార్థులకు ప్రత్యేక శిక్షణను అందిస్తున్నాయి. డాట్‌కామ్ రంగం ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలలో ఒకటి. ఈకామర్స్, డిజిటల్ మార్కెటింగ్, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, ఫిన్‌టెక్ వంటి విభాగాలు లక్షలాది ఉద్యోగాలను సృష్టిస్తున్నాయి. ఈరంగాల్లో పనిచేయాలంటే కేవలం విద్యార్హత సరిపోదు. సంబంధిత నైపుణ్యాలుకూడా అవసరం. ఈ ఖాళీని పూరించడంలో ఏటీసీలు సమర్థవంతంగా వ్యవహరిస్తున్నాయి. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా యువతకు ఉద్యోగ మార్కెట్‌లో అవసరమైన ఆధునిక పరిజ్ఞానాన్ని అందించడం జరుగుతోంది. అనేక శిక్షణా కేంద్రాలు పరిశ్రమలతో భాగస్వామ్యం ఏర్పరచుకొని ప్రాక్టికల్ శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టు ఆధారిత అభ్యాసాన్ని అందిస్తున్నాయి. దీనివల్ల విద్యార్థులు కేవలం సిద్ధాంత



జ్ఞానానికే పరిమితం కాకుండా వాస్తవ కార్యాచరణ అనుభవాన్ని కూడా పొందుతున్నారు. ఫలితంగా ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం డాట్‌కామ్ కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా ప్రతిభావంతులైన యువతను వెతుకుతున్నాయి. రిమోట్ వర్క్, ఫ్రీలాన్సింగ్, గిగ్ ఎకానమీ వంటి కొత్త విధానాల కారణంగా గ్రామీణ ప్రాంతాల యువతకు కూడా అంతర్జాతీయ స్థాయి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. ఒకప్పుడు మెట్రో నగరాల్లో మాత్రమే లభించే ఉద్యోగాలు నేడు ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న ఏ ప్రాంతానికైనా విస్తరించాయి. అయితే ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి అవసరమైన నైపుణ్యాలు తప్పనిసరి. అందుకే ఏటీసీల ప్రాధాన్యం మరింత పెరిగింది. ప్రభుత్వం కూడా నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా యువతలో ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు చేపడుతోంది. ఈ కార్యక్రమాలకు అనుబంధంగా పనిచేస్తున్న శిక్షణా కేంద్రాలు లక్షలాది మంది యువతకు శిక్షణ అందిస్తున్నాయి. ముఖ్యంగా మహిళలు, గ్రామీణ యువత, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఉపాధి అవకాశాలను విస్తరించడంలో ఈ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే కేవలం సాంకేతిక నైపుణ్యాలు మాత్రమే సరిపోవు. వ్యక్తిత్వ వికాసం, ఆంగ్ల భాషా ప్రావీణ్యం, కమ్యూనికేషన్ సామర్థ్యం, సమయ పాలన, నాయకత్వ లక్షణాలు వంటి సాఫ్ట్‌స్కిల్స్ కూడా సమానంగా అవసరం. డాట్‌కామ్ రంగంలో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలవారితో కలిసి పనిచేయాల్సిఉంటుంది. అందువల్ల వృత్తిపరమైన ప్రవర్తన, సమర్థవంతమైన కమ్యూనికేషన్ కూడా విజయానికి కీలక అంశాలుగా మారాయి. ఈ అంశాలపై కూడా ఏటీసీలు ప్రత్యేక శిక్షణను అందించాలి. ఒకసారి నేర్చు కున్న నైపుణ్యం జీవితాంతం సరిపోదు. కొత్త సాంకేతికత లను ఎప్పటికప్పుడు నేర్చుకోవడంద్వారా మాత్రమే ఉద్యోగ మార్కెట్‌లో పోటీని ఎదుర్కోవచ్చు. మొత్తానికి, ఏటీసీలలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు దేశ యువశక్తిని ఉత్పాదక శక్తిగామార్చగలవు. డాట్‌కామ్ రంగంలో విస్తరిస్తున్న ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఇవి బలమైన పునాదిగా నిలుస్తాయి. విద్య, నైపుణ్యం పరిశ్రమ అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడంలో ఈకేంద్రాల పాత్ర అమూల్యం. యువత తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకొని డిజిటల్ ప్రపంచంలో విజయవంతమైన వృత్తి జీవితాన్ని నిర్మించుకోవాలంటే నైపుణ్యాభివృద్ధిని ఒక నిరంతర ప్రక్రియగా స్వీకరించాలి. అదే దేశ ఆర్థికాభి వృద్ధికి, యువత భవిష్యత్తుకు, సమాజ పురోగతికి సుస్థిర మార్గం అవుతుంది. ●

# 'పిఎంకిసాన్'కు కొత్త ఊపిరి అవసరం

అప్పన్న గొనప

దేశంలో వ్యవసాయం ఇప్పటికీ కోట్లాది కుటుంబాల జీవనాధారం. భారత ఆర్థిక వ్యవస్థలో పారిశ్రామిక, సేవా రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, వ్యవసాయం ప్రాధాన్యత మాత్రం తగ్గలేదు. రైతు బలపడితేనే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందనే భావనతో కేంద్రప్రభుత్వం 2019లో ప్రధాని కిసాన్ సమ్మాన్ నిధి (పీఎంకిసాన్) పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద అర్హులైన రైతులకు సంవత్సరానికి రూ.6,000 చొప్పున మూడు విడతల్లో రూ.2,000 చొప్పున నేరుగా బ్యాంకుఖాతాల్లో జమ చేస్తున్నారు. ప్రారంభ సమయంలో ఇది రైతులకు కొంత ఉపశమనం కలిగించినా, నేటి పరిస్థితుల్లో ఈ మొత్తం రైతుల అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. 2019లో ఎరువుల ధరలు, విత్తనాల ఖర్చులు, కూలీల వేతనాలు, సాగు వ్యయాలు ఒక స్థాయిలో ఉండేవి. కానీ గత ఏడు సంవత్సరాల్లో వ్యవసాయ రంగంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ఎరువుల ధరలు గణనీయంగా పెరిగాయి. డీజిల్ ధరలు పెరగడంతో సాగు ఖర్చులు అధికమయ్యాయి. వ్యవసాయ యంత్రాల వినియోగం పెరిగింది. ఆధునిక సాంకేతికతలు, డ్రిప్ ఇరిగేషన్, మైక్రో న్యూట్రియంట్స్, నాణ్యమైన విత్తనాల వాడకం వంటి అంశాలు రైతుల ఖర్చును మరింత పెంచాయి. ఈ పరిస్థితుల్లో ఇప్పటికీ 2019లో నిర్ణయించిన అదే రూ.6,000 మొత్తాన్ని కొనసాగించడం రైతులపై పెరుగుతున్న ఆర్థిక భారాన్ని పరిగణనలోకి తీసుకోనట్టే కనిపిస్తోంది. ప్రస్తుతం ఒక ఎకరం వరి సాగుకు సగటున రూ.30,000 నుంచి రూ.50,000 వరకు ఖర్చు అవుతోంది. ఇతర పంటల సాగులో కూడా ఇదే పరిస్థితి ఉంది. అలాంటి సమయంలో ఏడాదికి కేవలం రూ.6,000 ఇవ్వడం ద్వారా రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు. అందువల్ల పీఎంకిసాన్ కింద అందించే ఆర్థిక సహాయాన్ని కనీసం రూ.10,000 నుంచి రూ.12,000 వరకు పెంచాల్సిన అవసరం ఉంది. రైతులకు అందే ఈ మొత్తం పెరిగితే సాగు ప్రారంభ సమయంలో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడానికి కొంతవరకు ఉపయోగపడుతుంది. ఇంకా ముఖ్యంగా పథకం అమలులో ఉన్న నిబంధనలను కూడా పునఃసమీక్షించాల్సిన అవసరం ఉంది. పీఎంకిసాన్ ప్రారంభ సమయంలో భూ రికార్డుల్లో పేర్లు ఉన్న రైతులకే ప్రయోజనం అందింది. అయితే అనంతరం వారసత్వంగా భూములు పొందిన అనేక మంది రైతులు ఇప్పటికీ ఈ పథకం పరిధిలోకి రాలేకపోతున్నారు. కుటుంబ పెద్ద మరణించిన తరువాత భూమి వారసుల పేర్లకు మారినా, వివిధ సాంకేతిక, పరిపాలనా కారణాలవల్ల కొత్త రైతులకు ప్రయోజనం అందడం లేదు. ఫలితంగా వాస్తవంగా వ్యవసాయం చేస్తున్న రైతులు కూడా పథకం నుంచి దూరమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూముల వారసత్వ మార్పిడి ప్రక్రియ చాలా కాలం పడుతోంది. కొన్నిచోట్ల భూ వివాదాలు, రికార్డుల సవరణల ఆలస్యం, సాంకేతిక లోపాల కారణంగా రైతులు పీఎంకిసాన్ లబ్ధి పొందలేకపోతున్నారు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కొత్త వారసుల



నమోదుకు అవకాశం కల్పించాలి. రెవెన్యూ, వ్యవసాయ శాఖల సమన్వయంతో భూమి వారసత్వ బదలీలు పూర్తయిన వెంటనే పీఎంకిసాన్‌లో స్వయంచాలక నమోదు జరిగే విధానం తీసుకురావాలి. కోవిడ్ మహమ్మారి తరువాత వ్యవసాయ రంగంలో కూడా అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. రైతుల ఆదాయం ఆశించినంతగా పెరగలేదు. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పులు, అనిశ్చిత వర్షాలు, మార్కెట్ ధరల హెచ్చుతగ్గులు రైతులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో రైతులకు ప్రత్యక్ష నగదు సహాయం మరింత అవసరమైంది. అందుకే పీఎంకిసాన్‌ను కేవలం సంక్షేమ పథకంగాకాకుండా వ్యవసాయ స్థిరత్వానికి బలమైన మద్దతు పథకంగా మార్చాల్సిన అవసరం ఉంది. రైతుల అభివృద్ధి కేవలం నగదు సహాయంతోనే సాధ్యంకాదు. బ్యాంకు రుణాల విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం మరింత చొరవ చూపాలి. ప్రస్తుతం కొన్ని రాష్ట్రాలు సున్నా వడ్డీ లేదా పావలా వడ్డీతో రైతులకు రుణాలు అందిస్తున్నాయి. అయితే దేశవ్యాప్తంగా ఒకే విధానం లేదు. ఫలితంగా రాష్ట్రాన్ని బట్టి రైతులకు లభించే ప్రయోజనాలు మారుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా చిన్న, సన్నకారు రైతులకు సున్నా వడ్డీతో వ్యవసాయ రుణాలు అందించే విధానాన్ని రూపొందించాలి. దీనివల్ల రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుంది. వ్యవసాయ రుణాల మంజూరులో ఉన్న క్లిష్టమైన విధానాలను కూడా సరళీకరించాలి. చిన్న రైతులు బ్యాంకుల చుట్టూ తిరగకుండా గ్రామ స్థాయిలోనే రుణాల మంజూరు జరిగే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలి. రైతు భరోసా కేంద్రాలు, వ్యవసాయ విస్తరణ అధికారులు, బ్యాంకింగ్ ప్రతినిధుల ద్వారా రుణాల ప్రక్రియను సులభతరం చేయాలి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసింది. పీఎంకిసాన్ కూడా వాటిలో ఒక ముఖ్యమైన పథకం. అయితే కాలానుగుణంగా పథకాలలో మార్పులు చేయడం కూడా అంతే అవసరం. 2019లో నిర్ణయించిన ప్రమాణాలు2026లో కూడా యథాతథంగా కొనసాగడం సమంజసం కాదు. రైతుల అవసరాలు, సాగు ఖర్చులు, ఆర్థిక పరిస్థితులు మారినప్పుడు పథకాలూ మారాలి. పీఎంకిసాన్ మొత్తాన్ని పెంచడం, కొత్త వారసత్వ రైతులను చేర్చడం, భూ రికార్డుల ఆధునీకరణ చేయడం, రైతులకు సున్నా వడ్డీ రుణాలు అందించడం, చిన్న సన్నకారు రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వడం వంటి సంస్కరణలు అమలు చేస్తే ఈ పథకం మరింత ప్రభావవంతంగా మారుతుంది. రైతు ఆదాయం పెరగడం, వ్యవసాయం లాభదాయకంగా మారడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడం వంటి లక్ష్యాలు కూడా సులభంగా సాధ్యమవుతాయి. దేశానికి అన్నం పెట్టే రైతు ఆర్థికంగా బలపడితేనే అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరుతాయి. అందువల్ల పీఎంకిసాన్ పథకాన్ని ప్రస్తుత పరిస్థి తులకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించి, రైతుల వాస్తవ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిబంధనలను సవరించ దం కాలానుగుణ అవసరంగా మారింది. రైతుకు భరోసా కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం మరింత ముందడుగు వేస్తే, అది వ్యవసాయ రంగానికే కాకుండా దేశ భవిష్యత్తుకూ మేలు చేస్తుంది. ●

# చక్కెర ఎగుమతులపై నిషేధం?



## బలపడుతున్న ఎల్ నినో... రుతుపవనాలు కనుమరుగు

### చెరకు ఉత్పత్తిపై గణనీయ ప్రభావం : కేంద్రం తాజా యోచన

**న్యూఢిల్లీ, జూన్ 22:** బలపడుతున్న ఎల్ నినో వాతావరణ సరళి భారతదేశ చక్కెర పరిశ్రమకు ఆందోళనలను కలిగిస్తోంది. చక్కెర ఉత్పత్తి ఒత్తిడికి గురైతే, దేశం చాలా సంవత్సరాల పాటు ప్రపంచ చక్కెర ఎగుమతి మార్కెట్‌కు దూరంగా ఉండ వచ్చని వ్యాపారులు, పరిశ్రమ అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచంలో రెండవ అతిపెద్ద చక్కెర ఎగుమతిదారు అయిన భారతదేశం, పసిఫిక్ మహాసముద్రంలో ఎల్ నినో అభివృద్ధిని నిశితంగా గమనిస్తోంది. ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో ఆవర్తనంగా సంభవించే వేడెక్కడం వల్ల ఏర్పడే ఒక వాతావరణ దృగ్విషయం, ఇది ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ సరళిని ప్రభావితం చేస్తుంది. భారతదేశంలో, ఎల్ నినో తరచుగా బలహీనమైన రుతుపవన వర్షపాతం, వేడి పరిస్థితులతో ముడిపడి ఉంటుంది, ఈ రెండూ వ్యవసాయ ఉత్పత్తిని ప్రభావితం చేయగలవు. ఈ యేడాది ఈ దృగ్విషయం జూన్‌లో ప్రారంభమైంది. దాని పెరుగుతున్న బలం, సంభావ్య తీవ్ర పరిణామాలతో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ శాస్త్రవేత్తలను ఆందోళనకు గురిచేసింది.

**చెరకు పంటపై ఎల్ నినో ప్రభావం**

మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్రంలోని కొన్ని ప్రాంతాలలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా పెరిగినప్పుడు ఎల్ నినో ఏర్పడుతుంది. ఇది భారతదేశానికి చాలా దూరంలో ఏర్పడినప్పటికీ, దేశ వార్షిక వర్షపాతంలో దాదాపు 75శాతం అందించే నైరుతి రుతుపవనాలపై ఇది ప్రభావం చూపుతుంది. పెరుగుదల కాలమంతా అధిక మొత్తంలో నీరు అవసరమయ్యే చెరకు పంటకు ఇది ప్రత్యేకంగా ముఖ్యమైనది. ప్రధాన చక్కెర ఉత్పత్తి రాష్ట్రాలలో రుతుపవన వర్షపాతం తక్కువగా ఉంటే, చెరకు దిగుబడి తగ్గి, మొత్తం చక్కెర ఉత్పత్తి కూడా పడిపోవచ్చు. పరిశ్రమ అంచనాల ప్రకారం, ఈ సీజన్‌లో భారతదేశ చక్కెరఉత్పత్తి దేశీయ డిమాండ్ కంటే తక్కువగానే ఉంటుందని భావిస్తున్నారు. ఉత్పత్తి సుమారు 27.9 మిలియన్ మెట్రిక్ టన్నులుగా అంచనా వేయగా, వార్షిక వినియోగం దాదాపు 28.5 మిలియన్ టన్నులుగా ఉంటుందని అంచనా. దేశీయ ఆహార ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి సెప్టెంబర్ 30 వరకు చక్కెర ఎగుమతులను నిలిపివేసింది.

**అనూహ్యంగానే వాతావరణం**

చెరకునుండి ఇథనాల్‌ఉత్పత్తిని పెంచుతుండటంతో, ఇతర అవసరాలకు చక్కెర లభ్యత తగ్గుతుండటంతో ఈ ఆందోళనలు తలెత్తుతున్నాయి. అయితే, భవిష్యత్ సరఫరాలను నిర్ణయించడంలో వాతావరణ పరిస్థితులే అత్యంత ముఖ్యమైన అంశమని పరిశ్రమ నిపుణులు తెలిపారు. గత ఎల్ నినో సంవత్సరాలలో భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో సాధారణంకంటే తక్కువ వర్షపాతం, వ్యవసాయ అంతరాయాలు సంభవించాయి. ప్రస్తుత వాతావరణ ప్రభావం బలపడుతున్నందున, రుతుపవనాలపైనా, పంట ఉత్పత్తిపైనా దాని ప్రభావం ఎలా ఉంటుందోనని వాతావరణ శాస్త్రవేత్తలు నిశితంగా గమనిస్తున్నారు.

ఈయేడాది రుతుపవనాలు బలహీనంగా ఉంటాయని, వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) కూడా అంచనా వేసింది. 2026 ఎల్ నినో ఎంత బలంగా మారుతుందో కచ్చితంగా చెప్పడానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ, రాబోయే నెలల్లో దాని పరిణామాలు చెరకు సాగుపై తీవ్ర ప్రభావం చూపవచ్చు. ప్రస్తుతానికి, దృష్టి అంతా పసిఫిక్ మహాసముద్రంపైనే ఉంది. అక్కడ వేడెక్కుతున్న జలాలు, భారతదేశంలోని అత్యంత ముఖ్యమైన వ్యవసాయ రంగాలలో ఒకటైన చెరకు సాగుకు వాతావరణ పరిస్థితులు మరింత సవాలుగా మారవచ్చని ముందస్తు సంకేతాలు ఇస్తున్నాయి.



## అమెరికాపై చైనా ప్రతీకారం

# 46 కంపెనీలపై నిషేధం

**బీజింగ్, జూన్ 22:** ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం మరోసారి ముదిరింది. చైనా సైన్యానికి సహకరిస్తున్నాయనే ఆరోపణలతో 80 చైనీస్ కంపెనీలను అమెరికా ఇటీవల బ్లాక్‌లిస్ట్‌లో చేర్చిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారం తీర్చుకుంటూ, చైనా ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా 46 అమెరికన్ కంపెనీలపై నిషేధాజ్ఞలు విధించింది. రక్షణ, కీలక ఖనిజాల మైనింగ్ రంగాలకు చెందిన యుఎస్ సంస్థలను లక్ష్యంగా చేసుకుని బీజింగ్ ఈ సంచలన నిర్ణయం తీసుకుంది.

**అమెరికా కంపెనీలపై ఆంక్షల పర్వం**

జాతీయ భద్రతను కాపాడుకోవడమే లక్ష్యంగా ఈ కొత్త ఎగుమతి నియంత్రణలను విధిస్తున్నట్లు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అమెరికా రక్షణ విభాగంతో ఒప్పందాలు కలిగి ఉన్న ఓష్‌కోష్ డిఫెన్స్ (మిలిటరీ వాహనాల తయారీ సంస్థ), ఎవియాక్స్ వంటి 10 ప్రముఖ యుఎస్ కంపెనీలపై చైనా ఎగుమతి ఆంక్షలు విధించింది. వాషింగ్టన్ తీసుకున్న 'చైనీస్ మిలిటరీ ఎంటర్‌ప్రైజ్ లిస్ట్' నిర్ణయానికి ఇది ప్రత్యక్ష కౌంటర్ అని బీజింగ్ స్పష్టం చేసింది.

**ప్రభుత్వ కొనుగోళ్లపై పూర్తి నిషేధం**

మరోవైపు చైనా ఆర్థిక మంత్రిత్వ శాఖ మరింత దూకుడుగా వ్యవహరిస్తూ, తమ ప్రభుత్వ ఏజెన్సీలు 46 అమెరికన్ కంపెనీల నుంచి ఎలాంటి ఉత్పత్తులను కొనుగోలు చేయకూడదని ఆదేశించింది. ఈ నిషేధిత జాబితాలో లాక్‌హీడ్ మార్టిన్, రేథియాన్, బోయింగ్ రక్షణ విభాగాలు వంటి దిగ్గజ సంస్థలు ఉన్నాయి. సోమవారం నుంచే ఈ నిషేధం అమలులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. అయితే, చైనాలో అమెరికా పెట్టుబడులతో నడుస్తున్న కంపెనీలకు ఈ కొనుగోలు ఆంక్షల నుంచి మినహాయింపు ఇచ్చారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో బీజింగ్‌లో భేటీ అయి, ఇరు దేశాల మధ్య సంబంధాలను మెరుగుపరిచేందుకు చర్చలుజరిపిన నెలరోజుల వ్యవధిలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఇటీవల అమెరికా విధించిన బ్లాక్‌లిస్ట్‌లో చైనాకు చెందిన ప్రముఖ టెక్నాలజీ దిగ్గజాలు అలీబాబా, బైదూలతోపాటు ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ బివైడి కూడా ఉన్నాయి. దీనికి ప్రతిచర్యగానే చైనా ఈ తాజా ఆంక్షల అస్త్రాన్ని ప్రయోగించింది.

## పిఎం బాల పురస్కార్ 2026 దరఖాస్తుల ఆహ్వానం

**న్యూఢిల్లీ, జూన్ 22:** అసాధారణ ప్రతిభ కనబరిచిన చిన్నారులను సత్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ 2026' దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. క్రీడలు, సాహసం, సామాజిక సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, కళలు అనే ఆరు విభాగాల్లో అద్భుత సాధన చేసిన బాలబాలికలు నేరుగా తమకు తాముగా లేదా ఇతరుల ద్వారా నామినేట్ చేయవచ్చు. అర్హులైన వారు జులై 31, 2026లోపుహెచ్‌టిటిపిఎస్:// ఎడబ్ల్యుఎఆర్‌డిఎస్. జిఒవి.ఇన్‌ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

## అయోధ్య విరాళాలపై విచారణకు హైకోర్టు నిరాకరణ

**అలహాబాద్, జూన్ 22:** అయోధ్య రామమందిరానికి వచ్చిన విరాళాలు, కానుకల్లో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన పిల్‌పై అత్యవసర విచారణకు అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ నిరాకరించింది. విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై వెంటనే విచారణ చేపట్టాల్సిన అవసరం లేదని కోర్టు తేల్చిచెప్పింది. అయితే రామాలయ నిధుల దుర్వినియోగంపై వ్యక్తిగత విచారణ చేపట్టాలని పిటీషనర్ మోహిత్ అశోక్ అలహాబాద్ హైకోర్టులో పిల్ వేశారు. తక్షణమే ఈ కేసులో విచారణ అవసరం లేదని అలహాబాద్ హైకోర్టుకు చెందిన జస్టిస్ పంకజ్ భాటియా, అమితాబ్ కుమారి రాయ్‌తో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. ఇప్పటికే కోర్టులో చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, మిగితా కేసులను పక్కన పెట్టి, రామాలయ నిధుల కేసును విచారణ చేపట్టాల్సిన అవసరం లేదని కోర్టు చెప్పింది.లక్నో బెంచ్ ముందు సుమారు 529 కొత్త కేసులు ఉన్నాయి. దాంట్లో అయోధ్య కేసు 393 సీరియల్ నెంబర్‌గా ఉంది. లక్నో బెంచ్ చాలా కేసులను డీల్ చేస్తోందని, ఇప్పుడు అయోధ్య కేసును త్వరిత గతిన విచారించాల్సిన అవసరం లేదని కోర్టు పేర్కొన్నది. అయోధ్య ఆలయం నిర్మాణం కోసం సేకరించిన విరాళాలను దుర్వినియోగం చేసిన కేసులో ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం దర్యాప్తు చేపట్టిందని అలహాబాద్ హైకోర్టు బెంచ్ పేర్కొన్నది. రామమందిరానికి అందిన విరాళాల్లో గోల్‌మాల్ జరిగిందనే ఆరోపణలపై ఇప్పటికే సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో సిట్ అధికారులు పలువురిని విచారించారు. పూర్తి విచారణ తర్వాతే ఈ వివాదంపై అసలు వాస్తవాలు వెలుగులోకి రానున్నాయి.

## కేన్సర్ రోగిపై ముగ్గురు పోలీసుల లైంగిక దాడి

**న్యూఢిల్లీ, జూన్ 22:** హర్యానాలో దారుణం జరిగింది. కురుక్షేత్ర జిల్లా లద్వాలో బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న 30 ఏళ్ల బ్యాంక్ ఉద్యోగిపై ముగ్గురు పోలీసులు లైంగిక దాడికి పాల్పడ్డారు. జూన్ 17 రాత్రి బైక్‌పై వెళ్తుండగా ఆపి మొబైల్ లాక్కొని స్టేషన్‌కు తీసుకెళ్లారు. తాను క్యాన్సర్ రోగిని అని.. చికిత్స తీసుకుంటున్నానని చెప్పినా పోలీసులు సదరు యువకుడిపై కనికరం చూపించలేదు. కీమోథెరపీ తర్వాత శరీరంపై వెంట్రుకలు ఊడిపోతే.. కాళ్లపై వెంట్రుకలు లేకపోతే అమ్మాయిల స్మూత్‌గాఉన్నావంటూ లైంగిక దాడికి పాల్పడ్డారు. పోలీసుల దుశ్చర్య తర్వాత ఇంటికెళ్లిన యువకుడికి మరుసటిరోజు రక్తస్రావం జరగడంతో కుటుంబసభ్యులకు విషయంచెప్పాడు. ఘటన తర్వాత ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తొలుత లద్వా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. పరిస్థితి మరింత విషమంగా ఉండటంతో లోక్ నాయక్ జయప్రకాశ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, వైద్య పరీక్షలు నిర్వహించి యువకుడి కాలు విరిగిందని, లైంగిక దాడి జరిగిందని వైద్యులు నిర్ధారించారు. దీంతో అఘాయిత్యానికి ఒడిగట్టిన ఏఎస్సైలు సంజీవ్ కుమార్, రాజేందర్ కుమార్, హోంగార్డు సుమిత్‌లపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ చంద్రమోహన్ తెలిపారు.

# ఖతార్‌లో భారీ అగ్నిప్రమాదం



## 18 మంది గల్లంతు.. 54 మందికి గాయాలు

**దోహా, జూన్ 22:** ఇరాన్-ఇజ్రాయెల్, అమెరికా యుద్ధ ప్రభావంతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఖతార్‌కు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. దేశంలోని కీలక సహజవాయువు ఎగుమతి కేంద్రం రాస్ లాఫాన్ ఇండస్ట్రియల్ ఏరియాలో ఆదివారం రాత్రి భారీ పేలుడు సంభవించి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో కనీసం 54 మంది గాయపడగా.. మరో 18 మంది ఆచూకీ లభించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇరాన్ దాడుల కారణంగా నిలిచిపోయిన కార్యకలాపాలను తిరిగి ప్రారంభించేందుకు కార్మికులు ప్రయత్నిస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. యుద్ధ సమయంలో ఇరాన్ బాంబు దాడులకు గురైన తర్వాత ఖతార్‌లోని గ్యాస్ ఉత్పత్తి, ఎగుమతి వ్యవస్థలు తీవ్రఅంతరాయం, ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

కాగా, ప్రపంచంలోనే అగ్రగామి సహజ వాయు ఉత్పత్తిదారుల్లో ఖతార్ ఒకటి. అయితే, యుద్ధం కారణంగా హార్ముజ్ జలసంధిపై ఇరాన్ ప్రభావం పెరగడంతో ఎగుమతులు నిలిచిపోయాయి. ప్రస్తుతం యుద్ధానికి శాశ్వత ముగింపు దిశగా చర్చలు కొనసాగుతున్న వేళ హార్ముజ్ జలసంధిపై ఇరాన్ తన వైఖరిని కొంతమేర మార్చుకుంది. దీంతో ఖతార్ మళ్లీ ఎగుమతి కార్యకలాపాలను ప్రారంభించే పనుల్లో నిమగ్నమైంది.

ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి బర్జాన్ గ్యాస్ సప్లయి ఫెసిలిటీలో పేలుడు సంభవించినట్లు ప్రభుత్వరంగ సంస్థ ఖతార్ ఎనర్జీ వెల్లడించింది. పేలుడు అనంతరం భారీ మంటలు చెలరేగడంతో సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. తొలుత కొంతమందికే గాయాలు అయ్యాయని అధికారులు ప్రకటించినప్పటికీ, కొన్ని గంటల తర్వాత ఖతార్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. దాని ప్రకారం 54 మంది గాయపడ్డారని, 18 మంది గల్లంతయ్యారని వెల్లడించింది. అయితే, పేలుడు కారణంగా ఏర్పడిన నష్టం ఎంత మేర ఉందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ ఘటనతో ఇప్పటికే ఒత్తిడిలో ఉన్న ప్రపంచ ఇంధన మార్కెట్లలో మరింత అనిశ్చితి నెలకొనే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు ప్రమాదంపై ఖతార్ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

## మాస్కోపై ఉక్రెయిన్ డ్రోన్ల వర్షం

### విమానాశ్రయాలు మూత

**కీవ్, జూన్ 22:** రష్యాపై ఉక్రెయిన్ భీకర దాడులు కొనసాగిస్తోంది.మాస్కో, దానిపరిసరాల ప్రాంతాలే లక్ష్యంగా ఆదివారం వందల డ్రోన్లతో విరుచుకుపడింది. వాటిలో దాదాపు 60 డ్రోన్లను కూల్చేసినట్లు రష్యా ఎయిర్ డిఫెన్స్ అధికారులు వెల్లడించారు. దాడుల నేపథ్యంలో నగరంలోని నాలుగు విమానాశ్రయాలు మూతపడ్డాయి. క్రిమియాపై కూడా ఉక్రెయిన్ దాడులకు పాల్పడుతుండడంతో అదనపు భద్రతా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

ముందుజాగ్రత్త చర్యగా క్రిమియాలో సోమవారం జరగాల్సిన అన్నిబహిరంగ కార్యక్రమా లను రద్దు చేశారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు.. ఇంధన సదుపాయాలు, చమురు శుద్ధి కేంద్రాలపై కీవ్ దాడులు చేయడంతో క్రిమియా ప్రాంతంలో ఇంధన సరఫరాకు తీవ్ర అంతరాయం నెలకొంది. దీంతో నగరవ్యాప్తంగా ఉన్న పెట్రోల్ స్టేషన్లలో ప్రజలకు, ప్రభుత్వేతర సంస్థలకు ఇంధన విక్రయాలను నిలిపివేశారు.

విరామం ఇవ్వకుండా ఉక్రెయిన్ ప్రతిరోజూ వందల డ్రోన్‌లతో విరుచుకుపడుతుండడంతో మాస్కో ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ క్రమంలోనే ఉక్రెయిన్‌లోని దక్షిణ ఒడెసా ప్రాంతంపై రష్యా చేసిన ప్రతిదాడుల్లో ఒకరు మరణించగా.. ముగ్గురు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు.

# 'నీట్' రీ ఎగ్జామ్‌లో నకి'లీల'లు!




## బీహార్‌లో 24 మంది అరెస్టు

### నీట్‌పై అదంతా ఫేక్ ప్రచారం: ఎన్‌టిఎ

**న్యూఢిల్లీ, జూన్ 22:** నీట్ రీటెస్ట్‌లో అవకతవకలు బయటపడ్డాయి. అభ్యర్థులకు బదులు కొందరు మెడికల్, నర్సింగ్ విద్యార్థులు నీట్ పరీక్ష రాశారు. పరీక్షా కేంద్రాల్లోని బయోమెట్రిక్ ఉద్యోగులు వీరికి సహకరించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో ఈ ముఠాకు చెందిన 24 మందిని అరెస్ట్ చేశారు. బీహార్‌లోని పాట్నా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో మూడవ సంవత్సరం ఎంబిబిఎస్ చదువుతున్న మయాంక్ కశ్యప్ అనే మెడికల్ విద్యార్థి, నీట్ అభ్యర్థికి బదులు పరీక్ష రాసేందుకు హాసన్‌పూర్ హైస్కూల్ పరీక్షా కేంద్రానికి చేరుకున్నాడు. బయోమెట్రిక్ సంస్థ ఉద్యోగిగా నమ్మించి లోనికి ప్రవేశించాడు.

కాగా, పరీక్షా నిర్వాహకులు అనుమానించడంతో తొలుత మయాంక్ కశ్యప్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి సమాచారం ఆధారంగా లఖీసరాయ్‌లోని కెఆర్‌కె హయ్యర్ సెకండరీ స్కూల్, కేంద్రీయ విద్యాలయాలలో ఏర్పాటు చేసిన ఎగ్జామ్ సెంటర్స్‌పై పోలీసులు రైడ్ చేశారు. దీంతో అసలు అభ్యర్థులకు బదులుగా పరీక్షలు రాస్తున్న ప్రాక్సీ నెట్‌వర్క్ గుట్టురట్టయ్యింది. వైద్య, నర్సింగ్ విద్యార్థుల ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలింది.

దీంతో అసలు అభ్యర్థులకు బదులు పరీక్షలు రాసిన బనారస్ హిందూ విశ్వవిద్యాలయం నర్సింగ్ విద్యార్థిని పూనమ్ కుమారి, ఎయిమ్స్ రాయ్‌బరేలీ విద్యార్థి సౌరభ్ ఝా, ఢిల్లీలోని షాదారా మెడికల్ కాలేజీలో ఇంటర్న్‌గా పనిచేస్తున్న అమన్ అగర్వాల్, నలంద మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ నర్సింగ్ విద్యార్థి సంజీత్, అతడి సోదరుడు, ఏడుగురు అసలు అభ్యర్థులు, బయోమెట్రిక్ సంస్థకు చెందిన 14 మంది ఉద్యోగులతో సహా మొత్తం 24 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు.


**చాట్‌జిపిటితో నకిలీ నీట్ పేపర్స్ అమ్మిన లా స్టూడెంట్ అరెస్ట్:**

ఒక లా స్టూడెంట్ చాట్‌జిపిటి, ఎఐ ద్వారా నకిలీ నీట్ ప్రశ్నాపత్రాలు తయారు చేశాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రచారంద్వారా రూ.50,రూ.100కువాటిని అమ్మాడు. పసిగట్టిన పోలీసులు అతడ్ని అరెస్ట్ చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ సంఘటన జరిగింది. లసూడియా ప్రాంతానికి చెందిన అక్షయ్ మాల్వీయా, ఇండోర్‌లోని ఒక లా కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పాత ప్రశ్నాపత్రాలు, స్టడీ మెటీరియల్‌ను ఉపయోగించి చాట్‌జిపిటి, ఏఐ ద్వారా నకిలీ నీట్ పేపర్స్‌ను తయారు చేశాడు. ఒక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా తెరిచాడు. నీట్ పేపర్ లీకైనట్లు అందులో ప్రచారం చేశాడు. రూ.50 నుంచి వంద వరకు వాటిని విక్రయించాడు. కాగా, నీట్ పేపర్ల యాక్సెస్ కోసం ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయాల్సిన ఒక లింక్‌ను తన ప్రొఫైల్‌లో అక్షయ్ ఉంచాడు. సుమారు 20 మందికిపైగా విద్యార్థులు యుపిఐ, ఇతర ఆన్‌లైన్ పద్ధతుల ద్వారా చెల్లింపులుచేసి వాటిని కొనుగోలుచేసినట్లు పోలీసులు గుర్తించారు. రాజస్థాన్‌లోని కోటా పోలీసుల నిఘా సమాచారంతో ఇండోర్ పోలీసులు స్పందించారు. శనివారం రాత్రి అతడ్ని అరెస్ట్ చేశారు. నీట్ యుజి 2026 రీటెస్ట్ ప్రశ్నాపత్రం లీక్ అయిందంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియోను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) తీవ్రంగా ఖండించింది. ఆ వీడియో పూర్తిగా కల్పితమని, అందులోని వాదనలు అవాస్తవమని స్పష్టంచేసింది. ఇటువంటి తప్పుడు ప్రచారాలను విద్యా ర్థులు, తల్లిదండ్రులు నమ్మవద్దని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేసింది.మే నెలలో జరిగిన పరీక్షపై పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో, దానిని రద్దు చేసి జూన్ 21న నీట్ రీఎగ్జామ్‌ను తిరిగి నిర్వహించారు. అయితే, పరీక్ష జరిగిన మరుసటి రోజే పేపర్ లీక్ అయిందంటూ ఒక వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీనిపై ఎన్టీఎ వెంటనే స్పందిస్తూ, "అత్యంత పటిష్ఠమైన భద్రత, నిఘా మధ్య పరీక్షను విజయవంతంగా పూర్తి చేశాం. వైరల్ అవుతున్న ఆ వీడియో నకిలీది" అని ప్రకటనలో పేర్కొంది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) ఫ్యాక్ట్‌చెక్ విభాగం కూడా ఈ వీడియోను నిశితంగా పరిశీలించి, అందులో పలు వ్యత్యాసాలు ఉన్నాయని వెల్లడించింది. ముఖ్యంగా, ప్రశ్నపత్రాల ప్యాకెట్‌లో తప్పనిసరిగా ఉండాల్సిన ఓఎంఆర్ ఆన్సర్ షీట్ ఆ వీడియోలో లేకపోవడాన్ని గుర్తించింది. పరీక్షకు ముందు ప్రశ్నపత్రాలు బయటకు వచ్చే ఆస్కారమే లేదని స్పష్టం చేసింది.

# నటుడు ప్రకాష్‌రాజ్‌కు నాన్‌బెయిల్‌బుల్ వారంట్

**బెంగళూరు, జూన్ 22:** ప్రముఖ నటుడు, సామాజిక రాజకీయ విమర్శకుడు ప్రకాష్ రాజ్ చుట్టూ వివాదం నెలకుంది. ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ ఓటరు గుర్తింపు కార్డులు ఉండకూడదనే ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారనే కేసులో ఆయనకు గట్టి షాక్ తగిలింది. బెంగళూరులోని 48వ ఎసిజెఎం కోర్టు శనివారం ప్రకాష్ రాజ్‌పై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తూ సంచలన ఆదేశాలు ఇచ్చింది. వివరాల్లోకి వెళితే... ప్రకాష్‌రాజ్‌కు ఒకే సమయంలో నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో ఓటరు గుర్తింపు కార్డులు ఉన్నాయంటూ 2019లో దిలీప్ కుమార్ అనే న్యాయవాది బెంగళూరు హాలసూరు గేట్ పోలీస్ స్టేషన్‌లో తొలిసారి ఫిర్యాదు చేశారు. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడుతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆయనకు ఓటు హక్కు ఉందని, ఇది ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం చట్టవిరుద్ధమని పిటిషనర్ పేర్కొన్నారు.

ఈ అక్రమ ఓట్ల వ్యవహారంపై బృహత్ బెంగళూరు మహానగర పాలిక (బిబిఎంపి) సంస్థ అధికారులకు, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేకపోవడంతో సదరు న్యాయవాది ఏకంగా కోర్టును ఆశ్రయించారు. ఈ ప్రైవేట్ పిటిషన్‌ను స్వీకరించిన న్యాయస్థానం గత కొన్ని విచారణలుగా కోర్టుకు స్వయంగా హాజరుకావాలంటూ ప్రకాష్‌రాజ్‌కు సమన్లు జారీ చేసింది. అయితే, కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ ప్రకాశ్ రాజ్ వరుసగా కోర్టు విచారణలకు గైర్హాజరవుతూ వచ్చారు. కోర్టు సమన్లను లైట్ తీసుకోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయమూర్తి, ఈసారి ఆయనకు ఎలాంటి బెయిల్ దొరకకుండా నేరుగా నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. దీంతో పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి కోర్టు ముందు ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# సంక్షిప్త వార్తలు

## సిఎం విజయ్ బర్త్ డే.. బంగారు ఉంగరాలు పంపిణీ

**చెన్నై, జూన్ 22:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర మంత్రి శ్రీనాథ్ నవజాత శిశువులకు బంగారు ఉంగరాలను పంచడం వైరల్‌గా మారింది. విజయ్ పుట్టిన రోజున తూత్తుకుడి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరుగురు శిశువులు జన్మించినట్లు తెలుసుకున్న మంత్రి తన సొంత ఖర్చులతో ప్రత్యేకంగా తయారు చేయించిన బంగారు ఉంగరాలను బహూకరించారు. సిఎం పుట్టినరోజు నాడే తమ పిల్లలు పుట్టటం, అదే సమయంలో ఊహించని విధంగా మంత్రి బంగారు కానుక అందడంతో ఆయా కుటుంబాల్లో సంతోషం విరిసింది.

## కర్ణాటకలో కొత్త పార్టీ ప్రకటించిన కన్నడ నటుడు



**బెంగళూరు, జూన్ 22:** సరికొత్త పొలిటికల్ పార్టీ పెట్టబోతున్నట్లు కన్నడ నటుడు చేతన్ అహింసా ప్రకటించారు. కర్ణాటకలో ప్రస్తుతం ఉన్న రాజకీయ సమీకరణాలను మార్చేందుకే అవినీతి రహిత రాజకీయ పార్టీని నిర్మించి తాను రాజకీయాల్లోకి వస్తున్నట్టు తెలిపారు. 2028 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం నియోజక వర్గాల్లో పోటీ చేయబోతున్నట్లు ప్రకటించారు. ఆ దినగలు, మైనా చిత్రాల్లో చేతన్ నటించారు. గత కొన్నేళ్లుగా చేతన్.. కుల వివక్ష, సామాజిక న్యాయం, రాజ్యాంగ హక్కులపై పోరాడుతున్నారు.

## షిండే గూటికి చేరిన ఆరుగురు ఉద్ధవ్ ఠాక్రే ఎంపిలు

**ముంబై, జూన్ 22:** మహారాష్ట్ర రాజకీయాల్లో భారీ కుదుపు చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన పార్టీకి చెందిన 9 మంది లోక్‌సభ ఎంపీలలో ఆరుగురు (6) రెబల్ ఎంపీలు సోమవారం అధికారికంగా డిప్యూటీ సిఎం ఏకనాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరారు. ముంబైలోని వైబి చవాన్ సెంటర్ డిప్యూటీ సిఎం ఏకనాథ్ షిండే సమక్షంలో విలేకరుల సమావేశంలో నిర్వహించి పార్టీ మారుతున్నట్లు ఆరుగురు ఎంపిలు అధికారికంగా ప్రకటించారు. ఈ పరిణామంతో షిండే వర్గం చేపట్టిన 'ఆపరేషన్ టైగర్' వందశాతం విజయవంతమైందని సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ ప్రకటించారు. నియోజకవర్గాల అభివృద్ధి నిధుల కొరత, పార్టీ నేత సంజయ్ రౌత్ చేసిన వ్యక్తిగత దూషణల వల్లే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎంపిలు వెల్లడించారు.

## బ్రహ్మోస్ కొనుగోలుపై యుఎఇతో ఒప్పందం




**న్యూఢిల్లీ, జూన్ 22:** బ్రహ్మోస్ క్షిపణులు, ఆకాశ్‌తీర్ వైమానిక రక్షణ వ్యవస్థల కొనుగోలుపై భారత్‌తో యుఎఇ వేగంగా చర్చలు జరుపుతోంది. ఇరాన్ దాడుల నేపథ్యంలో తన రక్షణ వ్యవస్థను బలోపేతం చేసుకోవడానికి యుఎఇ ఈ నిర్ణయం తీసుకుంది. రష్యా భాగస్వామ్యంతో అభివృద్ధి చేసిన బ్రహ్మోస్ ఎగుమతికి మాస్కో అనుమతి అవసర మైనా, ఇరు దేశాల సంబంధాల వల్ల ఇది సులభం కానుంది. ఈ ఒప్పందం కుదిరితే ప్రపంచ రక్షణ ఎగుమతుల్లో భారత్ స్థానం మరింత బలపడుతుంది.

## మూడో రోజూ కాక్రోచ్ పార్టీ ధర్నా



**న్యూఢిల్లీ, జూన్ 22:** నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రదాన్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర ధర్నా చేస్తోంది. మూడు రోజులుగా చేస్తున్న తమ ప్రొటెస్ట్‌ను అడ్డుకోవాలని ప్రభుత్వం చూస్తోందని ఈ క్రమంలో జంతర్ మంతర్ దగ్గర నీటి సరఫరా ఆపేశారని, రెస్ట్ రూమ్‌లకు నీళ్ల లేకుండా చేశారని ఆ పార్టీ చీఫ్ అభిజీత్ దీప్కే ఆరోపించారు. జంతర్ మంతర్ వద్దకు వస్తున్న నిరసనకారులను ఆధార్‌కార్డు చూపించాలని పోలీసులు అడుగు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సచివాలయంలో సిఎస్‌తో సమావేశమైన ఎస్‌బిఐ అధికారులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 22:** రాయదుర్గం భూముల వ్యవహారంపై చర్చించేందుకు తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.రామకృష్ణారావుతో ఎస్‌బీఐ ఉన్నతా ధికారులు సోమవారం సచివాలయంలో సమావేశమయ్యారు. రాయదుర్గం భూముల అంశంలో ఎస్‌బీఐ వ్యవహరించిన తీరుపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎస్‌బీఐలో ఉన్న ప్రభుత్వ ఖాతాలు, లావాదేవీలను పూర్తిగా ఉపసంహరించుకోవాలనే నిర్ణయంపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కాగా, రాయదుర్గం భూముల వేలం వివాదం రాజకీయ రంగు పులుముకుంటోంది. తాము కేటాయించిన స్థలంలో రెండేళ్లలోపు నిర్మాణాలు జరపాలని లేకపోతే రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునే హక్కులు తమకు ఉన్నాయని కోర్టు ముందు తెలిపింది. బ్యాంకు ఈ ప్రాథమిక నిబంధనలను ఉల్లంఘించడం వల్లనే తాము భూమిని స్వాధీనం చేసుకోవాల్సి వచ్చిందని తెలిపింది. 2020 సంవత్సరంలోను 2024 లో కూడా పలు సందర్భాల్లో ఇతర సంస్థలకు కేటాయించిన భూములను నిరుపయోగంగా ఉంచడంతో ఇలాగే కేటాయింపులు రద్దుచేసి రాష్ట్ర ప్రభుత్వం భూములను వేలంపాట వేసిందని గుర్తు చేసింది. అయితే కోర్టు మాత్రం ఈనెల 18వ తేదీన బ్యాంకుకు అనుకూలంగా మధ్యంతర తీర్పునిచ్చి వేలం ప్రక్రియను 3 వారాలపాటు స్టే విధిస్తున్నట్లు నిర్ణయించింది. అయితే కోర్టు నుంచి వచ్చిన స్టే రాష్ట్ర ప్రభుత్వానికి తీవ్రమైన తలనొప్పిగా మారింది అని చెప్పవచ్చు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా ఎస్బిఐ పైన ప్రతీకార చర్యలు తీసుకునే బాటలో పడింది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉన్న అకౌంట్లను ఇతర బ్యాంకులకు తరలించేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా ఇందులో రాష్ట్ర ప్రభుత్వానికి చెందినటువంటి ప్రభుత్వ ఖాతాలు, సంక్షేమ నిధులు, ప్రభుత్వ ఉద్యోగుల శాలరీ అకౌంట్లు మొదలైనవి ఉన్నాయి. వీటిని ఇతర బ్యాంకులకు షిఫ్ట్ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.కాగా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ను కలిసిన తర్వాతనే ఎస్బిఐ చైర్మన్ రాజకీయ కోణంతో వ్యవహరిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం అటు విమర్శచేస్తోంది. అంతేకాదు ఈ వ్యవహారంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయాలని కూడా నిర్ణయించింది. హైదరాబాద్ నగర ఇమేజ్ దెబ్బతీసేందుకు ఇన్వెస్టర్లలో లేనిపోని భయాలను సృష్టించేందుకు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీతో కలిసి కొన్ని వర్గాలు కుట్ర చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. మరోవైపు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాంటి ప్రభుత్వంగ బ్యాంకు పైన ఇలాంటి బ్లాక్ మెయిలింగ్ చర్యలు మంచిది కాదని ప్రతిపక్ష నేతలు కూడా విమర్శిస్తున్నారు. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న సిఎం రేవంత్‌రెడ్డి ఎస్‌బిఐ విషయంపై ఆర్‌బిఐ గవర్నర్‌ను, కేంద్ర ఆర్థికమంత్రిని కలిసి ఫిర్యాదు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

# ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలి

## 22 నుంచి జూలై 5 వరకు రెండో దశ ఉద్యమం

### తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) నుండి మినహాయింపు ఇవ్వాలనితెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) డిమాండ్ చేసింది. ఈ నెల 22 నుంచి జులై 5 వరకు రెండో దశ ఉద్యమం చేపట్టనున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వొద్నాల రాజశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కల పల్లి పెంటయ్య తెలిపారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు కోరుతూ తపస్ రెండో దశ ఉద్యమం ప్రారం భమైందన్నారు. రెండో దశలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకు వచ్చేలా జీరో అవర్, క్వశ్చన్ అవర్‌లో ప్రస్తావన చేసేలా దేశవ్యాప్తంగా 545 మంది లోక్ సభ, 250 మంది రాజ్య సభ సభ్యులను కలిసేలా ఏబీఆర్ఎస్ఎం కార్యాచరణలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని ఉభయ సభల పార్లమెంట్ సభ్యులను తపస్ సంఘం పక్షాన కల్సి సమస్య తీవ్రత తెలియ జేస్తామన్నారు. జూలై 5 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అప్ప టికీ సమస్య పరిష్కారం కానట్లయితే దేశవ్యాప్తంగా ఢిల్లీ కేంద్రంగా ఆందోళన చేయనున్నట్లు వారు తెలిపారు.

# సిఎం ఓవర్సీస్‌కు దరఖాస్తు చేయండి

### మైనార్టీ సంక్షేమ శాఖ

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనుకునే రాష్ట్రానికి చెందిన మైనారిటీ విద్యార్థులు సీఎం ఓవర్సీస్ స్కాలర్షిప్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ గ్రాంట్ కోసం నుంచి ఆన్లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనారిటీ సంక్షేమ శాఖ వెల్లడిం చింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో అమెరికా, ఆస్ట్రేలియా, యూకే , కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, న్యూజిలాండ్, దక్షి ణ కొరియా, సింగ పూర్ తదితర దేశాల్లోని గుర్తింపు పొందిన విశ్వ విద్యాలయాల్లో స్ప్రింగ్- 2026 ఇన్టేక్ కింద పోస్ట్ గ్రాడ్యుయేట్ లేదా డాక్టోరల్ కోర్సుల్లో ప్రవేశం పొందిన ముస్లిం, సిక్కు, క్రైస్తవ, జైన, బౌద్ధ, పార్సీ మైనారిటీ స్టూడెంట్స్ ఈ స్కీం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వివరించింది. 2026 జనవరి 1 నుంచి జూన్ 30 మధ్య కాలంలో అడ్మిషన్ పొందిన వారు దీనికి అర్హులని స్పష్టం చేసింది. ఎంపికైన విద్యార్థులకు రూ.20 లక్షల వరకు ఆర్థిక సహాయం, ఒక వైపు విమాన ప్రయాణ చార్జీలు అందజేస్తారని తెలిపింది. అంతే కాకుండా విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షలకు మించరాదని, నిర్దేశించిన అన్ని అర్హతా ప్రమాణాలు తప్పని సరిగా ఉండా లని స్పష్టం చేసింది. తప్పుడు పత్రాలు సమర్పించి నట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న పశ్య పద్మ

## అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికై

# ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి

### బాధితుల సంఘం అధ్యక్షురాలు పశ్య పద్మ

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూన్ 22, ప్రభాతవార్త:** అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికై ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేయాలని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం అధ్యక్షురాలు పశ్య పద్మ తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో అగ్రిగోల్డ్ బాధితుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేసించి పశ్య పద్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ ఆస్తులను, బినామీ పేర్లతో ఉన్న ఆస్తులను స్వాధీనపరచుకోవాలని, అగ్రిగోల్డ్ కంపెనీ మోసాలకు తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడిన బాధిత కుటుంబాలకు 5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ కంపెనీ వేసిన వెంచర్లలో ఇళ్ల స్థలాలు, భూములు కొనుగోలు చేసి, రిజిస్టర్ అయిన వారం దరి స్థలాలను, భూములను అటాచ్మెంట్ నుంచి తొలగించి, యజమానులకు అప్పగించాలని అన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక కమిటీని వేసి, కోర్టును కూడా ఏర్పాటు చేసేందుకు పూనుకుందని, అదే విధంగా తెలంగాణ ప్రభుత్వం కూడా అగ్రిగోల్డ్ కంపెనీ ఆస్తులను వారి బినామీ ఆస్తులను జప్తు చేసి, బాధితులకు అప్పగించటానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి, అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించని పక్షంలో త్వరలో సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి జి.వి.ఆర్, ఉపాధ్యక్షురాలు రజిత, మానవ హక్కుల కమిటీ అధ్యక్షులు మల్లారెడ్డి మరియు వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చిన అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొన్నారు.

# జాతీయ నృత్యోత్సవాలతో వెల్లివిరిసిన తెలంగాణ ఖ్యాతి



కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత ఓలేటి రంగమణిని సత్కరిస్తున్న డిప్యూటీసిఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, అకాడమీ అధ్యక్షురాలు అలేఖ్య తదితరులు

### ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

### పర్యాటక ప్రదేశాల్లో కళాకారులకు వసతి రాయితీ: మంత్రి జూపల్లి

### కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార విజేతలకు ఘనసత్కారాలు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జూన్ 22, ప్రభాతవార్త :** రాష్ట్ర సంగీత నాటక అకాడమీ వివిధ విలక్షణ కార్యక్రమాలతో గుర్తింపు పొందడంతో పాటు జాతీయస్థాయిలో అర్ధనారీశ్వరం శీర్షికన జాతీయ నృత్యోత్సవం నిర్వహిస్తూ తెలంగాణ సాంస్కృతిక ఖ్యాతి వెల్లివిరిసేందుకు కృషి చేయడం హర్షదాయకమని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఆనందాన్ని వ్యక్తపరిచారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో నేటి నుండి మూడురోజుల పాటు నిర్వహిస్తున్న అర్ధనారీశ్వరం జాతీయ నృత్యోత్సవాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల తదితరులతో కలిసి ప్రారంభించి ప్రసంగించారు. కళాకారులను ప్రోత్సహిస్తూ గౌరవించు కోవడం మంచి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడు కోవడమేనని ప్రశంసించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ నృత్య నాట కోత్సవాలు అన్ని జిల్లాల్లో నిర్వహించాలని సూచించారు. తద్వారా తెలంగాణ కళాకారులకు జాతీయస్థాయిలో గుర్తింపు, ప్రదర్శనా వకాశాలకు దోహదపడ తాయన్న ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. రాష్ట్రం లోని అన్ని పర్యాటక ప్రదేశాల్లో కళాకారుల వసతి రాయితీలు కల్పించి ప్రోత్సహిస్తామని అన్నారు. అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల అధ్యక్షోపన్యాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వందరోజుల ప్రజాపాలన ఉత్సవాల్లో రవీంద్రభారతిలో సాయంత్రం 5గంటల నుండి వైభవోపేతంగా అర్ధనారీశ్వరం పేరున జాతీయ నృత్యోత్సవాలు మూడురోజుల పాటు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే కేంద్ర సంగీత నాటక అకాడమీ ఇటీవల ప్రకటించిన జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక అవార్డులు పొందిన తెలంగాణ విజేతలను అతిథుల చేతులమీదుగా ఘనంగా సత్కరించారు. సభానంతరం జాతీయ నృత్యోత్సవంలో మొదటిరోజు హైదరాబాద్ యువ కళాకారులు సురేంద్రనాథ్ డా. బిజినా దంపతులు ద్వయం కూచిపూడి నృత్యంతో ప్రారంభమై న్యూఢిల్లీ కళాకారులు వసీమ్‌రాజు సమర్పణలో కూచిపూడి నృత్యశైలిలో సమర్పణం; హైదరాబాద్ కళాకారులు ఆయానా మనోజు బాలరాజు బృందం అధర్వ ప్రదర్శనలు అబ్బురపరిచాయి. రెండవరోజు 23న ముంబయి కళాకారులు పవిత్ర భట్, అపర్ణశాస్త్రి ఏకమ్ దేవయామ్, బెంగళూరుకు చెందిన డా. వసంత్‌కిరణ్ సభాపతి, హైదరాబాద్‌కు చెందిన వైష్ణవి సాయినాథ్ నృత్యకదంబం భరతనాట్య ప్రదర్శనలు జరుగుతాయని చెప్పారు.

# బంగారు నగల దుకాణంపై బిఐఎస్ దాడులు

### హాల్‌మార్కింగ్ నిబంధన ఉల్లంఘన

### 1.6 కిలోల బంగారు ఆభరణాలు జప్తు



**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త :** బంగారు ఆభరణాలపై కేంద్ర ప్రభు త్వం అమలుచేస్తున్న హాల్‌మార్కింగ్ తప్పనిసరి నిబంధన బేఖాతర్ చేస్తున్న హైదరాబాద్‌లోని అబిడ్స్ ప్రాంతంలో ఉన్న ఓ నగల దుకా ణంపై భారతీయ ప్రమాణాల బ్యూరో అధికారులు దాడులు చేసి కిలోన్నర బంగారం జప్తు చేశారు. బిఐఎస్ చట్టం-2016 చట్టానికి అనుగుణంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. బిఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి, డైరెక్టర్ పి.వి. శ్రీకాంత్ ఆదేశాల మేరకు, డైరెక్టర్ సైంటిస్ట్ ఇ సత్తు సవిత నేతృత్వంలోని బృందం ఈ సోదాల్లో పాల్గొంది. తనిఖీల సందర్భంగా దుకాణంలో తప్పనిసరి బిఐఎస్ హాల్‌మార్క్ లేకుండా బంగారు ఆభరణాలను విక్రయానికి ఉంచినట్లు అధికారులు గుర్తించారు. అలాగే పాత హాల్‌మార్క్ గుర్తులతో ఉన్న ఆభరణాలు కూడా విక్రయిస్తున్నట్లు తేలింది. ఇవి బిఐఎస్ చట్టం-2016తో పాటు బంగారు ఆభరణాల హాల్‌మార్కింగ్ నిబంధనలకు విరుద్ధమని అధికారులు పేర్కొన్నారు.ఈ దాడుల్లో ఉంగరాలు, హారాలు, పెండెంట్లు తదితర ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సుమారు 1.6 కిలోల బంగారు ఆభరణాలను అధికారులు జప్తు చేశారు. సంబంధిత దుకాణంపై బిఐఎస్ చట్టం-2016 ప్రకారం తదుపరి చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు.వినియోగదారుల రక్షణ బిఐఎస్‌కు అత్యంత ప్రాధాన్యమైన అంశమని.. వినియోగదారులు బిఐఎస్ లోగో, ఆభరణం స్వచ్ఛత కేరట్లలో, హెచ్‌యూఐడి (హ నంబర్ ఉన్న హాల్‌మార్క్ బంగారు ఆభరణాలనే కొనుగోలు చేయాలని బిఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పివి శ్రీకాంత్ కోరారు. కొనుగోలు ముందు బిఐఎస్ కేర్ యాప్ ద్వారా ఆభరణాల ప్రామాణికతను తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని.. హాల్‌మార్క్ లేని బంగారు ఆభరణాల విక్రయం లేదా బీఐఎస్ హాల్‌మార్క్ దుర్వినియోగం గమనించినట్లయితే, బిఐఎస్ కేర్ యాప్ ద్వారానే ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. అలాగే నగల వ్యాపారులు అందరూ తప్పనిసరి హాల్‌మార్కింగ్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, బిఐఎస్ చట్టం-2016 ప్రకారం హాల్‌మార్క్ కలిగిన బంగారు ఆభరణాలనే విక్రయించాలని సూచించారు. వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల అమలు, మార్కెట్‌లో పారదర్శకత పెంపు లక్ష్యంగా బీఐఎస్ రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ నిఘా, అమలు చర్యలను నిరంతరం కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బంగారు ఆభరణాలు కొనుగోలు చేసే ముందు హెచ్‌యూఐడి నంబర్‌ను బిఐఎస్ కేర్ యాప్ ద్వారా తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలని, ప్రతి కొనుగోలుకు సరైన బిల్లు తీసుకోవాలని సూచించారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలి

### ప్రభుత్వ పాఠశాలల మూసివేత ఆలోచన విరమించుకోవాలి

### పాఠశాల డైరెక్టరేట్ ముందు ఎఐఎస్ఎఫ్ ధర్నా, పోలీసుల అరెస్ట్

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడిని అరికట్టాలని, ఫీజుల నియంత్రం చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం పాఠశాల విద్య డైరక్టరేట్ ముట్టడికి ప్రయత్నించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులను అడ్డుకున్న పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం ప్రైవేట్ పాఠశాలలో పేదలకు 25 శాతం సీట్లుఉచితంగా ఇవ్వాలని, 27వేల ప్రభుత్వ పాఠశాలలను 4వేలకు తగ్గిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన వెనక్కి తీసుకొని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ నేతలు లక్డికపూల్ పాఠశాల విద్యా కార్యాలయం ముందు ధర్నా చేయడానికి టెలిఫోన్ భవన్ నుండి ర్యాలీగా వెళ్లగా పోలీసులు అడ్డుకొని నాయకులను అరెస్ట్ చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అక్షరాలతో లక్షల వ్యా పారం చేస్తూ, యాజమాన్యాలు పాఠశాల లను అంగడి కేంద్రాలుగా మార్చాయన్నారు. ఎల్‌కేజీ విద్యకు రూ. లక్ష నుండి రూ. 4 లక్షల ఫీజు వసూలు చేస్తూ, పుస్తకాలు, యూనిఫామ్, ఐడి కార్డ్, డైరీలు, అడ్మిషన్ ఫీజుల పేరిట మరో లక్ష రూపాయల వసూలు చేస్తున్నాయన్నారు. ఏ ఒక్క పాఠశాల కూడా ఫీజుల నియంత్ర చట్టం అమలు చేయడం లేదని, విద్యాహక్కు చట్టం అమలు ఊసే లేకుండా పోతుందని, జిల్లా విద్యా శాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారులు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు వత్తాసు పలు కుతూ వారు చేసే దోపిడీపై చర్యలు తీసు కోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్లు గ్యార నరేష్, బానోత్ రఘురాం, రెహామాన్, లెనిన్, రాష్ట్ర నాయకులు చైతన్య యాదవ్, అన్వర్, శాంతికుమార్, దత్తు రెడ్డి, ఆకాష్ నాయక్, హరీష్ , అనిల్, అరుణ్, జోసెఫ్ భాను, అవినాష్, లోకేష్, నవీన్, విజయ్, శ్రీను, రాహుల్, లింగం, అస్లాం పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి

### ముఖ్యమంత్రికి సంస్థ జెఎసి లేఖ

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ ఆర్‌టీసీ) ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆర్‌టీసీ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జేఏసీ నేతలు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండీ మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదగిరి, సుద్దాల సురేష్, బి యాదగిరి ముఖ్యమంత్రికి లేఖ రాశారు. తెలంగాణలో 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో తాము అధికారంలోకి వస్తే ఆర్‌టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పడం జరిగిందని, ఆ ప్రకారంగా ఆర్‌టీసీ ఉద్యోగులు సమ్మె చేస్తున్న సందర్భంలో కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రుల సబ్ కమిటీ, ఐఎఎస్ అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీచే ఏప్రిల్ 24న ఆర్‌టీసీ ట్రేడ్ యూనియన్లతో చర్చల సందర్భంగా ఆర్‌టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి అంగీకరిస్తూ ఓ కమిటీని వేస్తామని, ఆ కమిటీలో గుర్తింపు సంఘ ప్రతినిధులు ఉంటారని, అందుకు అన్ని కార్మిక సంఘాలు అంగీకరించాయని లేఖలో పేర్కొన్నారు.

తరువాత మే 1న అన్ని కార్మిక సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో సమ్మె చర్చల సందర్భంగా అంగీకరించిన అంశాలను ప్రస్తావిస్తూ ముందు విలీనం కావాలా? లేక గుర్తింపు సంఘ ఎలక్షన్స్ కావాలా? అనే ఆప్షన్ కార్మిక సంఘాల ముందు మీరే స్వయంగా పెట్టారని గుర్తు చేశారు. అందుకు జేఏసీ తరఫున వెంటనే స్పందించి ఎలక్షన్ల కంటే ముందు విలీనమే కావాలని, ఆ ప్రక్రియను మే డే సందర్భంగా ప్రకటించాలని జేఏసీ పేరుతో వినతిపత్రం ఇచ్చినట్టు లేఖలో తెలిపారు.

ఆ తరువాత అన్ని సంఘాలు విడి విడిగా ఎలక్షన్ల కంటే ముందు విలీనమే కావాలని వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. కాని నేటివరకు విలీనం అంశంపై ఎలాంటి చర్యలు చేపట్టకపోగా, తమరి ఆదేశానికి విరుద్ధంగా విలీనం కంటే ముందుగా ఎలక్షన్లు జరపాలని అధికారులు ప్రయత్నాలు చేస్తున్నందున కార్మికులలో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. ఆర్‌టీసీలోని మెజార్టీ కార్మికవర్గమంతా తమరి సూచనల మేరకు విలీనమే ముందు చేయాలనే అభిప్రాయముతో, ఆశతో ఎదురు చూస్తున్నారని, రోజు రోజుకు విలీన అంశం కాలయాపన చేయటం వలన ప్రతినెల రిటైర్మెంట్ అవుతున్న వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కాబట్టి తమరు .. అన్ని కార్మిక సంఘాల డిమాండ్ మేరకు విలీనమే ముందు కావాలని, తరువాత ఎలక్షన్లు నిర్వహించాలని కోరుతున్నామని సీఎంకి రాసిన లేఖలో ఆర్‌టీసీ జేఏసీ పేర్కొంది.

# తెలంగాణ, ఆంధ్ర మధ్య మళ్లీ తెరపైకి అంతర్రాష్ట్ర బదలీలు

### రాష్ట్రానికి 891 మంది ఉద్యోగులు

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల అంతర్‌రాష్ట్ర బదిలీల ప్రక్రియ మళ్లీ తెరపైకి వచ్చింది. రెండు రాష్ట్రాల విభజన తర్వాత విభజన చట్టం ప్రకారం శాశ్వత ప్రాతిపదికన ఏపీలో పని చేస్తున్న 891 మంది ఉద్యోగులు తెలంగాణకు శాశ్వత ప్రాతిపదికన వెళ్లేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏపీలో పని చేస్తున్న 891 మంది ఉద్యోగుల జాబితాను ఏపీ ప్రభుత్వం తాజాగా తెలంగాణకు పంపింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఏపీ సీఎస్ లేఖ రాశారు. తదుపరి చర్యలు తీసుకునేందుకు ఈ జాబితాను త్వరగా పరిశీలించి, అభిప్రాయాన్ని, అంగీకారం తెలియజేయాలని అందులో తెలంగాణ ప్రభుత్వానికి ఏపీ విజ్ఞప్తి చేసింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేస్తూ గ్రీన్‌సిగ్నల్ ఇస్తే ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ఉద్యోగుల శాశ్వత బదిలీల ప్రక్రియ సుఖాంతం అవుతుంది. గతంలో ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లడానికి మొత్తం 1943 మంది ఆప్షన్‌ను ఎంచుకున్నారు. ఇందులో ప్రస్తుతం 891మంది ఉద్యోగులు ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. కాగా 2014, జూన్ 2న తెలంగాణ రాష్ట్ర విభజన సమయంలో ఏపీ, తెలంగాణకు ఉద్యోగుల్ని విభజించిన సంగతి తెలిసిందే. ఈ కేటాయింపుల్లో తెలంగాణ జిల్లాలకు చెందినవారు కొందరు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లారు. దీంతో 2014 నుంచి వారు అక్కడే కొనసాగాల్సిన పరిస్థితి వచ్చింది.

పండుగలు, కుటుంబ అకేషన్స్, సెలవులు వంటి సందర్భాల్లో ఇంటికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని, తమను సొంత రాష్ట్రంలో పని చేసే అవకాశం కల్పించాలని అప్పటి నుంచి ఈ ఉద్యోగులంతా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇందులో కొంతమంది ఉద్యోగులు ప్రతి వారం శుక్రవారం సాయంత్రం ఏపీ నుంచి తెలంగాణకు వచ్చి మళ్లీ సోమవారం ఉదయం ఏపీకి చేరుకుంటున్నారు. గత 12 ఏళ్లుగా ఈ సమస్య ఇలాగే కొనసాగుతోంది. ఈ క్రమంలో తాజాగా ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ఏపీ సర్కార్ కీలక ముందడుగు వేసింది. దీనితోపాటు ఏపీ సర్కార్ మరో కీలక ప్రకటన కూడా చేసింది. రాష్ట్రస్థాయి కార్యాలయాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు వారంలో 5 రోజుల పనిదినాలను మరో ఏడాది పాటూ పొడిగిస్తున్నట్లు తన ప్రకటనలో వెల్లడించింది. ఉద్యోగుల శాశ్వత బదిలీకి తెలంగాణ సర్కార్ కూడా గ్రీన్‌సిగ్నల్ వస్తే ఈ సమస్య పరిష్కారమవుతుంది.

# టెట్-2026 పరీక్షలకు 74 శాతం హాజరు

### 30న ప్రాథమిక కీ విడుదల

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)-2026 పరీక్షలకు 74.81 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా టెట్-2026 పరీక్షలు ఈ నెల 16 ప్రారంభం కాగా సోమవారంతో ముగిశాయని టెట్ కన్వీనర్ జి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. పరీక్షలకు 1,53,752 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 1,15,028 మంది హాజరయ్యారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 74.81 శాతం మంది హాజరయ్యారు. పరీక్షలకు సంబందించిన ప్రాథమిక కీని ఈ నెల 30న విడుదల చేయనున్నట్టు తెలిపారు. అభ్యర్థులు తమ అభ్యంతరాలను జులై 2 వరకు తెలియజేయాలని సూచించారు. ఈ నెల 16 నుంచి ప్రారంభమైన పరీక్షలు ఐదు రోజులపాటు రెండు సెషన్‌లలో కొనసాగాయి. పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 1,53,752 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో పేపర్-1కి 50,113 మంది దరఖాస్తు చేయగా వారిలో 36,129 మంది(72.10శాతం) హాజరయ్యారు. పేపర్-2లో గణితం అండ్ సైన్స్‌కి 58,675 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 44,128 మంది(75.21శాతం) హాజరయ్యారు. పేపర్-2 సోషల్ స్టడీస్‌కి 44,964 మంది దరఖాస్తు చేసుకుంటే అందులో 34,771 మంది(77.33శాతం) పరీక్షలకు హాజరయ్యారు.పరీక్షల నిర్వహణ కోసం 16 జిల్లాల్లో 61 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు. టెట్-2026 ఫలితాలను జూలై నెలలో విడుదల చేయనున్నారు.

# బోధన్‌లో విద్యుదాఘాతంతో దంపతుల మృతి

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలో కరెంట్ షాక్ తగిలి దంపతులు మరణించిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలావున్నాయి. బోధన్ మండలంలోని ఊట్‌పల్లిలో నివసించే సంజీవ్(45), జ్యోతి(43) వ్యవసాయం, పశుపోషణ చేస్తుంటారు. వీరి ఇంటికి ఆనుకుని పశువుల కొట్టం వుంది. పశువుల కొట్టానికి కరెంటు కోసం వేరుగా సంజీవ్ కనెక్షన్ తీసుకున్నాడు. అయితే దీనికి ఆనుకుని ఇంట్లో బట్టలు ఆరేసేందుకు ఇనుపతీగ కట్టాడు. ఆదివారం రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో ఈ తీగపై ఆరేసిన బట్టలను సంజీవ్ భార్య తీస్తుండగా ఒక్కసారిగా కరెంట్ షాక్ తగలడంతో కేకలు వేసింది. దీంతో సంజీవ్ వచ్చి భార్యను రక్షించబోయి అతను కూడా విద్యుత్ ఘాతానికి లోనయ్యాడు. ఈ ఘటనలో దంపతులిద్దరు తీవ్రంగా గాయపడడంతో కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఇద్దరు మరణించారు. దీనిపై కేసు నమోదు చేసిన బోధన్ రూరల్ పోలీసులు దంపతుల మృతదేహాలకు బోధన్ ఆస్పత్రికి తరలించి సోమవారం పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# సిఎం రేవంత్, మైనంపల్లిని విమర్శిస్తే కుత్బుల్లాపూర్‌లో తిరగనివ్వం

### మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్


**హైదారబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** భూకబ్జాలకు కేరాఫ్ అడ్రస్ కుత్బుల్లా పూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద సిఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎం. హనుమంతరావుపై ఇంకోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే కుత్బుల్లా పూర్‌లో తిరగనీయమనీ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ హెచ్చరిం చారు. గాంధీ భవన్‌లో సోమవారం మాట్లాడుతూ బిఆర్ఎస్ లో గెలిచి ఆ పార్టీని బేరం పెట్టిండనీ ఎద్దేవా చేశారు.

ఎమ్మెల్యే వివేకానంద ఎన్ని పార్టీలు మారిందో ఆయన గుర్తుచేసుకోవాలనీ, కమ్యూనిస్టు పార్టీ తప్ప అన్ని పార్టీలు మారిం డనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపిలో చేరి ఆ పార్టీని నిండా ముం చిండనీ దుయ్యబట్టారు. వివేకానంద దొంగచాటున గెలిచిన దొంగ ఎమ్మెల్యే మూడు సార్లు గెలిచి కుత్బుల్లాపూర్‌కు చేసింది ఏమి లేదనీ అభిప్రాయపడ్డారు. కాం గ్రెస్ హయాంలో వేలాది ఇళ్లు ఇచ్చిందనీ గొప్పలు చెప్పుకొన్నారు. వివేకా నంద కుత్బుల్లాపూర్‌లో చేసిన అభివృద్ధి ఏమిలేదని ఆవేదన చెందారు. కుత్బుల్లాపూర్‌లో ప్రభుత్వ భూములన్నీ కెటిఆర్, హరీశ్‌రావులకు అమ్మించిన ఘనత వివే కానంద దని అన్నారు. మైనంపల్లి హనుమంతరావు గురించి మాట్లాడే స్థాయి వివేకానందకు లేదనీ అభిప్రాయపడ్డారు.

# నేడు పాఠశాలల బంద్‌కు ఎబివిపి పిలుపు

**హైదరాబాద్,జూన్ 22, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల విద్య నిర్వీర్యం అవుతుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖ మంత్రిగా ఉండి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) విమర్శించింది. ప్రభుత్వ పాఠశాలల ఎత్తివేతకు కుట్ర చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఆర్థిక దోపిడీకి కొమ్ముకాస్తున్న ప్రభుత్వ తీరుకు నిరసనగా ఏబీవీపీ ఆధ్వర్యంలో నేడు(మంగళవారం) రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్‌ను చేపడుతున్నట్టు సంఘం రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద విద్యార్థులకు విద్యను దూరం చేయాలని కుట్ర చేస్తున్నాడని, అందుకే రేషనలైజేషన్ పేరుతో 23000ల పాఠశాలలను మూసేందుకు కంకణం కట్టుకున్నాడని ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలకు ఏజెంట్ లా వ్యవహరిస్తున్నాడని, విచ్చలవిడిగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరిచిందని ఎద్దేవా చేశారు. వెంటనే ప్రభుత్వం ఫీజుల దోపిడీని అరికట్టి, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో 'బ్రేక్ ఫాస్ట్ స్కీమ్'ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేడు రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్‌లో భాగంగా హైదరాబాద్‌లోనూ పాఠశాలల బంద్‌ను చేపడుతున్నట్టు హైదరాబాద్ సిటీ సెక్రటరీ పృథ్వితేజ తెలిపారు.



ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

# 18 లక్షల కేంద్ర పోస్టులు, 30 లక్షల రాష్ట్ర పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

### ప్రత్యేక సమీక్ష నిర్వహించాలి : ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ శాఖల్లో సుమారు 18 లక్షల పోస్టులు, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 30 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని తక్షణమే భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. అలాగే వివిధ రంగాల్లో ఖాళీగా ఉన్న మరో 2 లక్షల ఉద్యోగాలను కూడా భర్తీ చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరారు. సోమవారం విద్యానగర్ బీసీభవన్ వద్ద ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు తీవ్రరూపం దాల్చుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీ పోస్టుల భర్తీపై ప్రత్యేక దృష్టి సారించి నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా ఐటీ, తయారీ, సేవా రంగాల్లో కొత్త ఉపాధిఅవకాశాలు సృష్టించేందుకు ప్రత్యేక విధానాలు రూపొందించాలని సూచించారు. రాష్ట్ర బీసీ యువజన సంఘం అధ్యక్షులు జిల్లపల్లి అంజి, అనంతయ్య, రాజేందర్ తదితరులు ఈ డిమాండ్లకు మద్దతు తెలిపారు.

## అమెరికాలో పాలమూరు బిడ్డ హఠాన్మరణం

### మృతుడు నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం గంగారం వాసి

### మృతదేహాన్ని సొంతూరుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 22, ప్రభాతవార్త:** అమెరికాలోని ఫ్లోరిడాలో పాలమూరు బిడ్డ హఠాన్మరణం చెందిన ఘటన సోమవారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం



గంగారం గ్రామానికి చెందిన శారద, వెంకట్ రెడ్డి దంపతులకు ముగ్గురు సంతానం. ఇద్దరు అమ్మాయిలు కాగా, సాయిరెడ్డి కుమారుడు ఉన్నారు. విద్యాభ్యాసం పూర్తి చేసిన సాయి రెడ్డి ఉన్నత చదువుల కోసం అమెరికా దేశానికి నాలుగేళ్ల కిందట వెళ్ళాడు. ఈ క్రమంలో ఈనెల 19వ తేదీన స్నేహితులతో ఎంతో సంతోషంగా గడిపిన అరుణ్ సాయిరెడ్డి ఆ తర్వాత ఉన్నట్టుండి తీవ్రమైన అనారోగ్యానికి గురయ్యారు. అకస్మాత్తుగా అనారోగ్యానికి గురి కావడంతో తోటి మిత్రులు గమనించి వెంటనే సమీప హాస్పిటల్లో అడ్మిట్ చేశారు. అయితే అప్పటికే ఆరోగ్య పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టు నేటి సాయంత్రానికి రా వస్తుందని కుటుంబ సభ్యులు వెల్లడించారు. మృతుని తల్లి శారద అంగన్వాడి ఉపాధ్యాయురాలు కాగా తండ్రి వెంకట్ రెడ్డి గ్రామంలోనే వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సాయి రెడ్డికి ఇద్దరూ అక్కలు ఉండడంతో వారి వివాహాలు చేశారు. ఉన్నత చదువులకని విదేశాలకు పంపిస్తే విగత జీవిగా తన బిడ్డ గ్రామానికి తిరిగి వస్తాడని అనుకోలేదని ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహం స్వగ్రామానికి చేరుకోవడానికి నాలుగైదు రోజులు పడుతుందని స్థానికులు చెబుతున్నారు.

## రుతుపవనాల్లో కదలిక

### నేడు రాష్ట్రమంతటా విస్తరణ


**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** తెలంగాణలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. గత 15 రోజులుగా అనుకూల పరిస్థితులు లేక భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్ వరకు విస్తరించి ఆగిపోయిన రుతు పవనాల్లో కదలిక మొదలైనట్లు పేర్కొంది. సోమవారం నైరుతి రుతు పవనాలు చురుగ్గా కదిలి నిజామాబాద్ వరకు విస్తరించాయని స్పష్టం చేసింది. ఈ నెల 23వ తేదీ నాటికి తెలంగాణ అంతటా పూర్తిగా విస్తరించే అవకాశం ఉందని వెల్లడించింది. కాగా నైరుతి రుతు పవనాల విస్తరణతో రాష్ట్రంలో రాబోయే ఐదారు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. తేలిపాటి నుంచి మోస్తారు వర్షాలతో పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపింది. ఇదే సమయంలో రానున్న రోజుల్లో కురిసే వర్షాలతో ఎండల తీవ్రత తగ్గనుందని పేర్కొంది. వర్షాల నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని ప్రజలు, రైతులను వాతావరణ శాఖ హెచ్చరించింది. రైతు పవనాల విస్తరణతో వర్షాలు కురవనుండటంతో వ్యవసాయ పనులు ఊపందుకునే అవకాశం ఉంది.

## రెడ్‌అలర్ట్ వేళల్లో అధికారులు అప్రమత్తతతో ఉండాలి

### ఎస్‌డిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్ నిబంధనలకు అనుగుణంగా నిధులు విడుదల

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** వర్షాకాలంలో సంభవించే వరదల వల్ల రహదారులు, వంతెనలు, కల్వర్టులు తదితర మౌళిక సదుపాయాలకు కలిగే నష్టాన్ని రహదారులు భవనాలశాఖ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ రూపొందించిన ప్రత్యేక ప్రమాణిక నిర్వహణ విధానం (ఎస్ఒపి) ఇఎన్‌సి నుంచి మొదలు కొని ఎఇ వరకు పాటించాలని రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పత్రికా ప్రకటనలో తెలిపారు. ఆర్ అండ్ బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం వాతావర్ణంకు అనుగుణంగా చర్యలు చేపట్టాలనీ సూచించారు. 204మీ.మీ వర్షం నమోదైన రెడ్ అలర్టు సమాయాల్లో 204 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం దాటగానే ఎఇలు, ఎఇఇలు,ఇఇ లు 24 గంటల పాటు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి సహాయక చర్యలను సమన్వయం చేయాలని మంత్రి నిర్దేశించారు. రెడ్ అలర్టు సమయాల్లో వెంటనే సూపరింటెండింగ్ ఇంజినీర్ కు,ఆపై సి.ఇలకు సమాచారం అందించాలని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ ఆర్ అండ్ బి ప్రధాన కార్యాలయంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సెంటర్ కు ఈ వర్షాకాలంలో రోజువారీ పరిస్థితుల నివేదికలు తప్పనిసరిగా సమర్పించాలని, నష్టం జరగకపోయినా నిల్ రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు. ఫీల్డ్ సిబ్బందికి ప్రత్యేక అనుమతి లేకుండా సెలవులు మంజూరు చేయరాదని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రహదారి రవాణా వ్యవస్థను కొనసాగించడం, వరదల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించడం, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం ఇ ఎస్ ఆ పి ప్రధాన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. 24 గంటల్లో 64.5 మిల్లీమీటర్ల కంటే తక్కువ వర్షపాతం నమోదైతే గ్రీన్ అలర్ట్ కింద సాధారణ పర్యవేక్షణ కొనసాగిస్తూ యంత్రాలు, సామగ్రి సిద్ధంగా ఉన్నాయో లేదో నిర్ధారించాలని సూచించారు. 64.5 నుంచి 115 మిల్లీమీటర్ల మధ్య వర్షపాతం నమోదయ్యే యెల్లో అలర్ట్ పరిస్థితుల్లో సున్నితమైన ప్రాంతాలను సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్లు లు ప్రత్యక్షంగా సందర్శించి, కాంట్రాక్టర్లు అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండేలా చూడాలని ఆదేశించారు.




అశోక్‌నగర్ చౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న నిరుద్యోగులు

## అశోక్‌నగర్‌లో నిరుద్యోగుల మెరుపు ధర్నా

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్ 22, ప్రభాతవార్త :** మెగా డిఎస్సీ ద్వారా 15 వేల ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు సోమవారం అశోక్‌నగర్ చౌరస్తాలో మెరుపు ధర్నాకు దిగారు. "త్యాగాలు మావి... భోగాలు మీవా" అంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు చౌరస్తాకు చేరుకుని రోడ్డుపై బైఠాయించడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనకారులు అశోక్‌నగర్ చౌరస్తాను దిగ్బంధం చేయడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నిరుద్యోగ నాయకులు ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జీవో నంబర్ 46, 29లను రద్దు చేయాలని కోరారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

# బ్రిటన్ ప్రధాని కీర్‌స్టార్మర్ రాజీనామా

### లేబర్ పార్టీ నాయకత్వాన్నీ వీడుతున్నట్లు ప్రకటన
### తదుపరి ప్రధాని రేసులో ఆండీ బర్న్‌హామ్, వెస్‌స్ట్రీటింగ్
### జూలై 9 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

**లండన్, జూన్ 22:** పెరుగుతున్న రాజకీయ ఒత్తిడి నేపథ్యంలో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సోమవారం పదవి నుంచి తప్పుకోనున్నట్లు ప్రకటించారు. అధికార లేబర్ పార్టీ నాయకత్వానికి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. డౌనింగ్ స్ట్రీట్‌లోని అధికార నివాసం నుంచి భార్యతో కలిసి బయటకు వచ్చిన స్టార్మర్‌కు మద్దతుదారులు చప్పట్లతో వీడ్కోలు పలికారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, దేశ ప్రయోజనాలనే ఎప్పుడూ ముందుంచానని వివరించారు. 'తాను ప్రేమించే దేశాన్ని ముందు ఉంచడానికే ప్రతి నిర్ణయం తీసుకున్నా'అని పేర్కొన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం సాధించిన విషయాన్ని స్టార్మర్ గుర్తుచేశారు. అయితే గత కొన్ని నెలలుగా స్టార్మర్ నాయకత్వంపై విమర్శలు పెరుగుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేకపోయారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. పలు విధానాలపై వెనక్కి తగ్గడం, ప్రజాదరణ తగ్గడం కూడా ఆయనపై ఒత్తిడిని పెంచింది. లేబర్ పార్టీకి చెందిన 100 మందికిపైగా ఎంపీలు స్టార్మర్ రాజీనామా చేయాలని లేదా పదవి వీడే గడువును ప్రకటించాలని బహిరంగంగా డిమాండ్ చేసినట్లు సమాచారం.

స్టార్మర్ వైదొలగడంతో గత పదేళ్లలో బ్రిటన్‌లో ఏడుగురు ప్రధానులు మారినట్లైంది. యుకెలో 14 ఏళ్ల కన్జర్వేటివ్ ప్రభుత్వం తర్వాత, 2024లో లేబర్ పార్టీని భారీ విజయానికి నడిపించిన బ్రిటిష్ ప్రధానమంత్రికి ఇది ఒక తీవ్రమైన ఎదురుదెబ్బగా రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

**తదుపరి ప్రధాని ఎవరంటే?:**

లేబర్ పార్టీ నాయకుడిగా తద్వారా బ్రిటన్ ప్రధానిగా స్టార్మర్ స్థానాన్ని భర్తీ చేయడానికి నామినేషన్ల ప్రక్రియ జులై 9న ప్రారంభం కానుంది. 'ఈ పోటీ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రధానమంత్రిగా కొనసాగుతాను' అని స్టార్మర్ చెప్పారు. 'అలాగే, అధికార బదిలీ సజావుగా జరిగేలా చూసేందుకు నా వంతు కృషి చేస్తాను' అని పేర్కొన్నారు. తదుపరి ప్రధాని రేసులో మాంచెస్టర్ మాజీ మేయర్ ఆండీ బర్న్‌హామ్ ముందంజలో ఉన్నారు. ఆదివారం జరిగిన ఉప ఎన్నికలో విజయం సాధించిన ఆయన బ్రిటన్ పార్లమెంటుకు తిరిగి వస్తున్నారు. గతంలో ఆయన రెండుసార్లు లేబర్ పార్టీ నాయకత్వానికి పోటీ చేశారు. స్టార్మర్ ప్రకటన వెలువడిన రెండు గంటల లోపే, పార్టీ నాయకుడిగా, ప్రధానిగా ఆయన స్థానాన్ని



భర్తీ చేయడానికి తాను పోటీ చేస్తానని బర్న్‌హామ్ ధ్రువీకరించారు.

# ధాన్యం సేకరణలో తెలంగాణ నం. వన్

### దేశ కొనుగోళ్లలో 61 శాతం రాష్ట్రానిదే

### ఆరు రెట్లు పెరిగి 1.51 కోట్ల టన్నులకు చేరిక

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త :** ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే రికార్డు స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. గత 12 ఏండ్లలో పోలిస్తే ప్రస్తుతం ఆరు రెట్లు పెరిగి, నంబర్వన్‌గా నిలిచింది. 2025-26 యాసంగి సీజన్లో రాష్ట్రంలో 65.91 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. అనుకూల వాతావరణం, సమృద్ధిగా నీటి లభ్యత, అధిక దిగుబడులు కారణంగా ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. దీంతో కొనుగోళ్ల పరంగా కూడా కొత్త రికార్డులు నమోదయ్యాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న యాసంగి ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ వాటా 61 శాతానికి చేరడం రాష్ట్ర వ్యవసాయ ప్రగతికి నిదర్శనంగా నిలుస్తోంది. 2014-15లో ఖరీఫ్, రబీ సీజన్ల (వానాకాలం, యాసంగి) లో కలిపి కేవలం 24.28 లక్షల టన్నుల ధాన్యం సేకరణ జరగగా, 2025-26 నాటికి అవే సీజన్లకు గాను 1.51 కోట్ల టన్నులకు చేరడం విశేషం. తెలంగాణ ఏర్పాటైన తొలి సంవత్సరాల్లో ధాన్యం సేకరణ 25 లక్షల టన్నుల లోపే ఉండేది. తదుపరి సాగు విస్తీర్ణం పెరగడం, నీటి లభ్యత మెరుగుపడటంతో కొనుగోళ్లు పెరిగాయి. ఇందులో భాగంగా 2018-19లో 77.41 లక్షల టన్నులు, 2019-20లో 111.27 లక్షల టన్నులు, 2020-21లో 141.01 లక్షల టన్నుల వరకు సేకరణ చేరింది. ఈ లెక్కనే 12 ఏండ్లలో ధాన్యం కొనుగోళ్లు దాదాపు ఆరు రెట్లు పెరిగాయి. వ్యవసాయ శాఖ అధికవర్గాలు వెల్లడించిన సమాచారం మేరకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో వానాకాలం, యాసంగి రెండు సీజన్లు కలిపి మొత్తం 2.95 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తి జరగగా, అందులో సగానికి పైగా ప్రభుత్వమే కొనుగోలు చేసింది. ఈ కొనుగోళ్ల ద్వారా 26 లక్షల మంది వద్ద 75.85 లక్షల టన్నులకు పైగా సేకరించి రూ.36 వేల కోట్లకు పైగా చెల్లింపులు చేసింది. అలాగే 2025-26 వానాకాలంలో 8,448 కేంద్రాలు, యాసంగిలో 8,575 కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు సమీపంలోనే ధాన్యం విక్రయించే అవకాశం కల్పించారు. గత రెండేండ్లలోనే 3 వేలకుపైగా కొత్త కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కొనుగోలు వ్యవస్థ మరింత బలోపేతమైంది. దేశంలో వరి ఉత్పత్తిలో రెండో స్థానంలో ఉన్న ఉత్తరప్రదేశ్లో దాదాపు 4,850 కొనుగోలు కేంద్రాలే ఉండగా, రాష్ట్రంలో రెండింతలు అధికంగా కేంద్రాలు నిర్వహించడం విశేషం.

## నల్గొండలో తీవ్ర విషాదం

### ఒకే ఇంట్లో కుళ్లిన స్థితిలో నాలుగు మృతదేహాలు

**నల్గొండటౌన్, జూన్ 22, ప్రభాతవార్త:** నల్గొండ జిల్లా కేంద్రంలో తీవ్ర విషాదం నెలకొన్నది.. ఒకే ఇంట్లో నాలుగు మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ సంఘటతో నల్లగొండ నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. నల్గొండ పట్టణంలోని తెలంగాణ కాలనీలో గత కొన్ని రోజులుగా ఒక ఇంటికి తాళం వేసి ఉంది. అయితే సోమవారం ఉదయం నుంచి ఆ ఇంటి పరిసరాల్లో దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కాగా పోలీసులు ఆ ఇంటికి తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్ళగా హృదయ విధారక దృశ్యం కనిపించింది. ఈ సంఘటనతో పోలీసులతో సహా ఒక్కసారిగా చలించిపోయారు. కుళ్ళిపోయిన స్థితిలో నాలుగు మృత దేహాలు కనిపించాయి. వారిలో ప్రకాశం బజార్లో బ్యాగుల వ్యాపారం చేస్తున్న మహమ్మద్ సుల్తాన్, అతని భార్య ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న హసీనా సుల్తానాగా గుర్తించారు. వారితో పాటు మరో ఇద్దరు మృతదేహాలు ఉన్నాయి. వీరు వీరి పిల్లల లేక బంధువుల అనేది తెలియాల్సి ఉంది. కుళ్ళిన స్థితిలో ఉన్న వీరి మృతదేహాలు సుమారు నాలుగు రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవార్, అదనపు ఎస్పీ రమేష్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. వీరి మృతి మిస్టరీగా మారింది. ఇది ఆత్మహత్య? హత్య? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

# రూ.1,500 కోట్లతో 20 బయో ప్లాంట్లు

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త :** వ్యర్థాలను కాల్చడం వల్ల నేల ఆరోగ్యం, పంటల నాణ్యత నశించడమే కాక, గాలి కాలుష్యం కూడా పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణను లక్ష్యంగా పెట్టుకుని తెలంగాణ రాష్ట్రం పంట వ్యర్థాల నుంచి బయోగ్యాస్ తయారీ దిశగా శక్తివంతమైన అడుగు వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా రూ.1,500 కోట్ల వ్యయంతో 20 బయోగ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ఒప్పందాలు కుదిరాయి. ప్రతి ప్లాంట్‌కు రోజుకు 15 టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంటుందని ఒప్పందాల్లో ప్రతిపాదించారు. ఇలా మొత్తం రోజువారీ ఉత్పత్తి లక్ష్యం 225 టన్నులుగా ఉంది. ఇక ఈ ప్లాంట్లకు ఏటా 7.5 లక్షల మెట్రిక్ టన్నుల వరి గడ్డి వినియోగించనున్నారు. తద్వారా ఉత్పత్తి చేయబోయే బయోగ్యాస్ 82,125 టన్నులుగా ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాకుండా 3 లక్షల టన్నుల సేంద్రియ ఎరువు ఉత్పత్తి అవుతుంది. ఈ ప్రాజెక్టుల ద్వారా 57.84 లక్షల ఎల్‌పిజి సిలిండర్లకు సమానమైన బయో గ్యాస్ ఉత్పత్తి జరుగుతుందని అంచనా. ఈ ప్రాజెక్టులను మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి, వనపర్తి, మహబూబ్‌నగర్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు

## మహిళలకు త్వరలోనే నెలకు రూ.2500

### వారి ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి సీతక్క



సిర్సవాడలో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 22, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ఇచ్చిన హామీల మేరకు మహిళలకు నెలకు రూ.2500 అతి త్వరలోనే అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, మహిళలు ఆత్మస్థైర్యంతో హక్కుగా జీవించాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి సంస్థ శాఖల మంత్రి సీతక్క తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని మహిళ భరోసా కేంద్రాన్ని శంకుస్థాపన చేసి, ఇందిరా మహిళా శక్తి భవనాన్ని మంత్రి పరిశీలించి, మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబాలు, గ్రామాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని మంత్రి సీతక్క తెలిపారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులను ఉద్దేశించి మంత్రి సీతక్క మాట్లాడుతూ నాగర్ కర్నూల్ ఇందిరా శక్తి భవనం ఇంద్ర భవనంలో ఉందని త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభం చేస్తారని తెలిపారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని పేర్కొన్న మంత్రి, అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేశామని రానున్న రోజుల్లో మహిళలకు ఇచ్చిన హామీ ప్రకారం 2500 రూపాయలను కూడా త్వరలోనే చెల్లించే విధంగా ప్రభుత్వం, చర్యలు తీసుకుంటారని, ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలు ప్రయోజనం పొందుతున్నారని, వారి ప్రయాణ వ్యయం గణనీయంగా తగ్గిందని చెప్పారు. మహిళలు కేవలం రుణాలు తీసుకోవడానికే పరిమితం కాకుండా వాటిని సద్వినియోగం చేసుకొని వ్యాపారవేత్తలుగా ఎదగాలని, ప్రభుత్వం అందిస్తున్న వడ్డీలేని రుణాలను వినియోగించి టిఫిన్ సెంటర్లు, కిరాణా దుకాణాలు, బ్యూటీ పార్లర్లు, కుట్టు కేంద్రాలు, మొబైల్ వ్యాపార వాహనాలు, చిన్న పరిశ్రమలు వంటి స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని మంత్రి సూచించారు.

# లెబనాన్‌లో హెజ్‌బొల్లా భూగర్భ డ్రోన్ స్థావరం

### గుర్తించిన ఇజ్రాయెల్



లెబనాన్‌లో హెజ్‌బొల్లా భూగర్భ డ్రోన్ స్థావరంలో ఇజ్రాయిల్ వెలికితీసిన డ్రోన్లు.

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** లెబనాన్ దేశంలో స్థావరాలు కలిగి తమపై వరుసగా దాడులు చేస్తున్న పాలస్తీనా ఉగ్రవాద సంస్థ హెజ్‌బొల్లాకు ఇజ్రాయిల్ గట్టి షాక్ ఇచ్చింది. ఇజ్రాయిల్..లెబనాన్ సరిహద్దుల్లో గల ఓ కొండ దిగువన భూగర్భంలో అర కిలోమీటర్ లోతున హెజ్‌బొల్లా భూగర్భ డ్రోన్ స్థావరాన్ని ఇజ్రాయిల్ రట్టు చేసింది. ఈ కేంద్రం నుంచే హెజ్‌బొల్లా తమ దేశంపై వరుసగా డ్రోన్లను ప్రయోగిస్తుం దని ఇజ్రాయిల్ తేల్చింది. ఈ స్థావరాన్ని ఇజ్రాయిల్ సైన్యం తాజాగా జప్తు చేసింది. లెబనాన్ దేశం ఇజ్రాయిల్‌తో సరిహద్దులు పంచుకుంటున్న సంగతి తెలిసిందే. ఇరాన్‌తో ఇజ్రాయిల్‌కు సరిహద్దులు లేకున్నా ఆ దేశంతో ఇజ్రా యిల్‌కు దశాబ్దాలుగా వైరం వుంది. ఇందుకు అనేక కారణాలు వున్నా ప్రధానమైనది పాలస్తీనా దేశంలో ఇజ్రాయిల్ దౌర్జన్యాలు ఎక్కువవడం. ఈ నేపథ్యంలో ఇజ్రాయిల్‌పై దాడులకు పాలస్తీనా బలం సరిపోక పోవడంతో ఇరాన్ సహా పలు గల్ఫ్ దేశాల సహకారంతో కొన్ని ఉగ్రవాద సం స్థలు పుట్టుకొచ్చాయి. ఇందులో హమాస్, హెజ్‌బొల్లా, హౌతి ముఖ్యమైనవి. ఈ మూడు సంస్థల్లో హెజ్‌బొల్లా లెబనాన్ కేంద్రంగా పనిచేస్తుం టుంది. అయితే హెజ్‌బొల్లా లెబనాన్ దేశం నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నా ఆ దేశంతో ఎలాంటి సంబంధాలు కలిగి వుండదు. ఈ సంస్థకు ఇరాన్ నుంచి నిధులు అందుతుంటాయి.

హౌతి ఒమన్ దేశం నుంచి హమాస్ పాలస్తీనా నుంచి పనిచేస్తున్నాయి. అయితే హౌతి, హమాస్‌లను ఇజ్రాయిల్ దాదాపు నిర్మూలించగా హెజ్‌బొల్లా మాత్రం ఇప్పటికీ బలంగానే వుండడం గమనార్హం. ఇందుకు ముఖ్య కారణం లెబనాన్‌లోని భౌ గోళిక పరిస్థితులు. ఎత్తయిన కొండలు, గుట్టలను స్థావరాలుగా చేసుకున్న హెజ్‌బొల్లా ఇజ్రాయిల్‌పై వరుసగా దాడులు చేస్తోంది. ఈ దాడులను ఇజ్రాయిల్ తిప్పికొడుతున్నా దాడుల పరంపర ఆగడం లేదు. ఈ నేపథ్యంలోనే ఇరాన్, అమెరికా యుద్ధం ముగింపుకు వచ్చినా లెబనాన్‌లో హెజ్‌బొల్లా స్థావరాలపై ఇజ్రాయిల్ దాడులను ఆపడం లేదు. ఈ ఒక్క కారణంగానే ఇరాన్ అమెరికాతో ఒప్పందానికి రావడం లేదు. లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులను కచ్చితంగా ఆపాల్సిందేనని ఇరాన్ పట్టుబడుతుండగా హెజ్‌బొల్లా స్థావరాలను పూర్తిగా నాశనం చేసేవరకు దాడులు ఆపే ప్రసక్తే లేదని, ఈ విషయంలో అమెరికా మాటలు కూడా వినేది లేదని, తమ దేశ పౌరుల భద్రతే తమకు ముఖ్యమని ఇజ్రాయిల్ తెగేసి చెబు తోంది. సరిగ్గా ఇలాంటి తరుణంలో లెబనాన్‌లోని ఓ కొండ దిగువన భూగర్భంలో హెజ్ బొల్లాకు చెందిన డ్రోన్ స్థావరాన్ని ఇజ్రాయిల్ గుర్తిం చింది. ఇరాన్ మద్దతుతోనే హెజ్‌బొల్లా దీనిని నిర్మించిందని ఇజ్రాయిల్ చెబుతోంది. లెబనాన్‌లోని మజ్దల్ గ్రామంలో ఈ స్థావరాన్ని హెజ్‌బొల్లా ఏర్పాటు చేసింది. ఈ కేంద్రం ఇజ్రాయిల్ సరిహద్దుకు కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలోనే వుండడం గమనార్హం. ఈ భూగర్భ డ్రోన్ స్థావరం చుట్టూ భారీ ఉక్కు కవచాన్ని నిర్మించారు. బాంబులతో దాడులు చేసినా నష్టం వాటిల్లకుండా దీనిని నిర్మించారు. ఈ కేంద్రంలో 50 డ్రోన్లు, 30 కిలోల పేలుడు పదార్థాలు వుండగా వాటిని ఇజ్రాయిల్ సైన్యం జప్తు చేసింది.

## నీట్ రీఎగ్జామ్‌పై తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తప్పవు: ఎన్‌టిఎ స్పష్టీకరణ

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త:** ఆదివారం దేశవ్యాప్తంగా జరిగిన నీట్ యూజీ రీ ఎగ్జామినేషన్ ప్రశ్నాపత్రం లీకైందంటూ ప్రచారం చేసిన వారిపై చర్యలు తప్పవని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) ప్రకటించింది. నీట్ రీ టెస్ట్ ప్రశ్నాపత్రం లీక్ అయ్యిందని సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న వీడియో నకిలీదని ఎన్‌టీఏ వెల్లడించింది. నీట్ యూజీ పరీక్షను కట్టుదిట్టమైన భద్రత, నిఘా మధ్య విజయవంతంగా నిర్వహించామని పేర్కొంది. ఈ మేరకు ఎన్‌టిఏ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ వీడియో ఫేక్ అని కేంద్ర ప్రభుత్వం కూడా చెప్పింది. నీట్ యూజీ పేపర్ లీక్ ఆరోపణలు నిరాధారమైనవని, అసత్యమైనవని ప్రభుత్వ అధికారిక నిజ నిర్ధరణ విభాగమైన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) స్పష్టం చేసింది. నీట్ యూజీ 2026 రీ ఎగ్జామ్‌కి సంబంధించి సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న ఒక కల్పిత వీడియో తమ దృష్టికి వచ్చిందని ఎన్‌టీఏ ప్రకటించింది. ఆ వీడియో నకిలీదని, అందులోని వాదనలు అవాస్తవమని స్పష్టం చేసింది. విద్యార్థులను తప్పుదోవ పట్టించడానికి, వారిలో ఆందోళన కలిగించడానికి ఇటువంటి తప్పుడు సమాచారాన్ని సృష్టించడం, ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేయడాన్ని తీవ్రమైన నేరంగా అభివర్ణించింది. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంట ర్(ఐ4సీ), చట్ట అమలు సంస్థల సహకారంతో ఈ కంటెంట్‌ను సృష్టించిన వారిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. పరీక్షకు సంబంధించిన సమాచారం కోసం ఎన్‌టీఏ అధికారిక వెబ్‌సైట్, ధ్రువీకరించిన సోషల్ మీడియా ఖాతాలను అనుసరించాలని సూచించింది. ఇటువంటి తప్పుడు సమాచారాన్ని మరింతగా ప్రచారం చేయవద్దని విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలకు విజ్ఞప్తి చేసింది. నీట్ రీ ఎగ్జామ్‌కు 20 లక్షల మందికి పైగా అభ్యర్థులు హాజరైనట్లు వెల్లడించింది. నీట్ రీ ఎగ్జామినేషన్ నిర్వహణపై ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ స్పందించారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ అయినట్లు ఇప్పటివరకు తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు. ఈ ఎగ్జామ్ పారదర్శకతను, విశ్వసనీయతను కాపాడేందుకు ఎన్‌టీఏ తీవ్రంగా కృషి చేస్తోందన్నారు. త్వరలోనే నీట్ ఎగ్జామ్ మూల్యాంకన ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఫలితాలను వేగంగా విడుదల చేస్తామని స్పష్టం చేశారు. కొన్ని చోట్ల తప్పుడు, నకిలీ అడ్మిట్ కార్డులతో ఎగ్జామ్ రాసేందుకు కొందరు వచ్చారని అలాగే ఇతరుల స్థానంలో పరీక్ష రాసే ప్రయత్నాలను కూడా గుర్తించామన్నారు.

# శవాలకూ దక్కని కనికరం!

### మంటకలిసాన మానవత్వం
### తాళం వేసింది గేటుకే కాదు.. మనసుకూ
### మృతదేహాల ముందు మృతి చెందిన మనుష్యత్వం

**భద్రాచలం, ప్రభాతవార్త:** ఆ ఇంట విషాద ఛాయలు అలుముకున్నాయి. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. కంటి ముందే తిరిగిన ముగ్గురు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. గుండె పగిలి ఏడుస్తున్న ఆ కుటుంబానికి కొండంత అండగా నిలవాల్సిన సమాజం.. మూఢనమ్మకాల ముసుగులో ముఖం చాటేసింది. కనీసం కడసారి చూపుకైనా ఆ కన్నబిడ్డల మృతదేహాలను ఇంట్లోకి రానివ్వకుండా గేటుకు తాళం వేసి రాక్షసానందాన్ని పొందింది. భద్రాచలం నడిబొడ్డున వెంకటేశ్వర కాలనీలో సోమవారం జరిగిన ఈ అమానవీయ ఘటన పౌరసమాజాన్ని నివ్వెరపోయేలా చేసింది. విధి ఆడిన వింత నాటకం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పోలవరం జిల్లా ఎటపాక మండలం తోటపల్లికి చెందిన దూడల శ్రీనివాస్ విద్యుత్ శాఖలో లైన్ ఇన్స్పెక్టర్గా పనిచేస్తూ భద్రాచలం వెంకటేశ్వర కాలనీలో అద్దెకు ఉంటున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఆయన గుండెపోటుతో కన్నుమూశారు. ఆ పెద్ద దిక్కును కోల్పోయిన బాధ నుంచి ఆ కుటుంబం ఇంకా తేరుకోనేలేదు. నాలుగు నెలలు కూడా గడవక ముందే ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి వద్ద జరిగిన కారు ప్రమాదంలో శ్రీనివాస్ కుమారుడు సాయి ప్రకాష్ (25), కోడలు సంధ్య (22), పసివాడైన మనవడు మోక్షి త్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ఒకే ఒక రోడ్డు ప్రమాదం ఆ వంశ దీపాన్ని పూర్తిగా ఆర్పేసింది.

**తాళం వేసిన కఠినత్వం..**

పోస్టుమార్టం ముగిసిన తర్వాత ఆ ముగ్గురి మృతదేహాలను తాము నివసిస్తున్న అద్దె ఇంటికి తీసుకువచ్చారు. కానీ అక్కడ వారికి ఎదురైన దృశ్యం ఆ కాలనీవాసుల గుండెలను పిండేసింది. వరుస మరణాలు జరిగాయని, ఇంట్లోకి శవాలను రానిస్తే అరిష్టమంటూ, భవిష్యత్తులో ఇల్లు అద్దెకు పోదనే కాసుల కక్కుర్తితో ఇంటి యజమాని గేటుకు తాళం వేశాడు. ప్రజా సంఘాలు, సామాజికవేత్త మాధవరెడ్డి, ఎంత బతిమలాడినా, బంధువులు కన్నీరుమున్నీరైనా ఆ యజమాని మనసు కరగలేదు. మానవత్వాన్ని మరిచి మూఢనమ్మకాలకే పీట వేశాడు.

**పరాయి గడ్డపై.. కన్నీటి మధ్య అంత్యక్రియలు**

సొంత ఇల్లు అనుకుని నాలుగేళ్లుగా ఉంటున్న అద్దె ఇంట్లోకి శవాలను రానివ్వకపోవడంతో, ఆ నిస్సహాయ స్థితిలో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. శవాల సాక్షి గా రోడ్డు పక్కన గంటల తరబడి రోదించిన బంధువులు, చివరకు చేసేదేమీ లేక భద్రాచలం నుండి మృతదేహాలను భద్రాచలం సమీపంలోని పురుషోత్తపట్నం గ్రామానికి తరలించారు. తీవ్ర కన్నీటి పర్యంతం మధ్య, ఊరకాని ఊరిలో ఆ ముగ్గురి మృతదేహాలకు అంతిమ సంస్కారాలు నిర్వహించాల్సి రావడం అక్కడికి చేరిన వారి గుండెలను పిండేసింది.

**పోలీసుల రంగప్రవేశం.. ఇంటి యజమానిపై కేసు నమోదు**

ఈ అమానవీయ ఘటనపై స్థానిక పౌర సమాజం, యువత నుంచి తీవ్ర నిరసన వ్యక్త మైంది. సమాచారం అందుకున్న భద్రాచలం పోలీ సులు వెంటనే రంగంలోకి దిగారు. మృత దేహాలకు కనీస గౌరవం ఇవ్వకుండా, పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబాన్ని వేధించినందుకు గానూ ఇంటి యజమానిపై పోలీసులు చట్ట పరమైన కేసు నమోదు చేశారు. మూఢనమ్మకాల పేరుతో ఇటువంటి చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, కఠినంగా శిక్షి స్తామని పోలీసులు హెచ్చరించారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్
# ఇద్దరు యువకులు దుర్మరణం


మృతి చెందిన యువకులు(ఫైల్)

**పలాస (వజ్రపుకొత్తూరు), జూన్ 22 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలంలోని చిన్న తామాడపేట సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. బైక్ అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొన డంతో ఈ విషాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోపీనాథపురం గ్రామానికి చెందిన కర్ని కోదండరావు (28), గర్తంవానిపేట గ్రామానికి చెందిన గర్తం మణికంఠ (33) కలిసి సైనూరు గ్రామంలో జరుగుతున్న అమ్మవారి ఉత్సవాలకు హాజరయ్యారు. ఉత్సవాలను దర్శించుకుని అర్ధరాత్రి సమయంలో స్వగ్రామాలకు తిరిగి బయలుదేరారు. ఈ క్రమంలో చిన్న తామా డపేట సమీపానికి చేరుకోగానే వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఒక్కసారిగా అదుపు తప్పింది. వేగంగా వెళ్తున్న బైక్ రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి సమయంలో కావడంతో విషయం ఎవరికీ తెలియలేదు. అనంతరం అటుగా వెళ్తున్న స్థానికులు ప్రమాదాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వజ్రపు కొత్తూరు పోలీసులు మృతదేహాలను పరిశీలించి పంచనామా నిర్వహించారు. ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలిం చారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు బంధువులు ఆస్పత్రికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. యువకుల అకాల మరణంతో గోపీనాథపురం, గర్తంవానిపేట గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.



## యోగాంధ్ర రాష్ట్ర స్థాయి విజేతను అభినందించిన ఎస్పీ

**అనంతపురం క్రైమ్, జూన్ 22 ప్రభాతవార్త:** 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర-2026 కార్యక్రమంలో అనం తపురం జిల్లా యోగ క్రీడాకారుడు, డిస్ట్రిక్ట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ అనంతపురంలో విధు లు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ ఎం.చలపతి విశిష్ట ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయిలో విజయం సాధించిన ఆయనను జిల్లా ఎస్పీ జగదీష్ అభినందించారు. ఈ నెల 15, 16 తేదీలలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఈయన జూన్ 18, 19 తేదీలలో విజయవాడ సమీపంలోని గుంటుపల్లి డాన్ బాస్కో ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాంధ్ర పోటీలలో పాల్గొని సీనియర్ విభాగం సోలో యోగాసన పోటీల్లో తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. గత సంవత్సరం యోగాంధ్ర-2025 పోటీలలో కూడా పాల్గొని తన ప్రతిభను చాటుకున్నారు. అలాగే 2025 సంవత్సరంలో విశాఖపట్నంలో ప్రధాని మోదీ సమక్షంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రధాన కార్యక్రమంలో యోగా ప్రోటోకాల్ ప్రదర్శనలో పాల్గొనడం విశేషం. ఈయన యోగా రంగంలో విశేష సేవలు అందిస్తూ, పోలీస్ శాఖ నిర్వహించే వివిధ యోగా పోటీలలో పాల్గొని ఉన్నతాధికారుల ప్రశంసలు పొందుతున్నారు. రాష్ట్ర స్థాయిలో విజయం సాధించిన అనంతరం జూన్ 21న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రధాన కార్యక్రమంలో ఆయనకు ప్రత్యేక స్థానం కల్పించారు. సీ ఎం, యోగా గురువు బాబా రాందేవ్, మంత్రుల సమక్షంలో నిర్వహించిన యోగా ప్రోటోకాల్ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించింది. ఈ సందర్భంగా మంత్రులు స్వయంగా విజేతలను అభినందించి వారి ప్రతిభను కొనియాడారు.

## మనోజ్ పరమహంసకు డి.సిఎం పవన్ అభినందనలు

**విజయవాడ,జూన్ 22, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ ఛాయాగ్రహకులు మనోజ్ పరమహంస చెన్నైలోని ప్రముఖ ఫిల్మ్ ఇన్స్టిట్యూట్ ఎం.జి.ఆర్. ప్రభుత్వ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఛైర్మన్‌గా తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం నియమించడం సంతోషదాయకమని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 'ఎక్స్' వేదిక అభినందించారు.ఆయనకు నా హృదయపూర్వక అభినందనలు. మనోజ్ పరమహంస ఛాయాగ్రాహకుడిగా తెలుగు, తమిళ చిత్రాలకు పని చేశారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, సినిమా రూపకల్పన, నిర్మాణ శైలులపై అవగాహన ఉన్న సాంకేతిక నిపుణుడాయన. చెన్నైలో ఉన్న ఈ ఇన్స్టిట్యూట్ నుంచే అన్నయ్య చిరంజీవి రజనీకాంత్, సుహాసిని, నాజర్ రాజేంద్ర ప్రసాద్‌లాంటి అగ్రశ్రేణి నటులు, పి.సి.శ్రీరామ్, పి.ఎస్.నివాస్ లాంటి సాంకేతిక నిపుణులు వచ్చారు. మనోజ్ పరమహంస నేతృత్వంలోనూ ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు రావాలని ఆకాంక్షిస్తున్నా అన్నారు.

## నిజ జీవితంలోనే అద్భుతంగా నటిస్తున్న పవన్
### సీనియర్ న్యాయవాది జడ శ్రవణ్ కుమార్

**విజయవాడ,జూన్ 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై జై భీమ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ పవన్ కల్యాణ్ హావభావాలు, ఆయన మాట్లాడుతున్న విధానంపై సోషల్ మీడియాలో విపరీతంగా మీమ్స్, ట్రోల్స్ వస్తున్నాయని ఎద్దేవా చేశారు. 'ఈ శతాబ్దపు మోస్ట్ కామిక్ పర్సన్ పవన్ కల్యాణ్. ఆయన సినిమాల్లో కంటే నిజ జీవితంలోనే అత్యంత అద్భుతంగా నటిస్తున్నారు. పదిమందిలో మాట్లాడుతున్నామనే కనీస బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు. పవన్ ఉప ముఖ్యమంత్రి కాకుండా ఉంటే, మీడియాతో మాట్లాడుతూ ఆయన మాటలకు నా పీఏ కూడా స్పందించడు. అసలు ఆయన వెంట ఒక సామాజిక వర్గం కళ్లు మూసుకుని ఎలా నడుస్తుందో నాకు ఇప్పటికీ అర్థం కావడం లేదు' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.రేపిన సుగాలి ప్రీతి కేసును పవన్ డీల్ చేస్తున్న తీరుపై ఆయన న్యాయ అంశాలను లేవనెత్తారు. 'సుగాలి ప్రీతి అసలు ఏ సంవత్సరంలో చనిపోయిందో కూడా కనీస అవగాహన లేకుండా పవన్ మాట్లాడుతున్నారు. 2019 వరకు రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉందని, మరి దానిపై పవన్ కళ్యాణ్ ఎందుకు నోరు మెదపరని శ్రవణ్ కుమార్ నిలదీశారు.

## వెల్లలచెరువు వద్ద రోడ్డు ప్రమాదం
# లారీని ఢీకొట్టిన ఆటో: ముగ్గురు మృతి
### ఐదుగురికి తీవ్ర గాయాలు




**అద్దంకి, జూన్ 22, ప్రభాతవార్త :** ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం, వెల్లలచెరువు - కామేపల్లి గ్రామాల మధ్య పేరేచర్ల- కర్నూల్ రాష్ట్ర రహదారిపై సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో అక్కడికక్కడే ముగ్గురు మృతిచెందగా, 6గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను నరసరావుపేటలోని వివిధ వైద్యశాలకు తరలించారు. అందిన వివరాలు ప్రకారం పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం, వెల్పూరు గ్రామానికి చెందిన 9మంది ఫిరంగిపురం మండలం, సంక్రాంతిపాడు గ్రామంలో దశదిన కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఆటోలో బయలుదేరారు. వెల్లలచెరువు సమీపంలో వీరహనుమాన్ గ్రానైట్ ఫ్యాక్టరీలో నుండి లారీ రోడ్డుపైకి వస్తూ వినుకొండ వైపుకు మలుపు తిరుగుతున్న సమయంలో ఎదురుగా వస్తున్న ఈ ఆటో లారీని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న వెల్పూరు గ్రామానికి చెందిన దావులూరి ఏడుకొండలు(50), ముంద్రు రవణమ్మ(52), ఎలవర్తి సుబ్బులు అక్కడికక్కడే మృతి చెందారు. ఇది ఇలా వుండగా ఈ సంఘటనలో గాయపడిన ముంద్రు సుబ్బాయమ్మ, గుత్తి సుబ్బా యమ్మ, ముంద్రు వెంకటరామాయ్యలను నరసరావుపేటలోని ఏషియన్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అదే విధంగా బోయిపాటి అనురాధ, బోయపాటి లక్ష్మీదేవమ్మలను నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దోమ చినయోగమ్మ స్వల్ప గాయాలతో చికిత్స అనంతరం గ్రామానికి తరలించారు. ఆటో డ్రైవర్ కుంకలగుంట మీరావలి ప్రమాదం నుండి సురక్షితంగాబయట పడ్డాడు. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా ధ్వంసం అయ్యింది. ప్రమాద సంఘటన సమాచార తెలుసుకున్న వెంటనే సంతమాగులూరు సి.ఐ. శేషగిరిరావు, ఎస్.ఐ. పట్టాభిరామయ్యలు ఉన్నతాధికారుల సమావేశం కొరకు దర్శిలో వుండగా, ఎఎస్ఐ శ్రీనివాసరావు, హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లును, సిబ్బందిని అప్రమత్తం చేసి, సంఘటనా స్థలానికి పంపించి, అధికారులు కూడ హుటాహుటిన చేరుకొని, సంఘటనా స్థలాన్ని పరిశీలించి, నరసరావుపేటలో వివిధ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి, దరాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వెల్పూరు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## కౌన్సెలింగ్‌కు వెళుతూ గాయపడిన తేజస్విని


**సత్యవేడు, జూన్ 22 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా సత్యవేడు మండలం మాధనపాళెంకు చెందిన ఆర్.తేజస్విని పదో తరగతిలో 573 మార్కులతో మెరిసింది. పేద కుటుంబం నుంచి వచ్చినా పట్టుదలతో చదివి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. తమ బిడ్డ జీవితం మారబోతోందన్న ఆనందంతో తల్లిదండ్రులు ఈ నెల 22న కౌన్సిలింగ్‌కు



బయలుదేరారు. కానీ సోమవారం వేకువ జామున రాజంపేట సమీపంలోని పుల్లంపేట వద్ద వారి బస్సును లారీ ఢీకొనడంతో ఆ కలల ప్రయాణం ఆగిపో యింది. ఈ ప్రమాదంలో తేజస్వినికి రెండు చేతి వేళ్ల తెగిపోగా, కాలికి తీవ్ర గాయమైంది. తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నొప్పితో విలవిల లాడుతూ చికిత్స పొందుతోంది. ఆమెతో పాటు వెళ్లిన తల్లిదండ్రులు కూడా గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. ఈ రోజు కౌన్సిలింగ్‌కు ఎలా వెళ్తాను ? నా చదువు ఏమైపో తుంది.? అని కన్నీటితో ప్రశ్నిస్తోంది తేజస్విని. సర్టిఫికెట్లు పట్టుకుని కాలేజీ గేటు దాటాల్సిన ఆ చిన్నారి, ఈ రోజు ఆస్పత్రి బెడ్‌పై నిస్సహాయంగా పడి ఉంది.

## బాధ్యతలు స్వీకరించిన డా.హనుమంతు పురుషోత్తం

**విజయవాడ జూన్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సైన్స్, టెక్నాలజీ ఇన్నోవేషన్ శాఖ నూతన కార్యదర్శిగా డా.హ నుమంతు పురుషోత్తం సోమవారం సచివాలయంలో 5వ బ్లాక్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్ ఛార్జ్ హోదాలో బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించడం జరిగింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్‌ను డా.హనుమంతు పురుషోత్తం మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పురుషోత్తంకు సీఎస్ అభినందనలు తెలిపారు. శాస్త్రవేత్తగా ఆవిష్కరణల ప్రోత్సాహకునిగా, విద్యావేత్తగా మరియు పరిపాలనాధికారిగా సైన్స్ టెక్నాలజీ ఇన్నోవేషన్ పరిశోధన మరియు అభివృద్ధి మేధో సంపత్తి హక్కులు సాంకేతిక పరిజ్ఞాన బదిలీ మరియు సంస్థాగత అభివృద్ధి రంగాలలో దాదాపు 4 దశాబ్దాల అపార అనుభవాన్ని ఆయన కలిగి ఉన్నారు. దేశంలోని ప్రముఖ జాతీయ సంస్థల్లో కీలక నాయకత్వ బాధ్యతలు నిర్వహిస్తూ భారతదేశ విజ్ఞాన సాంకేతిక మరియు ఆవిష్కరణ వ్యవస్థ బలోపేతానికి ఆయన ఎంతగానో కృషి చేశారు. ప్రస్తుతం సైన్స్ టెక్నాలజీ ఇన్నోవేషన్ శాఖ సెక్రటరీగా బాధ్యతలు స్వీరించడానికి ముందు డా.పురుషోత్తం కేంద్ర ప్రస్తుత విజ్ఞాన మరియు సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కు ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు.



## శివయ్యనుదర్శించుకున్న గోవా మాజీ మంత్రి దిగంబర్‌కామత్

**శ్రీకాళహస్తి,జూన్ 22 ప్రభాతవార్త:** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరా లయంలో స్వయంభువుగా వెలసిన వాయు లింగేశ్వరుని సోమవారం భక్తి శ్రద్ధలతో గోవా మాజీ మంత్రి దిగంబర్ కామంత్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు.ఆయనకు ప్రోటోకాల్‌మేరకు స్వాగతంను ఆలయ ఇఓ బికె వెంకటేశు ఏర్పాటు చేసారు. దక్షిణ గోపురం వద్ద ఆలయకు ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్,ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో ప్రత్యేక ఆహ్వానం పలికారు. దిగంబర్ కామత్ గతంలో కూడా వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. పూజలు జరిపించుకున్నారు. ఆలయంలో స్వామి అమ్మవార్ల ఆలయ అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు.స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఆయనకు మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు ఏర్పాటు చేసారు.మాజీ మంత్రికి ఇఓ బికె వవెంకటేశు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి దిగంబర్ కామత్‌మాట్లాడుతూ తాను గతంలో కూడా శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని దర్శించు కున్నానని కానీ అప్పటికి ఇప్పటికి ఎంతో అభివృద్ధి మార్పులు చేర్పులు చోటు చేసుకు న్నాయని సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఏర్పాట్లను ఆలయ ఇన్సెపెక్టర్ వెంకటస్వామి బిజెపి నాయకుడు చందూ రాయల్ పర్యవేక్షించారు.



## వైభవంగా బారాషహీద్ దర్గా ఫెస్టివల్ కమిటీ ప్రమాణం
### దర్గా అభివృద్ధికి 5 కోట్లు కేటాయించిన సీఎం చంద్రబాబు
### కూటమి పాలనలో మళ్లీ మంచి రోజులు: మంత్రి నారాయణ

**నెల్లూరు, జూన్ 22, ప్రభాతవార్త - వైద్యం:** నగరంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం బారాషహీద్ దర్గా ఫెస్టివల్ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా బారాషహీద్‌ల సమాధులను దర్శించిన మంత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం దర్గా అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు దర్గా కోసం ఐదు కోట్ల రూపాయలు కేటాయించారని మంత్రి నారాయణ తెలిపారు. గతంలో 2014లో నారాయణ మంత్రిగా ఉన్నప్పుడే స్వర్ణాల చెరువు ఘాట్లు, మరుగుదొడ్లు, రూ.20 కోట్లతో కన్వెన్షన్ సెంటర్ వంటి పనులకు పునాది పడిందని వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ గుర్తుచేశారు. దర్గాకు తాను 30 ఏళ్లుగా భక్తుడినని, గత ప్రభుత్వ హయాంలో దర్గా అభివృద్ధి కోసం పోరాడానని ఎమ్మెల్యే కోటంరెడ్డి పేర్కొన్నారు. తన హయాంలో ఈద్గా, ముఖద్వారాలు నిర్మించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాబోయే రొట్టెల పండుగలో భక్తుల సంఖ్య 14 లక్షలకు పైగా పెరిగే అవకాశం ఉన్నందున, పారిశుధ్యానికి పెద్దపీట వేస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులంతా సమన్వయంతో అద్భుతమైన ఏర్పాట్లు చేయాలని, దర్గా సంపూర్ణ సర్వతోముఖాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తామని నేతలు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, మేయర్ సుజాతా అశోక్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, స్థానిక టిడిపి ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యువకుడు దారుణ హత్య
### హంతకులపై కేసు నమోదు చేయాలని మృతుని కుటుంబీకులు రిమ్స్ వద్ద ఆందోళన



**సంతనూతలపాడు, జూన్ 22, ప్రభాతవార్త:** సంతనూతలపాడు మండలం మంగమూరు గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి స్థానిక అంబేద్కర్ నగర్‌కు చెందిన పిల్లి అశోక్(30)ను అదే కాలనీకి చెందిన ఐదుగురు వ్యక్తులు కత్తులతో దాడి చేసి హత్య చేసినట్లు వెలుగులోకి వచ్చింది. మృతి చెందిన పిల్లి అశోక్‌కు తల్లి, భార్య, సంవత్సరం వయసు గల అమ్మాయి ఉన్నారు. ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శేషగిరి రావు, సంతనూతలపాడు ఎస్సై వేజెండ్ల అజయ్‌బాబు, పోలీసు సిబ్బంది హత్య ప్రాంతాన్ని సందర్శించి విచారించారు. సోమవారం హత్యకు గురైన అశోక్ మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అయితే ఒంగోలు రిమ్స్ వద్ద హత్యకు గురైన అశోక్ కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. మంగమూరు అంబేద్కర్ నగర్‌లోని పెయ్యాల సతీష్, అల్లడి చందు, ఆలూరి సంతోష్, మరొక ఇద్దరు కలిపి తమ కుమారుని కత్తులతో పొడిచి హత్య చేశారని మృతుడు తల్లి సుశీల ఈ మేరకు వాపోయారు. అంతే కాకుండా గ్రామానికి చెందిన కంకణాల మధు ముందసులో భాగంగా క్రికెట్ ఆడి ఇంటికి వచ్చిన తమ కుమారుడు అశోక్‌ను ఆదివారంరాత్రి తమ ఇంటి నుండి బయటకు తీసుకువెళ్లి పథకం ప్రకారం హత్య చేయించారని హత్యకు గురైన అశోక్ తల్లి సుశీల, మేనమామ దార్ల కోటేశ్వరరావు, అశోక్ భార్య, కుటుంబీకులు ఈ మేరకు వాపోయారు. వాస్తవ విషయాలు పోలీసు దర్యాప్తులో వెలుగులోకి రానున్నాయి. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై అజయ్‌బాబు కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆవుల చంద్రశేఖర్‌కు అంతర్జాతీయ అవార్డు
### 26న బ్రిటన్ పార్లమెంట్ హాల్‌లో ప్రదానం



**విజయవాడ, జూన్ 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు (ఏపీఎంఏపీ) ముఖ్య కార్యనిర్వహణాధికారి (సిఈఓ) ఆవుల చంద్రశేఖర్ కృషికి అంతర్జాతీయ అవార్డు దక్కింది. "భారతీయ ఆయుర్వేద శాస్త్రం వ్యవసాయ సాంకేతికత" అనే ప్రధాన శీర్షికతో 50 పరిశోధనా గ్రంథాలను స్వల్పకాల వ్యవధిలో ఆయన వెలువరించారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న "వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్" సంస్థ చంద్రశేఖర్ కృషిని గుర్తించి, అంతర్జాతీయ అవార్డుకు ఎంపికజేసింది. లండన్ నగరంలోని బ్రిటన్ పార్లమెంట్ హాల్ లో ఈ నెల 26వ తేదీ జరిగే ప్రత్యేకసభలో ఆవుల చంద్రశేఖర్ కు అవార్డును ప్రదానం చేయనున్నారు. "ది ఇండియన్ ఆయుర్వేద సైన్స్ అగ్రి టెక్నాలజీ" అనే శీర్షికతో, 44 వ్యాధులకు సంబంధించిన 729 ఔషధ మొక్కలు, నివారణలతో కూడిన 50 పుస్తకాలను పూర్తి చేయడం ఒక ముఖ్యమైన రికార్డుగా లండన్ సంస్థ ప్రశంసించింది. ఈ 50 పుస్తకాలన్నీ సహజ నివారణలు, వ్యవసాయ సాంకేతికత, మార్కెటింగ్, వర్గీకరణ, విలువ జోడింపు మొదలైనవాటిని శాస్త్రీయ పద్ధతిలో వివరిస్తాయని పేర్కొంది. ఆవుల చంద్రశేఖర్ కృషికి అంతర్జాతీయ అవార్డు దక్కడం పట్ల పలువురు ప్రముఖులు ప్రత్యేకంగా అభినందిం చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీశాఖలో డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ హోదా కలిగిన చంద్ర శేఖర్ ను ఏపీఎంఏపీ సిఈఓగా నియమిస్తూ 2025 మార్చి 28 న రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది డిసెంబర్ 31 వరకూ ఆయన సేవలను పొడిగిస్తూ 2026 ఏప్రిల్ 6 న కొనసా గింపు జిఓ వెలువడింది. బాధ్యతలు స్వీకరించిన తర్వాత, 28మార్చి 2025 నుండి విదేశీ సేవల నిబంధనలు, షరతులపై ఏపీఎంఏపీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు.

## పుల్లంపేటవద్ద బస్సును ఢీకొన్న లారీ
# ఇద్దరు మృతి: 16 మందికి తీవ్రగాయాలు


**పుల్లంపేట(తిరుపతి జిల్లా), జూన్ 22 ప్రభాతవార్త :** కడప చెన్నై జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి సమయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించగా మరి కొందరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే తిరుపతి నుంచి కడపకు వెళుతున్న సూపర్ లగ్జరీ బస్సును కడప జిల్లా ఎర్రగుంట్ల నుంచి సిమెంట్ లోడ్‌తో చెన్నైకి వెళ్తున్న లారీ పుల్లంపేట హెచ్.పీగ్యాస్ గోడౌన్ దగ్గర సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న సూపర్ లగ్జరీ బస్సును వేగంగా ఢీకొనడంతో ఘోర ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. అందులో 16 మందికి తీవ్ర గాయాలయ్యాయి.గాయపడిన వారిని రైల్వే కోడూరు రూరల్ సీఐ డి.శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను అంబులెన్స్‌తో పాటు పోలీస్ వాహనంలలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కొందరిని కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో సంఘటన స్థలంలోనే రాజంపేటకు చెందిన పునీత్ సాయి అనే



సంవత్సరం వయసు గల బాలుడు అక్కడికక్కడే మృతిచెందగా, యశస్విత (16) కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. తిరుపతి నుంచి బయలుదేరిన ఆర్టీసీ బస్సు అర్ధరాత్రి సమయంలో పుల్లంపేటలోని మనోహర్ కేఫ్ దగ్గర బస్సును ఆపి, టీ తాగిన డ్రైవర్ బస్సు కదిలిన నిమిషంలోనే ఈ ఘోర దుర్ఘటన జరిగింది. ఎర్రగుంట్ల నుంచి సిమెంట్ లోడుతో వస్తున్న లారీ ఓవర్ స్పీడ్ తో సూపర్ లగ్జరీ బస్సును డ్రైవర్ భాగాన చివర వరకు గుద్దుకొని పోవడంతో బస్సులోని ఒకరికి చెయ్యి తెగి పడిపోయింది. మరొకరి కాలు తెగిపడి రోడ్డుపై పడిపోవడంతో నెత్తురోడిన రోడ్డు బాధిత రోదనలో మిన్నలుంటాయి.

సంఘటన జరిగిన వెంటనే సర్కిల్ ఇన్స్పెక్టర్ డి.శ్రీనివాసులు తమ సిబ్బందితో యాక్సిడెంట్ జరిగిన ప్రదేశానికి చేరుకుని క్షతగాత్రులను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పుల్లంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లకు మంత్రి లోకేష్ సత్కారం
### నేడు పద్మశ్రీ అవార్డులు స్వీకరించనున్న కథానాయకులు


పద్మశ్రీ అవార్డులను అందుకోబోతున్న మురళీమోహన్,రాజేంద్రప్రసాద్‌లతో ఐటి మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి రామ్మోహననాయుడు

**విజయవాడ,జూన్ 22,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ సినీనటులు, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు మాగంటి మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ లను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఘనంగా సత్కరించారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన 2026 పద్మ అవార్డుల ప్రదానోత్సవం మంగళవారం న్యూఢిల్లీలో జరగనుంది. రాజేంద్రప్రసాద్,మురళీమోహన్‌లు తెలుగు చలనచిత్రరంగంలో 50ఏళ్ళగా తమకంటూ గుర్తింపును పొందారు.తెలుగులో హాస్యరస ప్రధాన చిత్రాల్లో రాజేంద్ర ప్రసాద్ కథానాయకునిగా 200లకు చిత్రాల్లో నటించారు.ప్రస్తుతం పాత్రోచిత నటునిగా ఉన్నారు.మురళీమోహన్ హీరోగా,సపోర్టింగ్ యాక్టర్‌గా ప్రసిద్ధులు,పలు చిత్రాలు నిర్మించారు.వారికి ప్రభుత్వం పద్మశ్రీ అవార్డులను ప్రకటించింది.ఈ అవార్డులను స్వీకరించేందుకు డిల్లీకి వచ్చిన మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్ లను మంత్రి లోకేష్ కలుసుకొని జ్ఞాపికలతో సత్కరించారు. వందలాది సినిమాల్లో నటించి, తెలుగు సినిమా రంగానికే వన్నెతెచ్చిన ఇద్దరు సీనియర్ నటులకు ఒకేసారి పద్మశ్రీ అవార్డులు రావడం రాష్ట్రానికే గర్వకారణమని కొనియాడారు. ఈ సందర్భంగా విశ్వ విఖ్యాత నటసర్వభౌమ స్వర్గీయ నందమూరి తారక రామారావు తో తమకు గల సాన్నిహిత్యాన్ని ఇద్దరూ నెమరువేసుకున్నారు. భవిష్యత్తులోనూ తెలుగు కళామతల్లికి సీనియర్ నటులు సేవలందించాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, పలువురు పార్లమెంటు సభ్యులు కూడా మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ లను సన్మానించారు.



# బేబీ బ్లూస్ నిర్లక్ష్యం చేయవద్దు

మన జీవితాల్లోకి పిల్లలు తెచ్చే ఆనందం ఎక్కువే. అయితే, ఈ క్రమంలో తల్లిలో ఏర్పడే శారీరక, మానసిక మార్పులు బేబీ బ్లూస్‌కి కారణమవుతాయి. అంటే, తెలియని ఆందోళన, కుంగుబాటు, సైకోసిస్ లాంటి సమస్యలెన్నో వారిని ఉక్కిరిబిక్కిరి చేయడం, ప్రపంచ వ్యాప్తంగా 10 శాతం గర్భిణులు, 13 శాతం బాలింతలు ఇటువంటి మానసిక సమస్యలు బారిన పడుతున్నట్లు తాజా లాన్సెట్ రిపోర్టు నివేదించింది. అభివృద్ధి చెందిన దేశాల్లోనూ 5 నుంచి 25 శాతం తల్లుల ఆత్మహత్యలకు కారణం ఇదేనట. సుమారు 85 శాతం మహిళల్లో ఈ లక్షణాలు కనిపిస్తు న్నాయట. అయితే, అందులో 70 శ్శాతం మంది వాటిని గుర్తించలేక బయటకు చెప్పలేకపోతు న్నారట. దీని ప్రభావం బిడ్డ ఆరోగ్యంపైన పడడంతో పాటు, తల్లీబిడ్డ మధ్య బంధం ఏర్పడ డంలోనూ సమస్యలు ఎదుం‍వుతున్నాయట. దీర్ఘకాలంలో ఇది పిల్లలపై శారీరకంగా, మానసికంగా, భావోద్వేగాల పరంగానూ ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే ఆ సమయంలో తల్లికి తగిన సహకారం అందిస్తూ మానసిక ఆరోగ్యానికి తోడ్పడాల్సి న అవసరం కుటుంబ సభ్యులపై ఉంటుంది. అందుకోసం ఇలాంటి సమస్యలేమైనా ఉంటే వాటి గురించి బహిరంగంగా చర్చించడం, అవగాహన కలినపంచడం, మొదట్లోనే గుర్తించి చికిత్స చేయించడం లాంటివి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. అప్పుడే తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉంటారు. □

# మొండి మరకలు మాయం !

మనం తయారుచేసే ప్రతి కూరలోనూ పసుపు వేయడం సహజం. ఈ క్రమంలో కొన్నాళ్లకు ఆ పాత్ర లోపలి వైపు పసుపు పచ్చగా మారిపోవడం, మెరుపు కోల్పోవడం.. వంటివి గమనిస్తుంటాం. ఇక ఈ మరకలు స్టీల్ స్క్రబ్బర్‌తో ఎంత రుద్దినా ఓ పట్టాన వదలవు. మరి ఇలాంటి మొండి మరకల్ని తొలగిం చాలంటే కొన్ని చిట్కాలు ఉపయోగపడతాయి. ✦ రెండు కప్పుల నీటికి, పావు కప్పు గ్లిజరిన్, మరో పావు కప్పు లిక్విడ్ సోప్‌ను జతచేసి విశ్రమంగా తయారుచేసుకోవాలి. ఇందులో ఒక క్లాత్ ముంచి. దాంతో పసుపు మరకల ఉన్న పాత్ర లోపలి భాగంలో ఈ మిశ్రమాన్ని పూయాలి. పావుగంట తర్వాత డిష్‌వాషింగ్ లిక్విడ్‌తో ఒకసారి రుద్ది వేడి నీటితో శుభ్రం చేస్తే మరకవదలిపోతుంది. ✦. నిమ్మలోని ఆమ్ల గుణాలకు ఎలాంటి మరకనైనా తొలగించే శక్తి ఉంటుంది. అందుకే దీన్ని సహజ క్లీనర్‌గా పరిగణిస్తాం. వేడినీళ్లలో కొంచెం నిమ్మరసం కలిపి ఆ మిశ్రమాన్ని పసుపు మరక ఉన్న పాత్రలో నింపాలి. రాత్రంతా అలాగే ఉంచి ఉదయాన్నే అన్ని గిన్నెలతో పాటు సాధారణంగా శుభ్రం చేస్తే సరిపోతుంది. ఇక్కడ నిమ్మ రసానికి బదులు వెనిగర్ కూడా వాడచ్చు. ✦ బేకింగ్ సోడాలో కొద్దికొద్దిగా నీళ్లు పోస్తూ పేస్ట్‌లా తయారుచేసుకోవాలి. దీన్ని పసుపు మరకలున్న పాత్ర లోపలి వైపు పూయాలి. అరగంట తర్వాత స్క్రబ్బర్‌తో రుద్ది సాధారణ డిష్ వాష్ లిక్విడ్‌తో శుభ్రం చేస్తే మరక వదిలి పోతుంది. ✦ హైడ్రో జన్ పెరాక్సైడ్‌తోనూ పాత్రలపై పడిన పసుపు మరకల్ని తొలగించచ్చు. ఈ క్రమంలో మరక ఉన్న చోట కొన్ని చుక్కల ఈ ద్రావణాన్ని వేసి.. పావుగంట పాటు పక్కన పెట్టేయాలి. ఆపై సాధారణంగా కడిగేస్తే ఫలితం ఉంటుంది. ✦ పసుపు మరకలున్న పాత్రల్లో బ్లీచ్–నీళ్లు కలిపి తయారుచేసిన ద్రావణాన్ని నింపాలి. కొన్ని నిమిషాల తర్వాత స్క్రబ్బర్‌తో రుద్ది కడిగేస్తే సరిపోతుంది. ④ పాత్రపై పడిన పసుపు మరకను తొలగించ దానికి టూత్ పేస్ట్‌ని కూడా ఉపయో గించచ్చు. ఈ క్రమంలో కొద్దిగా పేస్ట్‌ను మరక ఉన్న చోట మందంగా పూయాలి. అరగంట తర్వాత పొడి క్లాత్‌తో రుద్ది సాధారణ డిష్‌వాషింగ్ లిక్విడ్‌తో శుభ్రం చేయచ్చు. ✦ రెండు వంతులవేడి నీటికి ఒక వంతు వెనిగర్ లేదా బ్లీచ్‌ని కలిపి ఈ మిశ్రమాన్ని పసుపు మరక ఉన్న పాత్రలో నింపాలి. రాత్రంతా అలాగే వదిలేసి ఉదయాన్నే సాధారణ సోప్‌తో కడిగేస్తే ఫలితం ఉంటుంది. ఈ చిట్కా గ్లాస్, సెరామిక్.. వంటి పాత్రలకూ వర్తిస్తుంది. □



# మీలో మీరేనా ఐనా.. మంచిదే !!




ఇతరులతో మాట కలిపి సంభాషణా చాతుర్యంతో స్నేహం బంధాన్ని పెంచు కుంటే ఎంత లాభమో మనలో మనం మాట్లాడుకుంటూ స్వయం చోదకత సాధిస్తే కూడా అంతే లాభమంటున్నారు పరిశోధ కులు. 'స్వీయ సంభాషణను' వింతగా చూడటం కానీ అధిక్షేపించడం కానీ తగదంటున్నారు పరిశోధకులు మరచిపోతామనుకున్న విషయాలను గుర్తు చేసుకుంటూ తమలో తాము గట్టిగా మాట్లాడుకుంటున్న సందర్భాలు ఉంటే కంగారు పడాల్సి న అవసరమేమీ లేదు. అది కూడా వారి మంచికేనట. అదేమీ వింత అలవాటు కాదు. మీ మెదడు పనితీరులో ఇది సహజమైన భాగంగా గుర్తించండి. ఇలా మీతో మీరు మాట్లాడుకోవడం 'ఏకాగ్రత'ను పెంచుతుం దని తెలుసుకోండి. మనసులో ఆలోచించు కోవడమా, దానిని తలచు కోవడమూ మీకు మంచిదే. చూసిన వాళ్లో, విన్న వాళ్లో ఏదైనా అనుకుంటారని వెనుకంజ వేయద్దు సుమీ! బ్రిటన్‌లోని బాంగోర్ యూనివర్సిటీకి చెందిన సైకాలజిస్టులు నిర్వహించిన పరిశోధనలో కొన్ని ఆసక్తికర విషయాలను వెలుగులోకి తెచ్చారు. ఇదొక ప్రత్యక్ష ప్రయోగాత్మక పరిశోధన అన్నమాట. సమర్థంగా మనం చెప్పు కొన్న మాటలను మనమే వినడం వల్ల మన మెదడు ఆ సూచనలను మరింత స్పష్టంగా చురుకుగా స్వీకరిస్తుందని పరిశోధకులు అంచనా. అయ్యో! ఫోన్ ఎక్కడ పెట్టానో, నా మతిమండ.. అనుకుంటూనే తాను అంతక్రితం ఎక్కెడెక్కడ తిరిగారో ఎవరెవరితో మాట్లాడినదీ గుర్తుకు తెచ్చుకుంటారు. అదేదో రుగ్మతకు సంకేతం అనుకునేరు. అదే కాదు. అలా అనుకుంటూ వెతుక్కుంటే మంచిదేనని ఈ అధ్యయనం చెబుతోంది. అంటే మాటల రూపంలో మెదడుకు సంకేతం ఇవ్వడం వల్ల కళ్ల దృష్టి కూడా ఆ వస్తువు పైనే ఎక్కువగా కేంద్రీకృతమవుతుందని పరిశోధకులు గుర్తించారు. అందుకే ఏదైనా వస్తువు కోసం వెతుకుతున్నప్పుడు 'మీలో మీరే' మాట్లాడు కోవడం సహజమే కాదు ప్రయోజనకరమే. ఒకవేళ ఇలాంటి అలవాట్లున్నా చిన్నతనంలోనే అలవాటవుతాయి కనుక పెద్దగా కంగారు పడనక్కర్లేదు. మనసు బాహ్యంతరాళం లోంచి పుట్టే ఆలోచనలను మనమేమీ నియంత్రించలేం. అయినా దానిన వలన ప్రయోజనమే కనుక స్వాగతించాల్సి ందే. ఒక్కొక్కప్పుడి వంటగదు లోంచి మాటలు వినబడితే ఎవరు? ఏమిటి? ఎవరూ లేకుండానే నా ఇల్లాలు 'తనలో తానే' మాట్లాడుకుంటోందేమిటని భర్త మహాశయుడు అనుకోవడం కూడా కద్దు. అది కూడా 'పని'లో భాగమేనని సరిపెట్టుకోవాల్సి ందే. రెండు నుంచి ఏడు సంవత్స రాల మధ్య పిల్లల్లో ఇలాంటి అలవాటు ఎక్కువగా కనపిస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. ఈ అల వాటున్న వారిలో స్వీయ నిర్ణయాలు తీసుకోవడంలో పనుల సంపూర్తి, భావోద్వేగాలను నియంత్రణలో ఎంతగానో సాయపడు తుంది. వయసు పెరిగే కొద్దీ ఈ స్వీయ సంభాషణ మనసును వేగవతంగా పనిచేయిస్తుంది. కనుక అలవాటు స్వీటు. స్వీటుగానే ధ్వనిస్తుంది. దీంతో భావోద్వేగ ఒత్తిడి కొంత తగ్గడమే కాదు పరిస్థితిని మరింత చక్కగా అంచనా వేయగలుగుతుంది. □

# ప్రాయశ్చిత్తం

**పూర్వం** సత్యవర్ష మహర్షి అనే జ్ఞాని అరణ్యంలో కుటీరం ఏర్పరచుకుని, వేద పాఠాలు నేర్చేవాడు. ఒకసారి ఓ శిష్యుడు 'గురుదేవా! ఎంతోకాలంగా నన్నొక సంశయం పట్టిపీడిస్తోంది. దాన్ని తీర్చాల్సి ందిగా ప్రార్థిస్తున్నాను అంటూ చేతులు జోడించాడు. ఏమిటో చెప్పమన్నారాయన. అయ్యా! దేవేంద్రుడిది తేజోమయమైన దివ్యదేహం. అహల్యది మట్టితో కూడినది. ఈ రెండు దేహాలకూ సాంగత్యం కుదరదు కదా! మరీ దీన్నెలా అర్థం చేసుకోవాలి? అనడి గాడు. నాయనా! అహల్య భావపరమైన మోహానికి పాల్పడింది. అందువల్ల భర్త శపించాడు. సంవత్స రాల తరబడి ఆమె ఆకలిదప్పులు లేని ఒక శిలామూర్తిగా ఉండిపోయింది. అలా ప్రాయశ్చిత్తం చేసుకోవడం వల్ల తన మానసిక దోషాన్ని సంపూర్ణంగా ప్రక్షాళన చేసుకుంది. అది చాలక. పరమ పావనమైన శ్రీరామచంద్రుడి పాదస్పర్శకూ నోచుకుంది. అందువల్లే ఆమె కడిగిన ముత్యంలా ప్రకాశించింది. పతివ్రతా శిరోమణుల్లో తొలి స్థానం అందుకుని పూజ్యురాలయ్యింది. కేవలం మానసిక దోషానికే అంత ప్రాయశ్చిత్తం చేసుకున్నదంటే.. ఇక మనలాంటి సామాన్యులు ఎంత అప్రమత్తంగా ఉండాలో ఎన్ని జాగ్రత్తలు తీసుకోవాలో అహల్యగాథ తెలియచేస్తుంది అంటూ వివరించాడు సత్యవర్ష మహర్షి. □

# రోజుకో అరటి పండు బహు చక్కగా !



ఏడాది పొడవునా దొరికేదీ, ఎంతగానో మేలు చేసేది ఏదంటే.. అది కచ్చితంగా అరటిపండే ఈ పండు తినడం వల్ల ఎన్నెన్ని ప్రయోజనాలున్నాయో చూడండి. పొటాషియం, మెగ్నీషి యం, మాంగనీస్, రిబోఫ్లేవిన్ ఫొలేట్, కాపర్, పీచు, బి 6, సి-విటమిన్లతో ఇది మంచి పోషకాహారం. తిన్న ఆహారాన్ని త్వరగా జీర్ణం చేస్తుంది రక్తపోటును అదుపులో ఉంచుతుంది. గుండె జబ్బులను రానివ్వదు. మనసుకు ఆహ్లాదం కలిగిస్తుంది. జ్ఞాపకశక్తిని పెంచుతుంది. ఇందులోని యంటీ ఆక్సిడెంట్స్ నొప్పి, వాపులను తగ్గించి.. మొత్తంగా శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. హార్మోన్లను క్రమబద్ధం చేస్తుంది. అరటిపండు మూత్ర పిండాల్లో సమస్యలను నివారిస్తుంది. వ్యాయామం చేసిన తర్వాత ఒక అరటిపండు తినడం అలవాటు చేసు కుంటే నీరసం తగ్గి, తక్షణ శక్తి వస్తుంది. ఇంత మేలు చేసే అరటిపండు ఎంతో రుచిగా కూడా ఉంటుంది. కనుక ఇష్టంగానే తినేయొచ్చు. దీన్ని ఓట్‌మీల్, మిల్క్‌షేక్, స్మూథీ, సలాడ్స్‌లోనూ వేసుకోవచ్చు. స్వీట్లు చేయొచ్చు. ఇన్ని లాభాలున్నప్ప టికీ అలుర్జీలు, ఉబ్బసం, సైనస్ లాంటి ఇబ్బందులేమైనా ఉండి బాధపడుతుంటే మాత్రం అరటిపండుకు అరగించొద్దు! . □

# కలబందతో మొటిమలకు చెక్ !

చర్మానికి చల్లదనాన్ని అందించడమే కాదు. మోముపై ఏర్పడిన మొటిమలు, మచ్చల్ని తగ్గించడం లోనూ కలబందను మించిన ఔషధం మరొకటి లేదని చెప్పడంలో సందేహం లేదు అందుకే దీన్ని వివిధ రకాల సౌందర్య ఉత్పత్తుల తయారీలో ఉపయోగిస్తుంటారు. ఈ క్రమంలో కలబందతో పాటు ఇంట్లో లభించే కొన్ని పదార్థాలను కలిపి ఫేస్‌ప్యాక్ ఎలా తయారు చేసుకోవాలి మూడు టేబుల్‌స్పూన్ల కలబంద గుజ్జుకు రెండు టేబుల్‌స్పూన్ల పసుపు, రెండు టేబుల్‌స్పూన్ల రోజ్‌వాటర్ కలిపి మిక్సీ పట్టుకోవాలి. ఇందులో టేబుల్‌స్పూన్ శెనగపిండి వేసి మరోసారి మిక్సీ పట్టుకోవాలి. అవసరమైతే ఇందులో మరికొంత రోజ్‌వాటర్ లేదంటే శనగపిండి వేసుకొని పేస్ట్‌లాగా చేసుకోవలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకొని 20 నిమిషాల పాటు ఉంచి ఆపై గోరువెచ్చటి నీళ్లతో శుభ్రం చేసు కోవాలి. ఇలా తరచూ చేయడం వల్ల మొటిమల సమస్యను ఇట్టే తగ్గించుకోవచ్చును. □



# 'టీఎఫ్ సిసి షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్



'టీఎఫ్ సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026' ప్రధానోత్స వ కార్యక్రమం.. ఎంట్రీలు పంపిన వారిలో చాలా టాలెంట్ ఉంది, వారికి ఇండస్ట్రీలో అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తాం టీఎఫ్ సీసీ ఛైర్మన్ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్.."టీఎఫ్ సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026" ప్రధానోత్స వ కార్యక్రమం ఆదివారం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జ్యూరీ ఛైర్ పర్స న్ ఇంద్రజ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వచ్చే ఏడాది నుంచి మొదటి బహుమతి లక్ష రూపాయలు అందిస్తామని డా. ప్రతాని రామకృష్ణగౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎఫ్ సీసీ ఛైర్మన్ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడి 12ఏళ్లైన సందర్భంగా "టీఎఫ్ సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026'నిర్వహించాలని ముందుకొచ్చాం. అవార్డ్స్ ప్రకటించిన 15 రోజుల్లోనే విజయవంతంగా కార్యక్రమం నిర్వహించగలిగాం. దాదాపు 60కి పైగా ఎంట్రీలు వచ్చాయి. జ్యూరీ ఛైర్ పర్స న్ ఇంద్రజ గారు ఎంట్రీలను శ్రద్ధగా పరిశీలించి, ప్రతి షార్ట్ ఫిలింను చూసి విజేతలను ఎంపిక చేశారు. జ్యూరీ ఛైర్ పర్స న్ ఇంద్రజ మాట్లాడుతూ కొత్త టాలెంట్ ను ఎంకరేజ్ చేయాలని మంచి ఉద్దేశంతో రామకృష్ణ గౌడ్ గారు "టీఎఫ్ సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026" కార్యక్రమం చేపట్టారు. . అలాంటి వ్యక్తి చేస్తున్న కార్యక్రమం కాబట్టి నేను జ్యూరీ ఛైర్ పర్స న్ గా ఉండేందుకు ముందుకొచ్చాను. సినిమా అనేది మీ కల, మీరు కోరుకునే భవిష్యత్తు. అందుకే జాగ్రత్తగా ప్రతి ఎంట్రీని పరిశీలించి అవార్డ్స్ కు ఎంపిక చేశాం. . ఇది చాలా పెద్ద బాధ్యతగా ఫీలయ్యాను. మీరు పెట్టుకున్న ఆశలు ఎంత విలువైనవో నాకు తెలుసు. నేను టీవీ కార్యక్రమాలు చేస్తున్నప్పుడు కూడా వారి టాలెంట్ చూసి సర్ ప్రైజ్ అయ్యాను.ఎస్ బీఐ బ్యాంక్‌బోర్డ్ మెంబర్ నరసింహ మాట్లాడుతూ తెలంగాణ ఫిలింఛాంబర్ స్థాపించి ఎంతోమంది స్థానిక కళాకారులను, సాంకేతిక నిపుణులను రామకృష్ణ గౌడ్ ప్రోత్స హిస్తున్నారు. ఈ "టీఎఫ్ సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026" కార్యక్రమం ద్వారా యంగ్ టాలెంట్ కు అవకాశాలు కల్పించే ప్రయత్నం చేయడం అభినందనీయం అన్నారు.

# హనుమాన్ 3డి ట్రైలర్ లాంచ్



హనుమాన్ 3డి మీ అందరినీ ఎంతగానో అలరిస్తుందని ఆశిస్తున్నాను. మళ్లీ థియేటర్లలో 3దీలో చూడటానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను: సూపర్ హీరో తేజ సజ్జసూపర్ హీరో తేజ సజ్జ సెన్సే షనల్ బ్లాక్‌బస్టర్ హనుమాన్. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ పై కె.నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా 2024లో విడుదలై రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్స్‌తో పాన్ ఇండియా ఘన విజయాన్ని సాధించింది. ఈ చిత్రాన్ని జూన్ 25న 3దీలో గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగామేకర్స్ 3దీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహిం చారు. హనుమాన్ 3దీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సుప్రీం హీరో సాయి దుర్గ తేజ్ మాట్లాడుతూ.. ఈ వేడుకకు విచ్చేసిన మా నిర్మాతలు నిరంజన్‌రెడ్డి , చైతన్య రెడ్డి చాలా ప్యాషనేట్‌గా తెలుగు ప్రేక్షకులకు కొత్త టెక్నాలజీ తో మంచి సినిమా చూపించాలని భావించి హనుమాన్ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పుడు హనుమాన్ 3డి రూపంలో వస్తోంది. దయచేసి మీరందరూ జూన్ 25న థియేటర్లకు వచ్చి సినిమా చూడండి. సూపర్ హీరో తేజ సజ్జ మాట్లాడుతూ.. నేను కూడా మీతో పాటు ఇప్పుడే మొదటిసారి ఈ 3డి ట్రైలర్‌ను చూశాను. నిరంజన్, చైతన్య ఎంతో కష్టపడి దీనిని సిద్ధం చేశారు. నిర్మాత నిరంజన్‌రెడ్డి మాట్లా డుతూ.. మా ఈవెంట్‌కు వచ్చిన సాయిదుర్గ తేజ్ గారికి ధన్యవాదాలు. మీరు హనుమాన్ సినిమా ను 2డిలో ఎంతగా ఆస్వాదిం చారో, 3డిలో కూడా అంతే అద్భుతంగా ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను. నిర్మాత చైతన్యరెడ్డి మాట్లా డుతూ.. హనుమాన్ చిత్రానికి ప్రేక్షకులు అందించిన అపార మైన ఆదరణకు ప్రతిగా మేమేం చేయగలమని ఆలోచించి, 3డిలో విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం.

# తెర

# యంగ్ టాలెంటెడ్‌తో 'దీవాన'



సెన్సార్ పేరుతో మా క్రియేటివిటీని, మా సినిమా కలను చంపుతున్నారు డైరెక్టర్ శ్రీకాంత్ సంగిశెట్టి.. మా సినిమాలో ముద్దు సీన్స్ లేవు, వయలెంట్ సీన్స్ లేవు. అయినా తి సర్టిఫికెట్ ఇచ్చారు ప్రొడ్యూసర్ వాసుదేవ్ కొప్పినేని.. సరైన సమయంలో సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడం వల్లే "దీవాన" ప్రీమియర్స్ వేయలేకపోయాం హీరో హర్షిత్ రెడ్డి..=యంగ్ టాలెంటెడ్ హీరో హర్షిత్ రెడ్డి నటించిన కొత్త సినిమా "దీవాన". ఈ చిత్రాన్ని అర్వ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మించారు. నటుడు జీవన్ కుమార్ మాట్లాడుతూ ఈ చిత్రంలో నేనొక ఇంపార్టెంట్ రోల్ చేశాను. డైరెక్టర్ శ్రీకాంత్ ఈ సినిమాలోని ప్రతి క్యారెక్టర్ ను బాగా డిజైన్ చేశారు. మ్యూజిక్ డైరెక్టర్ ఈశ్వర్ చంద్ మాట్లాడుతూ దీవాన సినిమా మా ఇరవై ఏళ్ల కల. ఈ రోజు సినిమా చూసి ఎప్పుడో కలిసిన పాత ఫ్రెండ్స్ కూడా ఫోన్స్ చేసి మాట్లాడుతున్నారు. నటి ఝాన్సీ మాట్లాడుతూ దీవాన సినిమాకు ప్రతి థియేటర్ నుంచి సూపర్బ్ రెస్పాన్స్ వస్తోంది. నేను థియేటర్ లో సినిమా చూశాను. గొప్ప ఫీలింగ్ కలిగింది. ప్రొడ్యూసర్ వాసుదేవ్ కొప్పినేని మాట్లాడుతూ ఈ రోజు నాలో చాలా మిక్స్డ్ ఎమోషన్స్ కలుగుతున్నాయి. మంచి సినిమా చేశారంటూ అప్రిషియేషన్స్ తో ఫోన్ కాల్స్ ఆగడం లేదు. ప్రొడ్యూసర్ శ్రీదేవి కార్యంపూడి మాట్లాడుతూ మా మూవీ ప్రీమియర్స్ పడినప్పటి నుంచి ప్రతి ఒక్కరూ సినిమా చాలా బాగుందంటూ అప్రిషియేట్ చేస్తున్నారు. భ్రమరాంభ థియేటర్ పక్కనే మా ఇళ్లు. అక్కడ మా మూవీ షో జరుగుతుంటే ప్రేక్షకుల రెస్పాన్స్ మా ఇంటికి వినిపిస్తోంది. డైరెక్టర్ శ్రీకాంత్ సంగిశెట్టి మాట్లాడుతూ తెలుగు ఆడియెన్స్ అభిరుచి మీద నాకు పూర్తిగా నమ్మకం ఉంది. దీవాన సినిమా ఆగదు. శతదినోత్స వం దాకా వెళ్తుంది. మన ప్రేక్షకులు మంచి చిత్రాన్ని తప్పకుండా ఆదరిస్తారు.హీరో హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ మేమొక గొప్ప చిత్రం చేశామని గర్వంగా చెబుతున్నాను. ఈ సినిమా చూస్తే లవ్ అనే కాన్సెప్ట్ తో ఇప్పటి యూత్ లవ్ లో పడతారు. మేము ఒక రియల్ లైఫ్‌ను సినిమాలో చూపించాం. సినిమా చూసి చాలా మంది మెసేజ్ లు పంపుతున్నారు.

# 'ఒక్కడు' 26న రీ రిలీజ్



ఈ నెల 26న రీ రిలీజ్ కు సిద్ధమైన మహేష్ బాబు "ఒక్కడు" ఎక్సైటింగ్‌గా ఫీల్ అవుతున్న దర్శకుడు గుణశేఖర్..సుమంత్ ఆర్ట్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఎమ్మెస్ రాజు నిర్మాతగా ప్రముఖ దర్శకుడు గుణశేఖర్ దర్శకత్వంలో 2003లో మహేష్ బాబు హీరోగా ప్రేక్షకులకు ముందుకు వచ్చిన చిత్రం ఒక్కడు. సుమారు 23 సంవత్స రాల తర్వాత ఆంధ్ర, తెలంగాణతో పాటు భారతదేశవ్యాప్తంగా 4రీలో తెలుగులో విడుదలవుతుంది. మహేష్‌బాబు కమ ర్షియల్ యాస్పెక్ట్స్ లో కర్నూలు కొండారెడ్డి బురుజు అంటే ఒక్కడు సినిమా అన్నట్లు ఒక మార్క్ సృష్టించి ఇండస్ట్రీ అంతా షేక్ చేసే విధంగా అద్భుతమైన విజయం సాధించిన ఈ చిత్రం రాధా మాధవి ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ సమర్పణలో రామకృష్ణచే జూన్ 26వ రీ రిలీజ్ కానుంది. గుణశేఖర్ కెరియర్ లో అలాగే మహేష్ బాబు కెరియర్ లో ఒక మైల్ స్టోన్‌గా నిలిచిన ఈ చిత్రం ప్రేక్షకులందరికీ మరోసారి అలరించేందుకు రానుంది. భూమిక చావ్లా హీరోయిన్గా నటించిన చిత్రంలో ప్రకాష్‌రాజ్ విలన్ పాత్రలో నటించారు. ముఖేష్ రిషి, తెలంగాణ శకుంతల, అజయ్, గీత, ధర్మవరపు సుబ్రహ్మణ్యం, రాజన్, అచ్యుత్ తదితరులు కీలకపాత్రను పోషించారు.

# 'ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్' సక్సెస్ మీట్



దర్శకుడు పి.సునీల్ కుమార్ రెడ్డి మంచి ప్రయత్నాన్ని అభినందించిన అతిథులు.. సామాజిక ఇతివృత్తాల నేపథ్యంలో చిత్రాలను రూపొందించే దర్శకుడు పి సునీల్ కుమార్ రవడరెడ్డి శ్రావ్య ఫిల్మ్స్ బ్యానర్ పై సుభాష్ చక్రవర్తి సహ నిర్మాతగా గే, ట్రాన్సెండర్ వ్యక్తుల జీవితాల మీద తీసిన కోర్ట్ రూమ్ డ్రామా ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్. ఈ చిత్రంలో ఎల్ శ్రీరామ్, ఎస్తర్ నార్హోన్హ, రాజు ఖేర్, ఆనంద చక్రపాణి , ప్రీతీ నిగమ్ తో పాటు రియల్ ట్రాన్స్జెండర్ యాక్టర్స్ ప్రధాన పాత్రలు పోషించారు. నటుడు ఆనంద చక్రపాణి మాట్లాడుతూ ఎన్నో రకాల సినిమాలు వస్తుంటాయి కానీ ఇలాంటి కథతో సినిమా చేయాలంటే ధైర్యం ఉండాలి. మనం చాలా సమస్యల్ని మనకెందుకు అని చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంటాం. గే కమ్యూనిస్ట్ యాక్టివిస్ట్ విష్ణు మాట్లాడుతూ మా సినిమా ప్రదర్శితమవుతున్న థియే టర్స్‌లో హౌస్ ఫుల్స్ బోర్డ్స్ చూడటం సంతోషంగా ఉంది. సునీల్ కుమార్ రెడ్డిగారు ఒక మంచి విషయాన్ని ప్రేక్షకులకు, సొసైటీకి చెప్పాలని అనుకున్న ఉద్దేశం నెరవేరిందని అనిపిస్తోంది. తెలంగాణ స్టేట్ ట్రాన్స్ జెండర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లైలా మాట్లా డుతూ "ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్" సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్ చెబుతున్నాం. నేను ఈ సినిమాలో భాగమవడం సంతోషంగా ఉంది. నటుడు వంశీకృష్ణ మాట్లాడుతూ ఎన్నో సినిమాల ఈవెంట్స్ చూసేందుకు ఇక్కడికి వచ్చినవాడిని. ఇప్పుడు మా సినిమా ఈవెంట్ లో నేను ఈ వేదిక మీద నిల్చుని మాట్లాడటం గర్వంగా ఉంది

# 'ది రెడ్ బ్యాగ్' టీజర్ లాంచ్ ఈవెంట్



మెమరీ మేకర్స్ బ్యానర్ మీద హరికృష్ణ సోమిశెట్టి నిర్మాణంలో రవి కుమార్ సీరపు తెరకెక్కించిన చిత్రం‍ది రెడ్ బ్యాగ్. ఈ సినిమాలో కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహా సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బాదల్, భార్గవి, రాశీ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన ప్రతీ కంటెంట్ సినిమాపై ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేశాయి. ఆదివారం నాడు ది రెడ్ బ్యాగ్ టీజర్‌ను ఏపీ ఇండస్ట్రీస్, కామర్స్, ఫుడ్ ప్రాసెసింగ్ మినిస్టర్ టీజీ భరత్ రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన టీజర్ లాంఛ్ ఈవెంట్‌లో మంత్రి టిజి భరత్ మాట్లాడుతూ.. 'ది రెడ్ బ్యాగ్' టీజర్ అద్భుతంగా ఉంది. మా కర్నూలు నుంచి వచ్చిన హరి గారు తీసిన ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి. మా రెడ్ బుక్ గురించి ఇండియా వ్యాప్తంగా తెలుసు. అలానే ఈ 'ది రెడ్ బ్యాగ్' మూవీ కూడా ఇండియా అంతా సౌండ్ చేయాలి. కర్నూలులోనే అత్యధిక భాగంగా షూటింగ్ చేశారు. ప్రముఖ దర్శకుడు నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. .. 'ది రెడ్ బ్యాగ్' టీజర్ లాంచ్‌కు వచ్చిన టీజీ భరత్‌కి ధన్యవాదాలు. ఇలాంటి వినూత్న చిత్రాలు తప్పకుండా విజయవంతం అవ్వాలి. దర్శకుడు రవి కుమార్ సీరపు మాట్లాడుతూ.. 'ది రైడ్ బ్యాగ్' చిత్రం లైఫ్ టైం ఇంపాక్ట్ చూపిస్తుంది. ఈ మూవీ చూసిన తరువాత మీరు ఎక్కడ రెడ్ బ్యాగ్‌ని చూసినా మా ‍ది రెడ్ బ్యాగ్ సినిమా గుర్తుకు వస్తుంది. నిర్మాత హరికృష్ణ సోమిశెట్టి మాట్లాడుతూ..'ది రెడ్ బ్యాగ్' సినిమాకి సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మూవీ చాలా బాగా వచ్చింది. టీజర్ అందరికీ నచ్చే ఉంటుందని భావిస్తున్నాను.‍ం సాధించాలి. మా రెడ్ బుక్ గురించి ఇండియా వ్యాప్తంగా తెలుసు. అలానే ఈ 'ది రెడ్ బ్యాగ్' మూవీ కూడా ఇండియా అంతా సౌండ్ చేయాలి. కర్నూలులోనే అత్యధిక భాగంగా షూటింగ్ చేశారు .ప్రముఖ దర్శకుడు నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. .. 'ది రెడ్ బ్యాగ్' టీజర్ లాంచ్‌కు వచ్చిన టీజీ భరత్‌కి ధన్యవాదాలు. ఇలాంటి వినూత్న చిత్రాలు తప్పకుండా విజయవంతం అవ్వాలి.




## నేటి నుంచి యుఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

# లక్ష్యసేన్, తన్వీ శర్మపై టైటిల్ ఆశలు

**వుల్లర్టన్, జూన్ 22:** యుఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ సూపర్ 300 టోర్నమెంట్ నేటి నుంచి వుల్లర్టన్‌లో ప్రారంభం కానుంది. లక్ష్యసేన్, తన్వీ శర్మతో కూడిన భారత షట్లర్లు ఈ టోర్నీపై భారీ ఆశలు పెట్టుకున్నారు. మాజీ ప్రపంచ ఛాంపియన్‌షిప్ సిల్వర్ మెడలిస్ట్ కిదాంబి శ్రీకాంత్‌తో పాటు పలువురు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. పారిస్ ఒలింపిక్స్ సెమీఫైనలిస్ట్ లక్ష్యసేన్‌కు ఈ టోర్నీలో రెండో సీడ్ లభించింది. తొలి రౌండ్‌లో బెల్జియం షట్లర్ జూలియన్ కర్రాగీతో తలపడతాడు. తరువాతి రౌండ్లలో చైనీస్ తైపీకి చెందిన ప్రపంచ 6వ ర్యాంకర్ చౌ టియెన్ చెన్ రూపంలో గట్టి ప్రత్యర్థి ఎదురయ్యే అవకాశం ఉంది. చౌతో ముఖాముఖి పోరులో లక్ష్యసేన్ 5-4 ఆధిక్యంలో ఉన్నారు. ఇండోనేషియా ఓపెన్‌లో తొలి రౌండ్‌లోనే నిష్క్రమించిన లక్ష్యసేన్... టోర్నీలో పుంజుకోవాలని చూస్తున్నాడు. ఇక ఐదో సీడ్ కిదాంబి శ్రీకాంత్... తొలి రౌండ్‌లో చైనీస్ తైపీకి చెందిన లియావో జువోఫుతో తలపడనున్నారు. భారత్ తరఫున సతీశ్ దయానంద్, శంకర్ ముత్తుస్వామి సుబ్రమణ్య కూడా ప్రధాన డ్రాకు అర్హత సాధించారు.

మహిళల సింగిల్స్ విభాగంలో మొత్తం ఏడుగురు భారత షట్లర్లు బరిలో దిగుతున్నారు. ఐదవ సీడ్ తన్వీ శర్మ, ఆరో సీడ్ దేవిక సిహాగ్ ఆశలు రేకెత్తిస్తున్నారు. ఇటీవల ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 క్వార్టర్‌ఫైనల్స్‌కు దూసుకెళ్లిన 17 ఏళ్ల తన్వీ...జర్మనీకి చెందిన ఇవోన్ లీతో తన తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ ఏడాది థాయ్‌లాండ్ మాస్టర్స్ సూపర్ 300, అజర్‌బైజాన్ ఇంటర్నేషనల్ టోర్నీల్లో టైటిల్స్ నెగ్గిన దేవిక.. తొలి రౌండ్‌లో పెరూకు చెందిన ఇనెస్ లూసియా కాస్టిల్లో సలాజర్‌తో ఆడనుంది. గత వారం జరిగిన మకావు ఓపెన్‌లో క్వార్టర్‌ఫైనలిస్ట్‌గా నిలిచిన అన్మోల్ ఖర్.. తొలి రౌండ్‌లో బల్గేరియాకు చెందిన కలోయానా నల్బంటోవాతో తలపడనుంది.

## వైల్డ్‌కార్డ్‌తో వింబుల్డన్‌లో దిగనున్న సెరెనా



**లండన్, జూన్ 21:** వింబుల్డన్ గ్రాండ్ స్లామ్ టోర్నీతో టెన్నిస్‌లోకి రీఎంట్రీ ఇస్తున్న 44 ఏళ్ల సెరెనా విలియమ్స్‌కు వైల్డ్‌కార్డ్ లభించింది. 2022లో రిటైరైన దిగ్గజ టెన్నిస్ క్రీడాకారిణి సెరెనా...నాలుగేళ్ల తర్వాత తిరిగి రాకెట్ పట్టనుంది. వచ్చే వారం ప్రారంభంకానున్న వింబుల్డన్ గ్రాస్ కోర్టులో పోటీపడేందుకు సెరెనాకు వైల్డ్‌కార్డ్ లభించింది. వైల్డ్ కార్డు జాబితాను నిర్వాహకులు విడుదల చేశారు. ఈ జాబితాలో సెరెనాకు చోటు దక్కింది. ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో సెరెనా విలియమ్స్ ఏకంగా ఏడుసార్లు వింబుల్డన్ టైటిల్ అందుకుంది. మాజీ ప్రపంచ నంబర్ వన్ సెరెనా... 23 సార్లు గ్రాండ్ స్లామ్ సింగిల్స్ నెగ్గింది. 2022 యూఎస్ ఓపెన్ తర్వాత ఇప్పటివరకు ఒక్క సింగిల్స్ మ్యాచ్ కూడా ఆడలేదు. ఈ వారం బెర్లిన్ ఓపెన్‌లో తన చెక్ డబుల్స్ భాగస్వామి కరోలినా ముచోవాతో కలిసి ఆడిన తొలి మ్యాచ్‌లోనే సెరెనా పరాజయం పొందింది. ఇక సెరెనా, ఆమె సోదరి వీనస్ విలియమ్స్‌లు మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌లో ఆడేందుకు వైల్డ్ కార్డు లభించింది. వీరిద్దరూ వింబుల్డన్‌లో ఆరుసార్లు డబుల్స్ విజేతలుగా నిలిచారు. అక్కడ చివరిసారిగా విజయం సాధించి దశాబ్దం గడిచింది.

# న్యూజిలాండ్‌కు ఈజిప్ట్ షాక్

## ఉరుగ్వేను నిలువరించిన కేప్‌వెర్డే


92 యేళ్ల తర్వాత ఈజిప్ట్‌కు తొలి గెలుపు

**వాంకోవర్, జూన్ 22:** సాకర్ ప్రపంచకప్‌లో ఈజిప్ట్ చరిత్ర సృష్టించింది. 92 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ తొలి విజయాన్ని అందుకుంది. గ్రూప్-జీలో భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈజిప్ట్ 3-1 గోల్స్ తేడాతో విజయం సాధించింది.ఫిఫా ప్రపంచకప్ చరిత్రలోనే ఈజిప్ట్ తొలిసారి గెలుపు రుచి చూసింది.1934లో ఫిఫా ప్రపంచకప్‌లో ఎంట్రీ ఇచ్చిన ఈజిప్ట్‌కు అప్పటి నుంచి ఇదే తొలి గెలుపు. జీరో, సలాహ్, ట్రెజెగెట్ గోల్స్ చేసి విజయంలో కీ రోల్ పోషించారు. దీంతో ఈజిప్ట్ అభిమానుల సంబరాలు అంబరాన్ని అంటాయి.

ఈ మ్యాచ్ తొలి అర్ధభాగంలో న్యూజిలాండ్‌దే ఆధిక్యం అంతా. దూకుడుగా ప్రారంభించిన న్యూజిలాండ్ ఫార్వర్డులు పదే పదే ఈజిప్ట్ గోల్ పోస్ట్‌పై దాడులకుదిగారు.సరబ్‌ప్రీత్ సింగ్, ఎలిజా జస్ట్ గోల్స్ చేసేందుకు ప్రయత్నించినా ఈజిప్ట్ అడ్డుకుంది. అయితే 15వ నిమిషంలో కార్నర్ నుంచి వచ్చిన బంతిని ఫిన్ సుర్మాన్ మెరుపు వేగంతో గోల్‌పోస్ట్ న్యూజిలాండ్‌ను ఆధిక్యంలో నిలిపాడు.స్కోరును సమంచేసేందుకు ఈజిప్ట్ తీవ్రంగానే ప్రయత్నించింది.సలాహ్, ఇమామ్ ఆషార్ ఇద్దరూ గోల్ చేసేందుకు చాలాదగ్గరగా వచ్చారు. కానీ న్యూజిలాండ్ గోల్‌కీపర్ అడ్డుగోడలా నిలిచాడు. దీంతో తొలి అర్ధభాగం ముగిసేసరికి న్యూజిలాండ్ 1-0 ఆధిక్యం నిలుపుకుంది.

**మూడు గోల్స్‌తో ఈజిప్ట్ జోరు**

రెండో అర్ధభాగంలో ఈజిప్ట్ చక్కని ప్రణాళికతో పుంజుకుంది. వెంటవెంటనే మూడు గోల్స్ చేసి న్యూజిలాండ్‌కు షాకిచ్చింది.రెండోఅర్ధభాగం ఆట ప్రారంభమైన కొద్ది సేపటికే న్యూజిలాండ్ మరో గోల్ కు దగ్గరగా వెళ్లింది. కాలమ్ మెకోవాట్ తలతో కొట్టిన బంతిని ఈజిప్ట్ గోల్ కీపర్ మోస్తఫా షోబీర్ అద్భుతంగా అడ్డుకున్నాడు. అనంతరం ఈజిప్ట్ ఆటగాడు జీరో ఫ్రీ 58వ నిమిషంలో హెడర్‌తో గోల్ చేసి 1-1తో సమఉజ్జీగా నిలిపాడు. ఆ తర్వాత 9 నిమిషాలకే సలాహ్ (67వ నిమిషం) బంతిని నెట్‌లోకి పంపించి ఈజిప్ట్‌కు ఆధిక్యం అందించాడు. ఈ ఆధిక్యాన్ని అలాగే కాపాడుకుంటూ ఈజిప్ట్ మ్యాచ్ ముగింపు దాకా తీసుకెళ్లింది. ఆట ముగియడానికి ఎనిమిది నిమిషాలు ఉండగా ట్రెజెగెట్ (82వ నిమిషం) ఈజిప్ట్‌కు మూడో గోల్ అందించి విజయం ఖాయం చేశాడు. దీంతో ఈజిప్ట్ సంబరాల్లో మునిగిపోయింది. తాజా విజయంతో ఈజిప్ట్ గ్రూప్-జీ పాయింట్ల పట్టికలో టాప్‌లోకి దూసుకెళ్లింది. దీంతో నాకౌట్ దశకు చేరువైంది. రెండు మ్యాచ్‌ల్లో ఒక డ్రా, ఒక గెలుపుతో ఈజిప్ట్ ఖాతాలో ప్రస్తుతం నాలుగు పాయింట్లు ఉన్నాయి.


కేప్ వెర్డే గోల్ సంబరం

**ఉరుగ్వేకు షాకిచ్చిన కేప్ వెర్డే**

గ్రూప్-హెచ్‌లో భాగంగా ఉరుగ్వే, కేప్ వెర్డే మధ్య జరిగిన మ్యాచ్ 2-2తో డ్రాగా ముగిసింది. సాకర్ వరల్డ్ కప్‌లో తొలిసారి ఆడుతున్న కేప్ వెర్డే వరుసగా రెండో మ్యాచ్‌లోనూ అద్భుత ప్రదర్శనతో ఆశ్చర్యానికి గురిచేసింది. గత వారం టోర్నీ ఫేవరెట్ స్పెయిన్‌కు షాకిచ్చిన ఈ పసికూన... తాజాగా రెండుసార్లు ప్రపంచ కప్ విజేత ఉరుగ్వే జోరుకు అడ్డుకట్ట వేసింది. అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి రెండో డ్రాను తన ఖాతాలో వేసుకుంది.

ఫస్టాఫ్‌లో ఉరుగ్వే రెండు గోల్స్, కేప్ వెర్డే ఒక గోల్ సాధించాయి. తొలి అర్ధభాగం 21వ నిమిషంలో కేప్ వెర్డే గోల్ సాధించి 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. కెవిన్ పినా సాకర్ ప్రపంచకప్‌లో కేప్ వెర్డేకు తొలి గోల్ సాధించి పెట్టాడు. ఫస్టాఫ్ ముగిసే చివరి నిమిషంలో ఉరుగ్వే రెండు మెరుపు గోల్స్ చేసింది. 44వ నిమిషంలో మాక్సీ అరౌజో తొలి గోల్ అందించగా,ఇంజ్యూరీ టైమ్(45+6నిమిషం)లో ఆగస్టిన్ కానోబియో వెంటవెంటనే గోల్స్ చేయడంతో ఉరుగ్వే 2-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

సెకండాఫ్‌లో కేప్ వెర్డే ఆటగాళ్లు అద్భుతంగా పుంజుకున్నారు.హీలియో వరేలా 61వ నిమిషంలో గోల్ సాధించి సమఉజ్జీగా నిలిపాడు. ఆ తర్వాత ఏ జట్టూ గోల్ చేయకపోవడంతో మ్యాచ్ డ్రా అయ్యింది. ఇరుజట్లకు ఒక్కో పాయింట్ లభించింది. దీనికి ముందు జరిగిన బెల్జియం, ఇరాన్ మ్యాచ్ గోల్ లెస్ డ్రాగా ముగిసింది.

# టిజి20 లీగ్‌లో రంగారెడ్డి రైజింగ్

**హైదరాబాద్, జూన్ 22 (వార్త క్రీడా ప్రతినిధి)**

తెలంగాణ టీ20 లీగ్ రెండో రోజు తొలి మ్యాచ్‌లో రంగారెడ్డి రైజర్స్ గెలుపొందింది. నల్గొండ నైట్స్‌పై 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన నల్గొండ నైట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. దివేశ్ సింగ్ మెరుపు ఇన్నింగ్స్‌తో నల్గొండ నైట్స్ 150మార్కు దాటింది. దివేష్ సింగ్ 27 బంతుల్లో 5 ఫోర్లు, ఓ సిక్స్‌తో 48 రన్స్‌తో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. చివర్లో హర్షవర్ధన్ సింగ్ 20 బంతుల్లో 40రన్స్‌తో మెరుపులు మెరిపించాడు. కెప్టెన్ రాహుల్ (30), వరుణ్ గౌడ్ (26), నితీశ్ రెడ్డి (20) పరుగులతో రాణించారు. రంగారెడ్డి బౌలర్లలో పున్నయ్య 3 వికెట్లు.. నితిన్, ఆర్యన్ చెరో రెండు వికెట్లు, తనయ్ ఒకవికెట్ పడగొట్టారు.


190 పరుగులల భారీ లక్ష్యాన్ని రంగారెడ్డి రైజర్స్ అలవోకగా అందుకుంది. 16.3 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని పూర్తిచేసింది. తనయ్ త్యాగరాజన్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. 30 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 71 రన్స్ సాధించాడు. అతనికి తోడుగా ఆదిత్య జవ్వాజి 32 బంతుల్లో 41 రన్స్, అవినాష్ రావు 6 బంతుల్లో 22, నితిన్ సాయి 9 బతుల్లో 26 రన్స్ మెరుపులు మెరిపించడంతో రంగారెడ్డి రైజర్స్ గెలుపు సునాయాసమైంది. నల్గొండ బౌలర్లలో అనికేత్ రెడ్డి, వరుణ్ గౌడ్ చెరో రెండేసి వికెట్లు తీశారు.



## తిలక్ వర్మ, అమన్ రావు సెంచరీల మోత

హైదరాబాద్, జూన్22(వార్త క్రీడా ప్రతినిధి): టీజీ20 లీగ్‌లో రెండో రోజు సెంచరీల మోత మోగింది. స్టార్ ప్లేయర్ తిలక్ వర్మ, అమన్ రావులు విధ్వంసం సృష్టించారు. దీంతో ఉప్పల్ స్టేడియంలో సోమవారం జరిగిన మెదక్ ఫాల్కన్స్, వరంగల్ వారియర్స్ మ్యాచ్‌లో పరుగుల వరద పారింది. మొదట వరంగల్ వారియర్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 258 రన్స్ చేసింది. వరంగల్ ఓపెనర్, కెప్టెన్ అమన్‌రావు మెరుపు సెంచరీ సాధించాడు. ఆరంభం నుంచే ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డ అమన్ 32 బంతుల్లోనే శతకం బాదేశాడు.దీంతో టోర్నీలో సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా ఘనత సాధించాడు. అమన్ రావు 48 బంతుల్లో 12 ఫోర్లు, 13 సిక్స్‌లతో 142 రన్స్ చేశాడు. అనంతరం మెదక్ ఫాల్కన్స్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ తిలక్ వర్మ విధ్వంసం సృష్టించాడు. 43 బంతుల్లో 12 ఫోర్లు, 6 సిక్స్‌లతో సెంచరీ సాధించాడు.అదే దాడి చివరి వరకు కొనసాగిస్తూ మరో రెండు బంతులుండగానే మెదక్ ఫాల్కన్‌కు ఒంటిచేత్తో తిలక్‌వర్మ మూడు వికెట్ల విజయాన్ని అందించాడు. 14 ఫోర్లు, 8 సిక్స్‌లతో 56 బంతుల్లో 136 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు.

# ఐటీ, ఫార్మా షేర్ల జోరుతో లాభాల్లో మార్కెట్లు



సెన్సెక్స్ 291, నిఫ్టీ 90 పాయింట్ల వృద్ధి

**ముంబై, జూన్ 22:** సోమవారం నాడు భారతీయ ఈక్విటీ సూచీలు లాభాలతో ముగిశాయి. ఐటీ, ఫార్మా రంగ షేర్లలో భారీ కొనుగోళ్లు జరగడం దీనికి ప్రధాన కారణంకాగా,ముడి చమురు ధరలు తగ్గడం కూడా పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచింది. సెన్సెక్స్ 291.17 పాయింట్లు (0.38 శాతం) పెరిగి 77,094.07 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 90 పాయింట్లు (0.37 శాతం) పెరిగి 24,102.90 వద్ద ముగిసింది. నిఫ్టీ సాంకేతిక స్థితిగతులపై స్పందిస్తూ, 24,200స్థాయి తక్షణ 'రెసిస్టెన్స్ జోన్' (అడ్డంకి స్థాయి)గా కొనసాగుతోందని నిపుణులు పేర్కొన్నారు. "ఈ స్థాయిని దాటి స్థిరంగా ముందుకు సాగితే బుల్లిష్(అప్‌ట్రెండ్) వేగం బలపడుతుంది. తద్వారా తదుపరి ముఖ్యమైన లక్ష్యమైన 24వేల 400 స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది" అని ఒక విశ్లేషకుడు తెలిపారు."అదే సమయంలో, కిందకు చూస్తే 24,000-23,900 స్థాయి కీలకమైన 'సపోర్ట్ జోన్' (మద్దతు స్థాయి)గా పనిచేస్తోంది" అని నిపుణులు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా చమురుధరలు తగ్గుతూ ఉండటం మార్కెట్ వర్గాల్లో ఉత్సాహాన్ని నింపింది, ఇది వివిధ రంగాలలో సానుకూల వాతావరణానికి దోహదపడింది.

ఐటీ, ఆరోగ్య సంరక్షణ (హెల్త్‌కేర్) రంగ షేర్లలో రోజంతా కొనసాగిన కొనుగోళ్ల కారణంగా ఈ లాభాలు నమోదయ్యాయి. నిఫ్టీ సూచీలో సిప్లా, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ అత్యుత్తమ పనితీరు కనబరిచిన వాటిలో ఉన్నాయి. ఈ షేర్లలోని బలమైన లాభాలు, వినియోగదారుల ఆధారిత రంగాలలో కనిపించిన బలహీనతను భర్తీ చేయడంలో సహాయపడ్డాయి. విస్తృత మార్కెట్ కూడా దృఢంగా ముగిసింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.34 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 0.6 శాతం పెరిగాయి. ఇది ప్రధాన షేర్ల (ఫ్రంట్‌లైన్ స్టాక్స్)కు మించి పెట్టుబడిదారుల ఆసక్తి కొనసాగుతోందని సూచిస్తోంది. వివిధ రంగాల సూచీలు మిశ్రమ ఫలితాలను నమోదు చేశాయి. రంగాల వారీ కొనుగోళ్లు, సానుకూల సెంటిమెంట్ కారణంగా నిఫ్టీ ఐటీ, నిఫ్టీ ఫార్మా, నిఫ్టీ హెల్త్‌కేర్ సూచీలు అతిపెద్ద లాభాలను ఆర్జించాయి. మరోవైపు, నిఫ్టీ ఎఫ్‌ఎంసిజి. నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ సూచీలు నష్టాలతో ముగిశాయి, దీంతో అవి ఆ రోజు అత్యంత పేలవమైన పనితీరు కనబరిచిన రంగాలుగా నిలిచాయి.

తగ్గిన ముడి చమురు ధరలు, డిఫెన్సివ్, టెక్నాలజీ స్టాక్‌లలో ఎంపిక చేసిన కొనుగోళ్లు మార్కెట్‌కు మద్దతునిచ్చాయని, అయితే కీలకమైన దేశీయ, ప్రపంచ ఆర్థిక పరిణామాల నేపథ్యంలో పెట్టుబడిదారులు అప్రమత్తంగా ఉన్నారని విశ్లేషకులు తెలిపారు.

# రూ.7,623 కోట్ల బ్యాంక్ కుంభకోణం కేసు

## ఇద్దరు రిలయన్స్ సంస్థ మాజీ సిఇఒల అరెస్ట్



**న్యూఢిల్లీ, జూన్ 22:** బ్యాంక్ రుణాలను దారి మళ్లించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రిలయన్స్ ఎడిఎ గ్రూప్ కేసులకు సంబంధించి, సెంట్రల్ బ్యూరోఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) సోమవారం ఇద్దరు మాజీ అధికారులను అరెస్టు చేసింది. వీరిలో రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్(ఆర్‌సిఎఫ్‌ఎల్) మాజీడైరెక్టర్, సిఇఒ దేవాంగ్ మోడీ, అలాగే రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్) మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సిఇఒ రవీంద్ర సుధాల్కర్ ఉన్నారు.

సిబిఐ తెలిపిన వివరాల ప్రకారం, ఈ ఇద్దరు మాజీ అధికారులు ప్రభుత్వ రంగ బ్యాంకులకు మొత్తం రూ.7,623 కోట్ల మేర అక్రమ నష్టాన్ని కలిగించారని ఆరోపణలున్నాయి. ఆర్‌సిఎఫ్‌ఎల్ కేసులో, నిందితులు 13 ప్రభుత్వ రంగ బ్యాంకులకు 4,097 కోట్ల నష్టాన్ని కలిగించారని ఏజెన్సీ పేర్కొంది.ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ కేసులో, 10ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ.3,526కోట్ల నష్టం వాటిల్లింది. తమకు,తమకు సంబంధించిన సంస్థలకు అక్రమ లబ్ధి చేకూర్చారని ఏజెన్సీ పేర్కొంది. వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకులు,ఎల్ఐసి నుండి అందినఫిర్యాదుల ఆధారంగా రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్(ఆర్‌కామ్), రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్), రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌సిఎఫ్‌ఎల్), రిలయన్స్ టెలికాం లిమిటెడ్ (ఆర్‌టిఎల్)లపై సిబిఐ ఏడు ఎఫ్‌ఐఆర్‌లను నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈకేసులు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఉన్నాయి.

ఆర్‌కామ్ కేసులో కంపెనీ, ఆర్‌కామ్‌కు చెందిన ఐదుగురు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, పది మంది బ్యాంకు అధికారులతో సహా 16 మంది నిందితులపై సిబిఐ 29.05.2026న తన మొదటి ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది.




# హార్ముజ్‌ను దాటిన 4 ఎరువుల నౌకలు

## నాలుగు రోజుల్లో కృష్ణపట్నం, కాకినాడ రేవులకు రెండు నౌకలు రాక

## మరో రెండు పారాదీప్, ముంద్రా ఓడరేవులకు చేరిక

**ముంబై, జూన్ 22:** భారత్‌కు ఎరువులను తీసుకువస్తున్న నాలుగు నౌకలు హార్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటాయి.అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం కుదిరినప్పటి నుండి, సుమారు 0.18 మిలియన్ టన్నుల ఎరువులు, వాటి తయారీకి అవసరమైన ముడి పదార్థాలను మోసుకెళ్తున్న నాలుగు నౌకలు, ఉద్రిక్తతలు నెలకొన్న హార్ముజ్ జలసంధిని సోమవారం సాయంత్రం దాటాయని ప్రభుత్వ ఉన్నతాధికారులు తెలిపారు. ఇందులో సుమారు 92,250.07 టన్నుల యూరియా ఉంది. పశ్చిమాసియాలో ఘర్షణలు మొదలైనప్పటి నుండి హోర్ముజ్ జలసంధిలో మొత్తం సుమారు 0.33 మిలియన్ టన్నుల యూరియా, 0.220.25మిలియన్ టన్నుల డిఎపి (డైఅమ్మోనియా ఫాస్ఫేట్) రవాణా నౌకలు నిలిచిపోయాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.శాంతిఒప్పందం తర్వాత జలసంధిని దాటిన నౌకలలో, సుమారు 50వేల టన్నులు, 42వేల750 టన్నుల యూరియాను మోసుకెళ్తున్న రెండునౌకలు రాబోయే రోజుల్లో కృష్ణపట్నం, కాకినాడ ఓడరేవులకు చేరుకోనున్నాయి.అలాగే, 32,251టన్నుల సల్ఫర్, 55వేల టన్నుల డిఎపిని మోసుకెళ్తున్న మరో రెండు నౌకలు పారాదీప్, ముంద్రా ఓడరేవులకు చేరుకోనున్నాయి. "ఈ కొత్త దిగుమతులు రాగానే, దేశంలో ఇప్పటికే ఉన్న ఎరువుల నిల్వలను భర్తీ చేయడానికి, వ్యవసాయ అవసరాలను తీర్చడానికి వెంటనే వాటిని దించుతారు"



# రెపో రేటు యథాతథం!

## ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదిక

**ముంబై, జూన్ 22:** పెరిగిన అనిశ్చితి నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధాన కమిటీ (ఎంపిసి) వేచి చూసే ధోరణిని కొనసాగించే అవకాశం ఉందని, తగ్గుతున్న ముడిచమురు ధరలు, బలపడిన రూపాయి ద్రవ్యోల్బణ ప్రమాదాలను తగ్గించగలవని అంచనా వేస్తున్నట్లు సోమవారం ఒక నివేదిక తెలిపింది. "తక్షణ చర్యలు తీసుకోవడానికి అనిశ్చితి చాలా ఎక్కువగా ఉంది. ప్రస్తుతానికి యథాతథంగా ఉంచండి, తటస్థంగా ఉండండి, స్పష్టత కోసం వేచి చూడండి. ప్రత్యామ్నాయాలను తెరిచి ఉంచండి అనేది ఎంపిసి సమావేశ నిమిషాలలోని అంతర్లీన సందేశం," అని ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదిక పేర్కొంది. సమీప భవిష్యత్తులో రుతుపవనాలే అత్యంత అనిశ్చితిని కలిగిస్తున్నాయని, జూన్ 2026 నాటికి ఇప్పటివరకు 42 శాతం లోటుతో, గత 126 ఏళ్లలో ఐదవ అత్యంత పొడి నెలగా నిలుస్తుందని నివేదిక పేర్కొంది. సానుకూల హిందూ మహాసముద్ర ద్విధ్రువం కొంత ఉపశమనం కలిగించవచ్చని కూడా పేర్కొంది. ముడిచమురు ధరల తగ్గుదల, రూపాయి విలువ పెరగడం దిగుమతి ద్రవ్యోల్బణాన్ని తగ్గించి, వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ద్రవ్యోల్బణాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లక్ష్య పరిధిలో ఉంచడంలో సహాయపడతాయి.


అంచనాలు వాస్తవ ద్రవ్యోల్బణాన్ని గణనీయంగా మించిపోవడంతో, వినియోగదారుల విశ్వాసం సన్నగిల్లింది, దీనివల్ల కుటుంబాలు విచక్షణతో చేసే ఖర్చుల విషయంలో జాగ్రత్త వహిస్తున్నాయి. "ఈ తరుణంలో వడ్డీ రేట్ల పెంపు గురించి మాట్లాడటం అనవసరం అని మేము భావిస్తున్నాము... అనిశ్చిత సమయాల్లో, ఒక మంచి కేంద్ర బ్యాంకు తప్పుడు కచ్చితత్వం విషయంలో జాగ్రత్తగా ఉండాలి, టెయిల్ రిస్క్‌లకు వ్యతిరేకంగా దృఢంగా వ్యవహరించాలి, విశ్వసనీయతను కాపాడుకోవడానికి తగినంత క్రమబద్ధంగా ఉండాలి, పరిస్థితులకు అనుగుణంగా మారడానికి తగినంత సరళంగా ఉండాలి," అని ఆ నివేదిక పేర్కొంది. అరేబియా సముద్రంపై సోమాలియా జెట్ బలహీనపడటం వల్ల రుతుపవనాలు మందకొడిగా ఉన్నాయని, అయితే రాబోయే వారాల్లో ఈ జెట్ బలపడి, భారతదేశ పశ్చిమ తీరానికి తేమ ప్రవాహాలు పెరగవచ్చని అంచనాలు సూచిస్తున్నాయని ఆ పరిశోధనా సంస్థ తెలిపింది.


# భారత్‌లో డేటా సెంటర్ల విప్లవం: ఎఐతో భారీ డిమాండ్

**న్యూఢిల్లీ, జూన్ 22:** భారత్‌లో డేటా సెంటర్ల విప్లవం రాబోతోందని ప్రముఖ అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ సాక్స్ తన తాజా నివేదికలో వెల్లడించి.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ),క్లౌడ్ కంప్యూటింగ్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో, ఆసియాలోనే అత్యంత వేగంగావృద్ధిచెందుతున్న డేటా సెంటర్ మార్కెట్‌గా భారత్ అవతరిస్తోందని పేర్కొంది. దేశంలోని యువ జనాభా, అపారమైన ఇంజినీరింగ్ నైపుణ్యం కలిగిన మానవవనరులు, ప్రభుత్వ సానుకూల విధానాలు ఈ రంగానికి మరింత ఊతమిస్తున్నాయని వివరించింది.

ముంబై, చెన్నై నగరాలు డేటా సెంటర్లకు ప్రధాన గమ్యస్థానాలుగా మారాయి. సబ్‌మెరైన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ల లభ్యత ఇందుకు ప్రధాన కారణం కాగా, ఆ తర్వాతి స్థానాల్లో ఢిల్లీ-ఎన్‌సిఆర్, బెంగళూరు నగరాలు కొనసాగుతున్నాయి. వీటికి తోడు పశ్చిమాసియా దేశాలకు వ్యూహాత్మకంగా చేరువలో ఉండటం కూడా భారత్‌కు కలిసొచ్చే అంశమని నివేదిక పేర్కొంది.

ఈ రంగానికి సంబంధించిన తాజా గణాంకాలు కూడా ఇదే వృద్ధిని ధ్రువీకరిస్తున్నాయి. నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక ప్రకారం, దేశంలోని డేటా సెంటర్ల సామర్థ్యం గత ఏడాది చివరి నాటికి 1.6 గిగావాట్లకు చేరుకుంది. ప్రస్తుతం మరో 0.32 గిగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లు నిర్మాణ దశలో ఉండగా, 2.92 గిగావాట్ల సామర్థ్యం పనుల కోసం వివిధ సంస్థల మధ్య చర్చలు జరుగుతున్నాయి.





## బ్యాంకింగ్, మార్కెట్, రక్షణ రంగాల ప్రముఖులతో

# ఆర్థిక మంత్రి నిర్మల వరుస భేటీలు

**న్యూఢిల్లీ, జూన్ 22:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం ఆర్థిక, చెల్లింపుల, కమోడిటీ మార్కెట్లు,రక్షణ రంగాల కీలక ప్రతినిధులతో పలు ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఆర్థిక వ్యవస్థలోని కీలక విభాగాలు, జాతీయ సంస్థలలోని భాగస్వాములతో ప్రభుత్వం కొనసాగిస్తున్న సంప్రదింపులకు ఇది నిదర్శనం. ప్రపంచ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నీలకంఠ మిశ్రా, పరస్పర ఆసక్తి గల అంశాలపై చర్చించేందుకు ఆర్థిక మంత్రిని కలిశారని, ఆర్థికమంత్రి 'ఎక్స్'లో తెలిపారు. ఆర్థిక వృద్ధి, అభివృద్ధికి ఆర్థిక సహాయం, ప్రపంచ ఆర్థిక సవాళ్లపై భారతదేశం బహుళపక్ష సంస్థలతో సన్నిహితంగా సంప్రదింపులు జరుపుతున్న తరుణంలో ఈ సమావేశం జరిగింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దిలీప్ ఆస్బే ఆర్థిక మంత్రిని కలిశారు. డిజిటల్ చెల్లింపులలో భారతదేశం వేగంగా టవిస్తరిస్తున్న నేపథ్యంలో, దేశ చెల్లింపుల మౌలిక సదుపాయాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పెరుగుతున్న తరుణంలో ఈ సంప్రదింపులు ముఖ్యమైనవిగా పరిగణించబడు తున్నాయి. ఆర్థిక మంత్రి కమోడిటీ క్యాపిటల్ మార్కెట్ పార్టిసిపెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సిపిఎఐ) ప్రతినిధి బృందంతో కూడా సమావేశమయ్యారు. ఈ చర్చలు వస్తు, మూలధన మార్కెట్లు, విస్తృత ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అంశాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, భారత నౌకాదళ అధిపతి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్, ఆర్థిక మంత్రి సీతారామన్‌ను కలిశారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.